



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 19 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | గురువారం 9 అక్టోబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-




## భారత్‌కు బ్రిటన్ ప్రధాని స్టార్మర్

- రెండు రోజుల పర్యటన నిమిత్తం 125 మంది వాణిజ్య, విద్య, సంస్కృతిక రంగాల ప్రముఖులతో కూడిన భారీ బృందంతో
- భారత్, యూకే మధ్య స్వేచ్ఛా వాణిజ్య కుదిరిన ఇటీవల ఒప్పందం

5



## 'అమెరికా' ఒత్తిళ్లకు తలొగ్గామని మీరే అన్నారు కదా?

- ప్రధాని మోదీ ధ్వజం
- 2008లో దేశ వాణిజ్య రాజధాని ముంబైపై ఉగ్రవాదులు భీకర దాడికి దిగితే కాంగ్రెస్ ఏం చేసింది?.
- 26/11 అనేది దేశంపై జరిగిన అత్యంత జుగుప్సాకరమైన ఉగ్రదాడి
- అయినా ఆ దాడికి పాల్పడిన వారిపై ప్రతీకారం తీర్చుకోలేదు

# పెట్టుబడుల వెల్లువ

- రూ.87,520 కోట్లతో విశాఖలో ఏఐ డేటా సెంటర్
- రాష్ట్రానికి తొలి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి
- గూగుల్ అనుబంధ సంస్థ 'రైడెన్'కు రైట్‌రైట్
- ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం
- మొత్తం 1,14,824 కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- వీటితో 67,218 మందికి ఉద్యోగావకాశాలు
- ఐటీ, ఇంధన, ఫుడ్‌ప్రాసెసింగ్ ప్రాజెక్టులకు ఓకే
- మహారాష్ట్రకు ముంబై ఒక్కటే.. మనకు 3 హబ్‌లు
- విశాఖ, అమరావతి, తిరుపతి హబ్‌లపై ఫోకస్



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**
నవ్యాంధ్రకు మొదటిసారి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) రానుంది. విశాఖలో భారీ స్థాయిలో రూ.87,520 కోట్ల పెట్టుబడితో వెయ్యి మెగావాట్ల సామర్థ్యం కలిగిన కృత్రిమ మేధ డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ చేసిన ప్రతిపాదనను రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో బుధవారం జరిగిన 11వ ఎస్ఐపీబీ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, కె.అచ్చెన్నాయుడు, పి.నారాయణ, టీజీ భరత్, కందుల దుర్గేశ్, బీసీ జనార్దన్‌రెడ్డి, వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు పాల్గొన్నారు. దాదాపు మూడు గంటలు జరిగిన భేటీలో పెట్టుబడులకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. - మిగతా2లో



## రాష్ట్ర, జిల్లా ప్రధాన రోడ్లకు వెయ్యి కోట్లు

- రహదారులపై ప్రభుత్వ హామీ అమల్లోకి
- పనుల కోసం పరిపాలనా అనుమతులు

2లో

## నకిలీ మద్యంపై ఉక్కుపాదం

- రాష్ట్రంలో ఆ మద్యం ఎక్కడా కనిపించకూడదు
- తయారీదారులను ఏమాత్రం ఉపేక్షించొద్దు
- మద్యంపై ఫేక్ ప్రచారాన్ని తిప్పికొట్టండి
- పోలీసు, ఎక్సైజ్ శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**
రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీని ఏమాత్రం ఉపేక్షించొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. నకిలీతో ప్రజల ప్రాణాలు హరించే వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా అలాంటి మద్యం తయారీ కేంద్రాలుగానీ, తయారుచేసే వ్యక్తులు కూడా ఉండకూడదని స్పష్టంచేశారు. నకిలీ మద్యం వ్యవహారంపై పోలీసు, ఎక్సైజ్ శాఖలతో బుధవారం సచివాలయంలో సమీక్షించారు. ములకలచెరువు కేసులో ఇప్పటివరకూ 21 మందిని నిందితులుగా గుర్తించామని, అందులో ఇప్పటివరకూ 12 మందిని అరెస్టు చేశామని అధికారులు వివరించారు. ఏ1గా ఉన్న అద్దేపల్లి జనార్దన్‌రావు లావాదేవీలు, వ్యాపారాలపై విచారణ చేస్తున్నామన్నారు. ఇబ్రహీంపట్నంలో దొరికిన నకిలీ మద్యం వ్యవహారంలో 12 మందిని నిందితులుగా గుర్తించి, ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఎంకు వివరించారు. - మిగతా2లో

## బాల్యం 'కిడ్నాప్' అవుతోంది

- చిన్నారులపై ఏటా పెరుగుతున్న నేరాలు
- 2023లో దేశంలో 1,77,335 కేసులు నమోదు
- 2022తో పోలిస్తే ఏపీలో తగ్గిన తగ్గిన కేసులు
- ఛార్జిషీటు నమోదు రేటులో ఏపీ టాప్-2

5

ఎన్‌సీఆర్‌బీ - 2023 నివేదికలో వెల్లడి





# బాణసంచా పేలుడుకు ఏడుగురు బలి

- కోనసీమ జిల్లా రాయవరంలో విషాదం.. మృతుల్లో తయారీ కేంద్రం యజమాని
- దీపావళి ఆర్డర్ల కోసం పనులు చేస్తుండగా నిప్పురవ్వలు ఎగసిపడి పేలుళ్లు
- ఆరుగురు అక్కడికక్కడే సజీవ దహనం.. చికిత్స పొందుతూ మరో కూలీ మృతి
- మృతుల్లో నలుగురు మహిళా కూలీలూ.. బాధాకరం: మోదీ.. ఆదుకుంటాం: పవన్

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**
బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలోని బాణసంచా తయారీ కేంద్రంలో బుధవారం భారీ విస్ఫోటనం సంభవించింది. దీపావళి ఆర్డర్ల కోసం పనిచేస్తున్న ఏడుగురు కూలీలు సజీవ దహనమయ్యారు. పండగ దగ్గర పడటంతో తానే దగ్గరుండి పనులు చేయిస్తున్న యజమాని సైతం ఈ ప్రమాదంలో మృత్యువాతపడ్డారు. మృతుల్లో నలుగురు మహిళలు ఉన్నారు. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. విస్ఫోటనం ధాటికి తయారీ కేంద్రంలోని గోడ కూలిపోయింది. పేలుడు తీవ్రతకు సమీపంలోని గృహాలు కంపించిపోయాయి. వివరాల్లోకి వెళితే.. రాయవరం శివారు ప్రాంతంలో తొమ్మిది దశాబ్దాలుగా శ్రీలక్ష్మీగణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్ పేరుతో బాణసంచా తయారీ కేంద్రం నడుస్తోంది. వివిధ జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాలకు సైతం ఇక్కడి నుంచి దీపావళి సామగ్రి తరలిస్తుంటారు. ఎప్పుడూ 40 మందికి పైగానే కూలీలు పనిచేస్తుంటారు. అయితే, మధ్యాహ్నం భోజన విరామ సమయం కావడంతో చాలామంది భోజనానికి వెళ్లారు. దీంతో భారీగా ప్రాణనష్టం తప్పింది. యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి అలియాస్ సత్తిబాబు పర్యవేక్షణలో ప్రమాద సమయంలో ఏడుగురు పని చేస్తున్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. చిచ్చుబుడ్డు తయారుచేసి శాంపిల్‌గా దానిని వెలిగించారు. అది మండిన వెంటనే నిప్పురవ్వలు ఎగిసిపడ్డాయి. తయారీ కేంద్రంలోనే స్టాకు పాయింట్ కూడా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. చూస్తుండగానే తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటనం చోటుచేసుకుంది. మంటలు అలుముకోగానే.. లోపలకు వెళ్లి సరుకును బయటకు తీసుకువచ్చేందుకు - మిగతా2లో



## ప్రకృతి వైపరీత్యాల వేళ ఎస్ఐఆర్ ఎలా సాధ్యం?

- పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ
- "ఎన్నికలు జరగాల్సిన రాష్ట్రాల్లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టాలని ఎన్నికల కమిషన్‌పై భాజపా అగ్రనాయకత్వం ఒత్తిడి తెస్తోంది
- ఆ పార్టీ నేతలు ఇక్కడకు వచ్చి సమావేశాలు పెడుతున్నారు
- రాష్ట్రంలో ఓటరు జాబితా నుంచి లక్షలాది పేర్లను తొలగిస్తామని చెబుతున్నారు.

5లో

# బాణసంచా పేలుడుకు ఏడుగురు బలి

-మొదటిపేజీ తరువాయి

చేసే ప్రయత్నంలో సత్తిబాబు సజీవ దహనమైనట్టు సమాచారం. కాగా, ప్రమాదంపై పోలీసుల కథనం భిన్నంగా ఉంది. చిచ్చుబుడ్డి తయారీ కోసం మందు కూరుతుండగా ఒక్కసారిగా నిప్పురవ్వలు ఎగసిపడ్డాయని ఏలూరు రేంజ్ డీఐజీ అకోశ్‌కుమార్ తెలిపారు. కాగా, మృతులను సోమేశ్వరం గ్రామానికి చెందిన పాకా అరుణ (33), అనపర్తి సావరానికి చెందిన చిట్టూరి శ్యామల (38), కుడుపూడి జ్యోతి (38), అనపర్తి గ్రామానికి చెందిన పెంకే శేషారత్నం(35), ఒడిశాకు చెందిన కె.సదానందం (50)గా వీరిని గుర్తించారు. బిక్కవోలు మండలం కొమరిపాలేనికి చెందిన పట్నూరి వెంకటరమణ (50) కాకినాడలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.

**వంటిపై గుర్తుల ఆధారంగా..**

మృతదేహాలు గుర్తుపట్టలేనివిధంగా కాలి బూడదయ్యాయి. దీంతో వంటిపై గుర్తుల ఆధారంగా మృతదేహాలను గుర్తించాల్సి వచ్చింది. చేతికి ఉన్న ఉంగరం ఆధారంగా యజమాని సత్తిబాబు మృతదేహాన్ని గుర్తించారు. కాగా, తీవ్రంగా గాయపడిన నలుగురికి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఒకరిద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని సమాచారం. విస్ఫోటనానికి కారణాలను విశ్లేషించేందుకు అమరావతి నుంచి ఫోరెన్సిక్ సైన్స్ నిపుణుల బృందం వస్తోందని కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా తెలిపారు.

**పరిస్థితి సమీక్షించిన హెూం మంత్రి**

బాణసంచా పేలుడు సమాచారం తెలిసిన వెంటనే హెూంమంత్రి వంగలపూడి అనిత ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అధికారులతో కలిసి సమీక్షించారు.





మొత్తం ఘటనపై విచారణ జరిపిస్తామని తెలిపారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని సీఎం ఆదేశించారని తెలిపారు.15రోజుల కిందటే సిబ్బంది ఈ కేంద్రంలో తనిఖీలుచేసి సంతృప్తి వ్యక్తంచేశారన్నారు.

**చర్యలు చేపట్టాలి : పవన్ కల్యాణ్**

బాణసంచా పేలుడు ప్రమాదంపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందేలా చూడాలని సూచించారు. బాణసంచా కేంద్రాల్లో, గోదాముల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు అమలయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**బాధాకరం: ప్రధాని**

కోనసీమ జిల్లాలో బాణసంచా ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. " బాణసంచా తయారుచేస్తుండగా జరిగిన ప్రమాదంలో ప్రాణనష్టం చోటుచేసుకోవడం బాధించింది. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలి" అని 'ఎక్స్'లో ఆకాంక్షించారు.

# పెట్టుబడుల వెల్లువ

-మొదటిపేజీ తరువాయి

రూ.1,14,824 కోట్ల పెట్టుబడులతో .. 67,218 మందికి ఉద్యోగాలు కల్పించే ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. మహారాష్ట్రకు ముంబై ఒక్కటే ఎకనామిక్ హబ్‌గా ఉంటే.. మన రాష్ట్రానికి విశాఖపట్నం, అమరావతి, తిరుపతి మూడు ఎకనామిక్ హబ్‌లు ఉన్నాయని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఈ మూడు హబ్‌లను సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో పెట్టుబడులు ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని మంత్రులు, ఉన్నతాధికారులకు సూచించారు. రాష్ట్రంలోని మూడు ఎకనామిక్ కారిడార్‌లనూ గ్రోత్ హబ్‌లుగా వినియోగించుకోవాలన్నారు.

క్వాంటం వ్యాలీ తరహాలోనే రాష్ట్రానికి వస్తున్న డేటా సెంటర్లు.. టెక్నాలజీ రంగంలో కీలక మలుపుగా అభివర్ణించారు. విశాఖ పారిశ్రామికాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఎకనామిక్ కారిడార్ తరహాలోనే రాయలసీమలోనూ ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ ఈ భేటీలో ప్రతిపాదించారు. మూడు ప్రాంతాలనూ పారిశ్రామిక జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలన్నారు. ఈ సూచనలతో ముఖ్యమంత్రి ఏకీభవించారు. విశాఖ కేంద్రంగా శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి దాకా విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అమరావతి కేంద్రంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ప్రకాశం జిల్లా వరకూ మరో ఎకనామిక్ రీజియన్, తిరుపతి కేంద్రంగా నెల్లూరు, రాయలసీమ జిల్లాలతో మరో జోన్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

**ఆగ్రోప్రాసెసింగ్ హబ్‌గా సీమ**

రాయలసీమలో ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్ సిటీ, ఆటోమొబైల్ రంగ కారిడార్లు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. వీటితో పాటు ఉద్యాన పంటలకు కేంద్రంగా రాయలసీమ ఆగ్రోప్రాసెసింగ్ హబ్‌గా మారుతుందన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లును అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతంగా తయారు చేయాలని.. దీనికోసం ల్యాండ్ బ్యాంకును ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**రంగాలవారీగా ఆమోదించిన పెట్టుబడులివీ..**

విశాఖలో గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫో టెక్ ఆధ్వర్యంలో కృత్రిమ మేథ డేటా సెంటర్ ఏర్పాటుకు ఆమోదం. రూ.87,520 కోట్ల పెట్టుబడితో 200 మందికి ఉద్యోగావకాశాలు. రైడెన్ ఇన్ఫోటెక్ సంస్థకు సబ్సిడీ ధరకు విశాఖలో భూమి. ఆర్థిక, ఆర్థికేతర ప్రోత్సాహకాలను అందించేందుకు ఆమోదం.
రాష్ట్రంలో ఏఐలో శిక్షణ కేంద్రం ఏర్పాటుకు రూ.140 కోట్ల పెట్టుబడితో ఇమేజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌కు ఆమోదం. దీనిద్వారా 3,600 మందికి ఉద్యోగాలు.
ఇంధన రంగంలో రూ.16,920 కోట్ల పెట్టుబడులకు పచ్చజెండా. ఇందులో అనంతపురంలో రూ.2,000 కోట్ల పెట్టుబడులతో 400 మెగావాట్ల ఏసీ/580 మెగావాట్ల డీసీ, 800 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ నెలకొల్పేందుకు ఆక్మే ఊర్జా వన్ సంస్థ చేసిన ప్రతిపాదనలకు ఆమోదం. 1,380 మందికి ఉద్యోగాలు. ఇదే జిల్లాలో రూ.2 వేల కోట్ల పెట్టుబడితో టాటా పవర్ రెన్యువబుల్స్ ఎనర్జీ లిమిటెడ్ 400 మెగావాట్ల ఏసీ, 560 మెగావాట్ల డీసీ సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఆమోదం, 1,380 మందికి ఉద్యోగాలు. విజయనగరంలో రూ.12,905 కోట్లతో దుగ్గేరు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ఏర్పాటుకు చింతా గ్రీన్‌ఎనర్జీకి అనుమతి.ఆంపిన్ ఎనర్జీ ట్రాన్సిసన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలోరూ.15.10 కోట్లతో కర్నూలు, నంద్యాలలో 2.30 మెగావాట్లతో సోలార్, విండ్ పవర్ ప్లాంటు ఏర్పాటుకు ఆమోదం.
ఫుడ్‌ప్రాసెసింగ్ రంగంలో రూ.1,200 కోట్ల పెట్టుబడులకు సమ్మతి.. రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ 2024–29 ఫుడ్‌ప్రాసెసింగ్ పాలసీ మేరకు ఆహార తయారీ ఉత్పత్తులను అందించేందుకు చేసిన ప్రతిపాదనలకు ఆమోదం. రూ.758 కోట్ల పెట్టుబడితో 500 మందికి ఉద్యోగాలను కల్పిస్తారు. ప్యాకేజ్డ్ ఫుడ్ తయారీ–విక్రయాల్లో రూ.208 కోట్ల పెట్టుబడికి గోద్రెజ్ ఆగ్రోవెట్‌కు గ్రీన్‌సిగ్నల్. సోయా ఉత్పత్తుల తయారీకి రూ.201 కోట్లతో ఎస్‌వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్ చేసిన పెట్టుబడి ప్రతిపాదనకు ఆమోదం. అలాగే ఆహార ఉత్పత్తుల తయారీకి రూ.33 కోట్లతో ఫ్రెష్ బౌల్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్ చేసిన ప్రతిపాదనకూ ఆమోదం. పర్యాటకంలో రూ.858 కోట్ల పెట్టుబడి.. 1098 మంది ఉద్యోగావకాశాలు. ఇందులో మెస్సర్స్ దసపల్లా అమరావతి హెూటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ అమరావతిలో రూ.200 కోట్ల పెట్టుబడులతో నిర్మించే హెూటల్ నిర్మాణానికి ఆమోదం. అరకు లోయలో రూ.55 కోట్లతో వీఎసకే హెూటల్స్, రిసార్ట్స్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్. శ్రీకాకుళంలో రూ.83 కోట్ల పెట్టుబడితో లాడ్జి హెూటల్ నిర్మాణానికి శ్రీవేంకటేశ్వర లాడ్జ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఆమోదం. అమరావతిలో మెస్సర్స్ సదరన్ గ్లోబ్ హెూటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.177 కోట్లతో హెూటల్ నిర్మాణానికి అనుమతి. పారిశ్రామిక రంగంలో రూ.5,800 కోట్ల పెట్టుబడులు.. వీటితో 6,646 మందికి ఉపాధి కల్పించే ప్రతిపాదనలకు ఆమోదం.

# నకిలీ మద్యంపై ఉక్కుపాదం

-మొదటిపేజీ తరువాయి

ములకలచెరువు వ్యవహారంపై రాజకీయ పక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఈ సందర్భంగా సీఎం అన్నారు. నకిలీ మద్యం రాష్ట్రమంతటా ఉందంటూ ప్రజల్ని భయపెడుతున్నారని, ప్రతి మూడు సీసాల్లో ఒక నకిలీ అని ఫేక్ ప్రచారం చేస్తున్నారని చెప్పారు. తప్పుడు ప్రచారాన్ని మంత్రులు అర్థంచేసుకుని, ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని ఆదేశించారు. నకిలీ మద్యం కారణంగానే అక్కడ చనిపోయారు, ఇక్కడ చనిపోయారు అంటూ ప్రచారం చేస్తున్నారని, ప్రతి ఆరోపణపైనా విచారణ జరపాలని అధికారులకు స్పష్టంచేశారు. అవసరమైతే మృతికి కారణాలను సైంటిఫిక్ విధానంలో తెలుసుకుని వాస్తవాలు వెల్లడించాలన్నారు. ఏది నిజమో చెప్పడంతో పాటు రాజకీయ కుట్రతో తప్పుడు ప్రచారాలు చేసేవారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీ మద్యంతో చనిపోయారని ఎవరైనా అంటే దానికి రుజువులు అడగాలని, తప్పుడు ప్రచారం అని తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మీడియాలోనైనా, సోషల్ మీడియాలోనైనా తప్పుడు ప్రచారం చేస్తే ఉపేక్షించవద్దన్నారు.

**వైసీపీ డ్రామాలు మర్చిపోవద్దు**

2019లో వివేకానందరెడ్డి హత్య కేసులో వైసీపీ ఆడిన డ్రామాలు మర్చిపోద్దని ఈ సందర్భంగా మంత్రులకు సీఎం సూచించారు. ప్రజలను నమ్మించేందుకు వైసీపీ వాళ్లు చేసే తప్పుడు ప్రచారాలను మంత్రులు



తిప్పికొట్టాలన్నారు. ఈ విషయంలో మరింత చురుగ్గా ఉండాలని సూచించారు. వైసీపీ గత చరిత్ర, రాజకీయ కుట్రలను ప్రజల్లో పెట్టి ఎండగట్టాలన్నారు. ప్రతి ఘటన, సమస్యపై ప్రభుత్వం స్పందిస్తుండటంతో విమర్శలు చేయడానికి వైసీపీకి కారణాలు దొరకడం లేదని, అందుకే తప్పుడు ప్రచారాలతో రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల హామీలన్నీ అమలుచేయడంతో వేరే కారణాలు దొరక్క వైసీపీ ఫేక్ ప్రచారాలను నమ్ముకుందన్నారు. ఏది మంచి, ఏది చెడో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మంత్రులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. సమీక్షలో మంత్రి కొల్లు రవీంద్ర, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## రాజ్‌భవన్‌కు రూ.212 కోట్లు

**అమరావతిలో నిర్మాణానికి సీఆర్‌డీఏ అథారిటీ ఆమోదం**
**రాజధానితో పాటు రైతులూ అభివృద్ధి చెందాలి**
**అధికారులకు చంద్రబాబు ఆదేశం**

అమరావతి

రాజధాని అమరావతిలో రూ. 212 కోట్ల వ్యయంతో గవర్నర్ నివాసం రాజ్‌భవన్ నిర్మాణానికి సీఆర్‌డీఏ అథారిటీ ఆమోదం తెలిపింది. కృష్ణా నది ఒడ్డున అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ నిర్మాణంలో భాగంగా రాజ్‌భవన్ నిర్మాణ జరగనుంది. దీనికి సంబంధించిన డిజైన్ అద్భుతంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం అధ్యక్షతన 53వ సీఆర్‌డీఏ అథారిటీ సమావేశం జరిగింది. మొత్తంగా 18 అంశాలపై అథారిటీ సమావేశంలో చర్చించారు. మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి 25 శాతం నిధులను సీఆర్‌డీఏ ఇచ్చేందుకు, రాజధాని ప్రాంతంలో నాలుగు కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి అథారిటీ అంగీకరించింది. రాజధాని నగర జోనింగ్ నిబంధనల్లో గ్రీన్ సర్టిఫైడ్ భవనాలు ఉండేలా అవసరమైన మార్పులకు అథారిటీ ఆమోదించింది. అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా సీఆర్‌డీఏ వ్యవహరించడానికి అంగీకరించింది. హ్యాపీనెస్ట్, ఏపీ ఎన్ఆర్‌టీ ప్రాజెక్టులకు చెందిన భవనాల అనుమతుల ఫీజు మాఫీకి, రాజధానిలో నిర్మించే హెూటళ్ల పార్కింగ్ నిబంధనల్లోనూ స్వల్ప మార్పులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొండవీడు వాగు సమీపంలో 8400 క్యూసెక్కుల సామర్థ్యంతో మరో పంపింగ్ స్టేషన్ నిర్మాణానికి అథారిటీ నిర్ణయించింది. దీంతో పాటు మరికొన్ని సాంకేతిక అంశాలకు, పరిపాలన అంశాలకు అథారిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సీఎం కొన్ని సూచనలు చేశారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పార్కింగ్ సమస్య లేకుండా చూడాలన్నారు. రోడ్డుపై వాహనాల పార్కింగ్ చేసే పరిస్థితి రాకూడదన్నారు. విజయవాడ, గుంటూరు, మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్లు, తెనాలి మున్సిపాలిటీ, రాజధాని ప్రాంతంతో అనుసంధానం చేయాలని, బ్లూగ్రీన్ అమరావతిగా రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే.. "అమరావతితో పాటు రాజ?ధానికి భూములిచ్చిన రైతులు కూడా అభివృద్ధి చెందాలి. భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను తక్షణమే ఇవ్వాలి. భూములను త్యాగం చేసిన రైతులకే రాజధాని అభివృద్ధి ఫలాలు మొదటగా అందాలి. రాజధాని రైతులకు కౌలు చెల్లింపుల్లోనూ ఎలాంటి జాప్యం జరగకూడదు. రైతులకు ఎక్కడ రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తామని చెప్పామో..అక్కడే ఇవ్వాలి. ఏ ఊళ్లో భూములిచ్చిన వారికి ఆ ఊళ్లోనే ప్లాట్లు ఇస్తామన్నాం. అలాగే కేటాయింపులు చేయాలి.రాజధాని నిర్మాణపనుల్లో మరింతవేగం పెంచాలి. సెక్రటేరియట్ టవర్లతో సహా ఇతర నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి. వెస్ట్ బైపాస్ రోడ్డును వెంటనే ప్రారంభించేచర్యలు తీసుకోవాలి. కరకట్ట రోడ్డును విస్తరించాలి. మూడు నెలల్లో రాజధాని నగరానికి ఒక రూపు తీసుకురావాలి" అని చెప్పారు. ఈ సమావేశానికి మంత్రి నారాయణ, సీఎస్ విజయానంద్ తదితరులు హాజరయ్యారు.

## రాష్ట్ర, జిల్లా ప్రధాన రోడ్లకు వెయ్యి కోట్లు

అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం రహదారుల విషయంలో ఇచ్చిన హామీలు ఒక్కటొక్కటిగా అమల్లోకి వస్తున్నాయి. రాష్ట్ర ప్రధాన రహదారులు (స్టేట్‌హైవేలు), జిల్లా ప్రధాన రహదారుల (ఎండీఆర్) నిర్మాణం కోసం రూ.1000 కోట్లు విడుదలకు పరిపాలనా అనుమతి ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2104.09 కిలోమీటర్లను వెయ్యి కోట్లతో నిర్మించేందుకు ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ చీఫ్ ఇచ్చిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిది. ఇందులో స్టేట్‌హైవేలు 771.95 కిలోమీటర్లు, 108 వర్క్‌లు, ఎండీఆర్ 1332.14 కిలోమీటర్లు, 166 వర్క్‌లకు నిధులు మంజూరు చేస్తూ ఆర్అండ్‌బీ ముఖ్యకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో స్టేట్ హైవే వర్క్‌లకు రూ.400 కోట్లు, ఎండీఆర్ ప్లాన్‌కు రూ.600 కోట్లు కేటాయించారు. గతంలో ఎమ్మెల్యేలు,ఎంపీలు, జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన ప్రతిపాదనలను క్రోడీకరించి వర్క్‌లను ఎంపిక చేసి వాటికి పరిపాలనా అనుమతి ఇచ్చారు. ఇందులో నూతన రహదారుల నిర్మాణంతోపాటు అత్యధికంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు, విస్తరణ, అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. ఈ పనులకు ప్రభుత్వం పరిపాలనా ఆమోదం తెలిపిన నేప?థ్యంలో జిల్లాలవారీగా టెండర్లు నిర్వహించేందుకు అవకాశం ఏర్పడింది.

## వైఎస్ జగన్ పర్యటన యథావిధిగా కొనసాగుతుంది



విశాఖ

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నం పర్యటన రేపు(గురువారం, అక్టోబర్ 9వ తేదీ) యథావిధిగా కొనసాగుతుందని పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు స్పష్టం చేశారు. రేపు ఉదయం 11 గంటలకు వైఎస్ జగన్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని, రోడ్డు మార్గాన మెడికల్ కాలేజ్‌కి వెళ్తారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ మీదుగా వెళ్లేందుకు పోలీసులు రూట్ మార్చారన్నారు. ' వైఎస్ జగన్ తన తిరుగు ప్రయాణంలో కేజీహెచ్‌కు వెళ్తారు. పచ్చకామెర్లతో బాధపడుతున్న విద్యార్థులను పరామర్శిస్తారు. 70 మంది వివిధ హాస్పిటల్స్ లో అనారోగ్యంతో బాధపడుతున్నారు.ఇప్పటివరకు నలుగురు విద్యార్థులు మరణించారు. వైఎస్ జగన్ అంటే చంద్రబాబుకు భయం. వైఎస్ జగన్ బయటకు వస్తున్నారంటేనే చంద్రబాబుకు వణుకు పుడుతుంది.జగన్ పర్యటనకు ప్రజలు రాకుండా భయపెడుతున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు కట్టే ఫ్లెక్సీలను అడ్డుకుంటున్నారు. అరిచేతను అడ్డంపెట్టి సూర్యకాంతిని అడ్డుకోలేరు. ఆంక్షలుతో వైఎస్ జగన్‌ను ఆపలేరు. మనుషులు ఉండే హాస్పటల్లో నిర్మించలేని చంద్రబాబు పశువులకు హాస్టల్స్ పెడతారట' అని విమర్శించారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ.. 'జగన్ పర్యటనపై పోలీసులు హైడ్రామా నడిపారు. స్టీల్ ప్లాంట్ కార్మికులను కలవడానికి వీల్లేదు అంటూ రూటు మార్చారు. మాకు ప్రజా సమస్యల ముఖ్యం. పోలీసుల రూట్ మార్చిన వైఎస్ జగన్ నర్సీపట్నం వెళుతున్నారు. వైఎస్ జగన్ కలవడానికి వచ్చే ప్రజలను పోలీసులు అడ్డుకోవాలని చూస్తున్నారు. జగన్ పర్యటనకు లేనిపోని ఆంక్షలు పెట్టారు. 10 కార్లు మాత్రమే కాన్వాయ్ లో ఉండాలంటున్నారు. ప్రజాస్వామ్యంలో ఉన్నామా?, రాచరిక పాలనలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతుంది. జగన్ పర్యటనను ఎంత అణగదొక్కాలని చూస్తే అంత తిరుగుబాటు మొదలవుతుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో అనేక సమస్యలు ఉన్నాయి. స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్క్, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ, చిరు వ్యాపారుల సమస్యలు ఉన్నాయి' అని తెలిపారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

గురువారం, 9 అక్టోబర్ 2025




www.viswamvoice.com

## రాజమండ్రిలో స్మార్ట్ ఫీచర్ పార్క్ ప్రారంభం

**కూటమి అధికారంలోకి వచ్చాక జనం ఉన్నచోటకే అభివృద్ధి.. - క్రికెట్ బాక్స్, యాప్ ఆధారిత లైటింగ్ సిస్టం మరో రెండు థీమ్ పార్క్‌లు సిద్ధం చేస్తున్నాం.. - గత పాలకుల మాదిరిగా ఆర్భాటం చేయడం లేదు. ఎస్‌బిఐ కాలనీ పార్క్ ప్రారంభించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు,ఎమ్మెల్సీ సోము వీర్రాజు**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా స్థానిక ఎస్‌బిఐ కాలనీలో స్మార్ట్ ఫీచర్ పార్క్ ఏర్పాటుచేశామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. క్రికెట్ బాక్స్ తో కూడిన ఈ పార్క్ లో వెలుగులు యాప్ ఆధారితంగా ఏర్పాటు చేశామని తెలిపారు. బుధవారం ఉదయం ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కల్సి స్మార్ట్ ఫీచర్ పార్క్ ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ స్థానికులు దీని నిర్వహణ చూసుకోడానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఎక్కడో ఒక పార్క్ అభివృద్ధి చేసి, దాన్ని చూడ్డానికి అక్కడకు రండి అని జనాలకు చెప్పేవారని, కూటమి అధికారంలోకి వచ్చాక జనం ఉన్నచోటకే అభివృద్ధి తీసుకెళ్తున్నామని చాల గర్వంగా చెబుతున్నా మని ఎమ్మెల్యే వాసు అన్నారు. అన్ని ప్రాంతాల వారికి ఆహ్లాదం కల్గిస్తున్నామన్నారు. చెప్పినట్టే చేయడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శమన్నారు. వైసిపి వాళ్ళలా కంబాల చెర్వు పార్క్ ఒకటే అభివృద్ధి చేసి, అలా చేసాం ఇలా చేసాం అని చెప్పకుండా కూటమి ప్రభుత్వం వచ్చాక ఫేజ్ వన్ లో ఏడు పార్కులు అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. రాజమండ్రిలో బాక్స్ క్రికెట్ లో నెంబర్ వన్ ఆ పార్కులో ఉందన్నారు. ఇదేదో ప్రయివేటు సైట్స్ లో ప్రయివేటు ఏజన్సీ నడిపేది కాదన్నారు. కార్పొరేషన్ వాళ్ళు అభివృద్ధి చేసిన పార్క్‌లో బాక్స్ క్రికెట్ ఉందన్న విషయం అందరూ గమనించాలన్నారు. అలాగే షటిల్ కోర్టు, చిల్డ్రన్స్ ప్లే , అవుట్ డోర్ జిమ్, చుట్టూ లైటింగ్, వాకింగ్ ట్రాక్ అండ్ గ్రీనరీ, ఆటోమేటిక్ యాప్ కంట్రోల్ లైటింగ్ వంటివన్నీ ఈ పార్కులో ఉన్నాయని ఎమ్మెల్యే వాసు వివరించారు. గతంలో వైసిపి వాళ్ళు చీకట్లో ఉంచారని, ఇప్పుడు కూటమి వెలుగులు నింపిందని ఆయన ఎద్దేవా చేసారు. యాప్ ద్వారా లైటింగ్ ఆపడం, వెలిగించడం చేసి చూపించారు. క్రికెట్ ప్లేయర్ విరాట్ కోహ్లీ స్టాట్యూ మాదిరిగా ఒక బొమ్మ తయారుచేసి కూర్చున్నట్లు ఉందని, ఇది కూడా సెల్ఫీ పాయింట్ అవుతుందని ఎమ్మెల్యే వాసు అన్నారు. అన్ని పార్కులు అభివృద్ధి చేస్తామని, అతి దగ్గరలో థీమ్ బేస్డ్ పార్కులు రెండు ప్రారంభించుకోబోతున్నామని ఆయన అన్నారు. నిర్వహణ కూడా స్థానిక ప్రజలు బాధ్యతగా తీసుకుంటే ఇంకా బాగుంటుందని అన్నారు. ఇన్ని కార్యక్రమాలు చేసున్నా సరే, గత వైసిపి వాళ్ళ మాదిరిగా లైట్స్ కింద ఫోటో, బటన్ నొక్కినట్లు ఒక ఫోటో పెట్టుకోవడం లేదని అన్నారు. ఎలాంటి ఆర్భాటం లేకుండా సింపుల్ గ ప్రారంభించామని ఆయన తెలిపారు.

**అభినందనీయం : సోము వీర్రాజు**

ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమృత స్కీమ్‌లో నగరాల సుందరీకరణ చేయాలన్నది లక్ష్యమన్నారు. అందులో భాగంగా ఎమ్మెల్యే వాసు 30పార్కులను డిజైన్ చేసి అభివృద్ధి చేసి, అన్ని ప్రాంతాల వారికి ఆహ్లాదకర వాతావరణం అందించాలని భావించడం అభినందనీయమని అన్నారు. పార్కులు అభివృద్ధి చేయడమే కాకుండా స్థానిక పెద్దల సహకారంతో నిర్వహణ చేపట్టడం ఆనందించదగ్గ పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### బాణాసంచా పేలుళ్ల మృతుల కుటుంబాలను
## పరామర్శించిన మంత్రి సుభాష్

**అమరావతి నుంచి నేరుగా రాయవరం చేరుకున్న మంత్రి**
**క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు - బాణాసంచాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం కొమరిపాలెంలో బుధవారం బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన ఘోర ప్రమాదంలో మరణించిన కుటుంబాలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పరామర్శించారు. అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగే ఎస్ఐపిబి సమావేశానికి హాజరైన మంత్రి ఈ విచారకర సంఘటన విషయం తెలియగానే హుటాహుటిన బయలుదేరి రాయవరం చేరుకున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. తొలుత ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ తో చరవాణి ద్వారా మాట్లాడి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ బాణాసంచా పేలుడు సంఘటనలో ఏరుగురు మరణించడం తనను తీవ్రంగా కలచివేసింది అన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందేలా చూడాలని కలెక్టర్,వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. బాణాసంచా తయారీ కర్మాగారాలు కనీస ప్రమాణాలు పాటించాలన్నారు. భద్రత విషయంలో రాజీ పడకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ సంఘటనపై విచారణ జరిపించి అధికారుల నిర్లక్ష్యం ఉంటే తగు తీసుకుంటామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. మంత్రి నాయకులు సుభాష్ వెంట రామచంద్రపురం ఆర్డీవో అఖిల, డి.ఎస్.పి రఘువీర్,అగ్నిమాపక సిబ్బంది, కూటమి పార్టీ ఉండవిల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి ఆర్కే రోజా



**సఖినేటిపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,సఖినేటిపల్లి మండలం నవనారసింహ క్షేత్రాలలో 5వది అంతర్వేది శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి ఆలయంలో నగరి మాజీ మంత్రి, సినీనటి ఆర్కే రోజా స్వామిని దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయ ప్రకారం అర్చక స్వాములు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు, రాజ్యలక్ష్మి అమ్మవారికి కుంకమ పూజలు, నిర్వహించారు. ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాస కిరణ్ ఆద్వర్యంలో వేదాశీర్వాదం అర్చకులు అందించారు. ఆలయ పర్యవేక్షకులు పి.విజయ సారది శ్రీ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ఎమ్మెల్సీ వరుదు కల్యాణి సురేష్, ఎమ్మెల్సీ కావూరు శ్రీనివాసు, ఎంపీపీ మల్లిబాబు, సర్పంచ్, ఎంపిటిసి నాని, తదితరులు పాల్గొన్నారు.

### చొప్పల్ల గ్రామ పంచాయతీలో
## హోస్ టెక్స్ బిల్లులలో అవినీతి

**సుమారు 10 లక్షలు వరుకు అవినీతి జరిగిందన్న అనుమానాలు**
**పంచాయతీ రికార్డులు గుమస్తా దగ్గరే - ఇంతకీ అవినీతి పరులు ఎవరు నిగ్గు తెల్చాలని కొందరు గ్రామస్తులు డిమాండ్**







**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పల్ల గ్రామ పంచాయతీలో సుమారు 10 లక్షలు హౌస్ ట్యాక్స్ అవినీతి జరిగిందనే ఆరోపణలు ప్రజలలో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి అనే సమాచారం.అయితే దీనిపై విశ్వం వాయిస్ దినపత్రిక ప్రతినిధి శ్రీనివాస్ చొప్పల్ల గ్రామ పంచాయతీ సెక్రటరీ మరియు ఆలమూరు ఎండిఓని వివరణ అడగగా ఒకరుకొకరు పొంతనలేని సమాధానం చెపుతున్న వైనం.అయితే ప్రస్తుతం వున్న చొప్పల్ల గ్రామ పంచాయతీ సెక్రెటరీ వివరణ ఇస్తూ నేను డిప్యూటేషన్ మీద జులై 23న వచ్చిన వెంటనే చొప్పల్ల గ్రామంలో హౌస్ ట్యాక్స్ బిల్లులలో అవకతవకలు జరిగాయి అని గుర్తించాన్నారు. అయితే వెంటనే ఆగస్టు 06 నాటికీ అంతవరుకు హౌస్ టెక్స్ పెండింగ్ వున్న సుమారు 3లక్షల 51 వేల బిల్లు బుక్స్ తీసుకోవడం జరిగిందన్నారు.అయితే అప్పటి నుండి ఎటువంటి అవకతవకలు లేకుండా చర్యలు తీసుకొని వసూల్ చెయ్యడం జరుగుతుందన్నారు.నిజానికి హౌస్ టెక్స్ బిల్లులలో అవినీతి జరగడం వాస్తవం అని సెక్రటరీ తెలిపారు.ఇదే విషయంపై ఎండిఓ ఆలమూరు వారిని మీడియా ప్రతినిధి ఫోన్ చేసి వివరణ అడగగా బిల్లులు విషయంలో లోపాలు వున్నాయి అని అవి వాళ్ళతో మాట్లాడి సొమ్ము రికవరి చేశామని అన్నారు.కాని వాస్తవానికి గ్రామ పంచాయితీలో అవినీతి జరిగిన సొమ్ము రాలేదని పంచాయతీ సెక్రటరీ అంటున్నారు. అధికారులు ఇద్దరు ఒకరుకొకరు పొంతన లేకుండా తెలపడంతో ఇంకా అవినీతి అనుమాలు వ్యక్తం అవుతున్నాయి.ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న సెక్రటరీ కి ముందు గతంలో సెక్రటరీగా పని చేసిన వారు రికార్డులు ఇవ్వలేదని,చాలా చార్లు అడిగాను అని సెక్రటరీ అన్నారు.అయితే ప్రస్తుతం రికార్డులు అన్ని గుమస్తా దగ్గర వున్నాయన్నారు.చొప్పల్ల పంచాయతీలో పెత్తనం అంతా గుమస్తా కనుసన్నలో జరుగుతుందనే అనుమానాలు చాలా బలంగా వున్నాయి.అస్సలు అవినీతి చేసిన వాళ్ళకు రాజకీయ నాయకులు,అధికారులు అండదండలు మెండుగా ఉన్నాయనే ప్రజా అభిప్రాయం బలంగానే ఉంది.చొప్పల్ల గ్రామంలో సుమారు 8 వేల మంది జనాభా కలిగిన గ్రామం.అయితే ఈ అవినీతిపై విషయంపై వారి గళం వినిపించకపోవడం హాస్యాసపదంగా ఉండనే ఉంది.గ్రామంలో జరిగిన హౌస్ ట్యాక్స్ లో అవినీతి చేసిన వారిపై తక్షణమే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని,అలానే మేజర్ పంచాయతీ అయినా గాని పంచాయతీలో డిప్యూటేషన్ మీద వచ్చిన వారే తప్ప పర్మినెంట్ అధికారులు లేకపోవడంపై పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ అవినీతిపై జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులు, విజిలెన్స్ అధికారులు లోతైన దర్యాప్తు చేయిస్తే మరిన్ని అక్రమాలు బయటకు వస్తాయని, అవినీతికి పాల్పడిన వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిందిగా కొందరు గ్రామస్తులు కోరుచున్నారని సమాచారం.

### రెడ్డి సుబ్రహ్మణ్యంకి
## జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గిడ్డి



**పి.గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, కొత్తపేట గ్రామానికి చెందిన శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం జన్మదిన సందర్భంగా పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ఆయన నివాసానికి చేరుకుని పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అంబాజీపేట బేతాళ స్వామి నిదర్శించుకున్న
## పి.గన్నవరం కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్



**పి.గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక నియోజకవర్గం అంబాజీపేట మండలం అంబాజీపేటలో విజయ బేతాళ స్వామి తీర్థ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శనం చేసుకున్న పి.గన్నవరం నియోజకవర్గం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస రావు రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ కుడుపూడి భరత్, రాష్ట్ర జాయింట్ కార్యదర్శి వాసంశెట్టి తాతాజీ, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు విత్తనాల శేఖర్, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు దొమ్మేటి సత్య మోహన్ ఎం.ఎం.శెట్టి, సంసాని బుల్లి నాని, శీలం మోహన్, గుత్తుల శ్రీనివాస్, సుదాబుత్తుల రాము, కర్రీ సుబ్రహ్మణ్యం, పి.వీరాస్వామి, దంగేటి అబ్బులు, మట్టపర్తి యజ్ఞశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

### దేశ ప్రధాన న్యాయమూర్తిపె
## దాడి చేయడం సనాతన ధర్మమా...?

**సుప్రీంకోర్టు సిజెఐ గవాయిపై దాడి చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలి**
**దళిత ప్రజా సంఘాల డిమాండ్**




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన భారతదేశ అత్యున్నత నాయ స్థానం ప్రధాన న్యాయమూర్తి బాలకృష్ణ గవాయి పై హిందూ మతోన్మాది రాకేష్ కిషోర్ చేసిన దాడి హేయమైన చర్య అని దేశ ప్రజలందరూ సిగ్గుపడేలా జరిగిన దాడిని నిరసిస్తూ దళిత. ప్రజా. విద్యార్థి. మహిళ. కార్మిక. ఉపాధ్యాయ. ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం అమలాపురం గడియార స్తంభం సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశాన్ని చూసి సిగ్గుపడేలా ప్రపంచ దేశాలన్నీ నివ్వెర పోయేలా మనువాద సనాతన ధర్మానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారనే అక్కసుతో మనదేశ ప్రధాన న్యాయమూర్తి పై హిందూ మత ఉన్మాది అయిన న్యాయవాది రాకేష్ కిషోర్ దాడి చేయడం యావత్ దేశమంతా తలదించుకునేలా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు ఇంత ఘోరమైన దాడి జరిగిన గాని దేశ రాష్ట్రపతి ప్రధాని చట్టాన్ని రక్షించే హెూంమంత్రి ఖండించకపోవడం సిగ్గుచేటని అన్నారు ఒక దళితుడు ప్రధాన న్యాయమూర్తి ఇంతటి దారుణానికి ఒడి కడతారా ఇంత అవమానానికి గురి చేస్తారా అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు దేశ ప్రధాన న్యాయమూర్తి కొనసాన్నల్లోనే ప్రమాణ స్వీకారం చేసే ప్రజా ప్రతినిధులు ఆ న్యాయమూర్తి పై దాడి జరిగితే మౌనంగా ఉండటం వివక్ష చూపడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు మోదీ మత ఉన్మాద ప్రభుత్వ మద్దతుతోనే ఈ దాడి జరిగిందని ఆరోపించారు మనదేశ ప్రధాన న్యాయమూర్తి పై దాడి చేయడమే సనాతన ధర్మ లక్ష్యమా అని ప్రశ్నించారు రాజ్యాంగం ముఖ్యమా సనాతన ధర్మమా ప్రభుత్వం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు సనాతన ధర్మాన్ని కాపాడతానన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ గౌరవప్రదమైన రాజ్యాంగ పరిధిలో దేశప్రధాన న్యాయమూర్తి పై దాడి జరిగితే స్పందించరా అని ప్రశ్నించారు ఇప్పటికైనా దేశ ప్రధానమంత్రి రాష్ట్రపతి ముఖ్యమంత్రి స్పందించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన దాడిని ఖండించాలని దాడి చేసిన మతోన్మాదిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని భారత రాజ్యాంగాన్ని రక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో దళిత ప్రజాసంఘాల నాయకులు సిపిఎం జిల్లా కన్వీనర్ కారం వెంకటేశ్వరరావు పి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఏడిద రాజేష్ ఉపాధ్యక్షులు ఆకుమర్తి రవి పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జిల్లెల్ల మనోహరం అమలదాసు బాబురావు రైతు కూలి సంఘం జిల్లా నాయకులు కొండా దుర్గారావు మాజీ ఏపీపీ ఐవిన్ మల్లేశ్వరరావు పెనుమాల చిట్టిబాబు సాపే బాల రవి గిడ్ల వెంకటేశ్వరరావు దళిత సేన జాతీయ ఉపాధ్యక్షులు దుక్కుపాటి సత్యనారాయణ జీవీ రమణ పెంకే వెంకటేశ్వరరావు పీతల రామచంద్రరావు జి దైవ కృప శెట్టి బత్తుల తులసిరావు బత్తుల జాగృతి కుమార్ పి దుర్గాప్రసాద్ పి అమూల్య డేవిడ్ అంబేద్కర్ సాపే రమేష్ జి మురళి బత్తుల సాత్విక్ బత్తుల నకుల్ రాజు గడ్డం ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు

విశ్వవాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

## ఎడిటర్ వాయిస్

# కులరాజకీయాల కురుక్షేత్రం బిహార్

ఒకప్పుడు బిహార్ రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. ఇప్పుడు మాత్రం అలా కాదు. పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు జరగబోతున్న ఎన్నికలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీస్తున్నాయి. ఆ ఎన్నికల రాజకీయ సెగతో అన్ని పార్టీలు ఉక్కిరిబిక్కిరవు తున్నాయి. కుల రాజకీయాలకు పెట్టింది పేరైన బిహార్ రాష్ట్రంలో పలు చిన్న పార్టీలు కూడా కీలకపాత్ర పోషించనున్నాయి. గత శాసనసభ ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు జరగనున్న ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి, మహాఘట్ బంధన్ (ఎంజీబీ) కూటముల్లో మార్పులు, చేర్పులతో పాటు రాష్ట్రంలో కొత్త పార్టీల రంగప్రవేశం చేశాయి. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. ఒక్క మాటలో చెప్పాలంటే బిహార్ ఎన్నికలు జాతీయ, ప్రాంతీయ పార్టీలకు సవాళ్లుగా మారుతున్నాయి. 13 కోట్లకు పైగా జనాభాతో 243 స్థానాలున్న రాష్ట్రంలో ఈసారి కూడా రాజకీయాలు ఎప్పటిలాగే కుల సమీకరణాల చుట్టే తిరుగుతూ అన్ని పార్టీలకు కురుక్షేత్రంగా మారాయి. రాష్ట్రంలో అధికార ఎన్‌డీఏ కూటమిలో జేడీయూ, బీజేపీ, ఎల్జీపీ ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. ప్రతిపక్ష ఎంజీబీ కూటమిలో ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలు ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమిలో ఉన్న వికశీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) ప్రస్తుతం ఎమ్జీబీ కూటమిలో ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసిన ఎల్జీపీ ఇప్పుడు ఎన్‌డీఏలో ఉంది. రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ (ఆర్ఎల్ఎస్పీ) జేడీ (యూ) లో విలీనమైంది. ఈ రెండు కూటములను సవాల్ చేస్తూ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ జన సురాజ్ పార్టీ కూడా ఈ ఎన్నికల్లో బరిలోకి దిగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 5 స్థానాల్లో గెలిచిన ఏఐఎంఐఎం రాబోయే ఎన్నికల్లో కూడా మైనార్టీ ఓట్లపై ప్రభావం చూపనుంది. నితీష్ కుమార్ తన సీఎం పీఠం కాపాడుకుంటూ పలుమార్లు కూటములు మార్చారు. 2015లో ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలతో కలిసి పోటీ చేసి ముఖ్యమంత్రి అయిన నితీష్ 2017లో బయటకు వచ్చి బీజేపీతో కలిశారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ తరఫున పోటీచేసిన నితీష్ కుమార్ మరోసారి ముఖ్యమంత్రి అయ్యారు. స్వ ప్రయోజనాలే లక్ష్యంగా నితీష్ కుమార్ ఇలా పదే పదే పొత్తులు, కూటములను మారుస్తుండడంతో రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి నితీష్‌పై విశ్వసనీయత అనేది జేడీ (యూ)కి, ఎన్‌డీఏకు సవాలుగా మారింది. నితీష్ కుమార్ వరుసగా కూటములు మార్చడం వల్ల ఆయన విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ముస్లిం ఓటర్లలో ఆయనపై విరక్తి పెరిగింది. బీజేపీతో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరన్న విషయంలో స్పష్టత లేకపోవడం గందరగోళం సృష్టిస్తోంది. బీజేపీ ఎక్కువ సీట్లు కోరుతుండగా, జేడీయూ బలహీనపడే ప్రమాదం ఉంది. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ 10 లక్షల ఉద్యోగాల హామీతో యువతను ఆకర్షిస్తున్నారు. అయితే, ఆయన తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్ వారసత్వాన్ని కొనసాగిస్తున్నప్పటికీ, పార్టీపై ఉన్న అవినీతి ముద్రను తొలగించడం కష్టమవుతోంది. కాంగ్రెస్ బలహీనత, వామపక్షాల పరిమిత శక్తి కారణంగా కూటమి ఐక్యత కష్టంగా కనిపిస్తున్నా, యాదవులు, ముస్లింలు వంటి బలమైన ఓటు బ్యాంక్ వీరి ఆధారంగా ఉంది. ప్రశాంత్ కిషోర్ స్థాపించిన జన సురాజ్ పార్టీ విద్య, ఆరోగ్యం, పారదర్శక పాలన వంటి అంశాలను ప్రధానంగా ఎత్తి చూపుతోంది. పట్టణ యువతలో ఈ పార్టీకి ఆకర్షణ పెరుగుతోంది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో కుల రాజకీయాలే బలంగా ఉండటం వల్ల దాని ప్రభావం పరిమితంగానే ఉండవచ్చు. అయినప్పటికీ ఈ పార్టీ ప్రధాన కూటముల ఓట్లను విభజించే సామర్థ్యం కలిగి ఉంది. బిహార్‌లో ఓబీసీ, ఎస్సీ, ముస్లిం వర్గాలు కలిపి 80%కు పైగా ఉన్నారు. వీరి మద్దతే ఎవరికి అధికారం వస్తుందో నిర్ణయిస్తుంది. 2020లో ముస్లిం ఓట్లలో 76% మహాఘట్ బంధన్‌కు రావడం గమనించదగ్గ అంశం. అగ్రకులాలు తక్కువ శాతంలో ఉన్నప్పటికీ రాజకీయంగా ప్రభావం చూపుతూనే ఉన్నాయి. పట్టణాల్లో ఎన్‌డీఏ పాలనపై కొంత సంతృప్తి ఉన్నా, గ్రామీణ ప్రాంతాల్లో అసంతృప్తి ఎక్కువగా ఉంది. వరదలు, వ్యవసాయ సమస్యలు, ఉపాధి కొరత కారణంగా రైతులు ప్రభుత్వంపై విసిగి పోయారు. మహిళల విషయంలో, మద్యం నిషేధం నితీష్‌కు మద్దతు తెచ్చినా, ఈసారి అది ఏవైపు వెళుతుందో స్పష్టంగా తెలియడం లేదు. బీజేపీ డిజిటల్ ప్రచారంలో ఆధిపత్యం సాధించింది. గ్రామ



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# తోకలేని పిట్ట తొంభై ఆమడలు దూరం

'తోకలేని పిట్ట తొంభై ఆమడలు దూరం పోతుంది' అన్న సామెతను అక్షరాలా నిజం చేస్తూ అతి తక్కువ ధరకే సేవలం దిస్తున్న తపాలాకు, గ్రామీణ ప్రజలకు మధ్య అనుబంధం శతాబ్దాల నాటిది. ఐక్యరాజ్య సమితి చేపట్టిన తీర్మానాన్ని అనుసరించి ప్రతి సంవత్సరం అక్టోబర్ 9వ తేదీని అంతర్జాతీయ తపాలా దినోత్సవంగా జరుపు కోవడం ఆనవాయితీగా వస్తున్నది. చరిత్రను తిరిగి చూస్తే లోకి "మెసెంజర్ల" రూపంలో తపాలా సర్వీసులుండేవి. వీళ్లు నడిచి లేదా గుర్రాల మీద వెళ్లి రాత ప్రతుల్ని అటూ ఇటూ చేర వేసేవారు. 1600 – 1700 సంవత్సరాలలో అనేక దేశాల వారు జాతీయ తపాలా వ్యవస్థలను నెలకొల్పుకొని ఆయా దేశాల నడుమ తపాలా సౌకర్యాల్ని అందించు కునేందుకు "ద్వైపాక్షిక ఒప్పందాలు" చేసుకున్నారు. 1800 సంవత్సరం నాటికి ఇలా ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకున్నవారు భారీగా తేలారు. దీంతో అంతర్జాతీయ తపాలా పంపిణీ క్లిష్టంగా, అసంపూర్తిగా, అసమర్థ వంతంగా మారి పోయింది. అమెరికాకు చెందిన పోస్ట్ మాస్టర్ జనరల్ మాంట్ గోమెరి బ్లెయిర్ 1863 లో 15 యూరొపియన్ దేశాలు, అమెరికన్ దేశాల ప్రతినిధులతో ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసాడు . ఈ సదస్సులో అంతర్జాతీయ పోస్టల్ సర్వీసులపై పరస్పర ఒప్పందాల కోసం ప్రతినిధులు అనేక సాధారణ సూత్రాలను వెల్లడించారు. కాని ఒక అంతర్జాతీయ ఒప్పందం మాత్రం కుదరలేదు. 1874 లో నార్త్ జర్మన్ కాన్ ఫెడరేషన్‌కు చెందిన ఓ సీనియర్ పోస్టల్ అధికారి హెయిన్ రిచ్ బనీ స్టీఫెన్ స్విట్జర్లాండ్ లోని బెర్నెలో 22 దేశాల ప్రతినిధులతో ఒక సదస్సు ఏర్పాటు చేశాడు. ఆ ఏడాది అక్టోబరు తొమ్మిదో తేదీన ప్రతినిధులు "బెర్నె ఒప్పందం"పై సంతకాలు చేసి జనరల్ పోస్టల్ యూనియన్ ను నెలకొల్పారు. ఈ యూనియన్ లో సభ్య దేశాలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. యూనియన్ పేరు 1878 లో "యూనివర్సల్ పోస్టల్ యూనియన్" గా మారింది. ఇది 1948 లో ఐక్య రాజ్య సమితికి ప్రత్యేక ఏజెన్సీగా రూపాంతరం చెందింది. 1969 లో అక్టోబరు 1 నుంచి నవంబరు 16 వ తేదీ వరకు జపాన్ టోక్యో లో 16 వ యూనివర్సల్ పోస్టల్ యూనియన్ కాంగ్రెస్‌ను నిర్వహిం చారు. ఈ కాన్ఫరెన్సులో ప్రతినిధులు అక్టోబరు 9 వ తేదీన "వరల్డ్ పోస్టల్ డే" ని నిర్వహించాలని తీర్మానించారు. అప్పటి నుండి, తపాలా సేవల యొక్క అవసరాన్ని గుర్తిస్తూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం అక్టోబరు 9 న ఈ ప్రపంచ తపాలా దినోత్సవమును జరుపు కుంటున్నారు. "దినాదినాభివృద్ధి చెంది, రోజువారీ ప్రజల జీవితాలు మరి యు వ్యాపారాలలో తపాలాశాఖ పోషించే పాత్రను గూర్చి ప్రజల్లో అవగాహనను రేకెత్తించడం మరియు దేశాల ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో తపాలా శాఖ ఔన్నత్యాన్ని తెల్పడం కోసం ఈ రోజును జరుపు కుంటారు. ఒక చిన్న పాయగా మొదలైన తపాలా విధానం తరువాత అన్ని దేశాలకు వేగంగా పాకి పోయింది. 1800 నాటికి ప్రపంచ తపాలా వ్యవస్థ ఏర్పడింది. కాగా 1837లో మన దేశంలో తపాలా వ్యవస్థ ప్రారంభమైంది. "భారత తపాలా శాఖ"ను అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం అక్టోబర్ 1,1854న ఏర్పాటు చేసింది. తపాలా బిళ్ళ (పోస్టల్ స్టాంప్) అప్పటి సింధ్ (ఇప్పటి పాకిస్తాన్) ప్రాంతంలో తొలుత వాడుకలోకి వచ్చింది. పోస్టల్ వ్యవస్థ సక్రమంగా ఏర్పాటు కాకముందే భారత్‌లో మొదటిసారి "వారెన్ హెస్టింగ్స్" కోల్‌కత కార్యాలయంలో 1774లో "మొదట తపాలా కార్యాలయాన్ని" తెరిచారు. ప్రపంచం లోని తపాలా శాఖలన్నింటిలో భారత తపాలా రారాజు లాంటిది. భారత దేశంలో మార్చి 31,2015 నాటికి 1,54,939 తపాలా కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో 1,39,222(89.86%) గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పుడు ఉన్న తపాలా కార్యాలయాలు 23,344 మాత్రమే. చిన్ననాటి నుండి పాఠశాల రోజుల్లో రాసిన హెడ్‌మాస్టర్‌కు సెలవు చీటీ నుంచి కాలేజీ రోజుల్లో ఖర్చుల కోసం తల్లిదండ్రులకు రాసే ఉత్తరం, స్నేహితులతో సత్సంబంధాలు పాదు కొల్పేందుకు, అనంతరం జీవితానికో అర్థం తెచ్చి పెట్టే ఉద్యోగం కోసం చేసే దరఖాస్తుకు అంటించే తపాలా బిళ్ళలు... ఇలా ఎన్నెన్నో విషయాలు జీవితాలతో ముడి వేసుకున్నాయి. ఉత్తరం అందుకోవడం, రహస్యంగా విప్పి చదువు కోవడం, ఎవరైనా వస్తుంటే దిండు కింద దాచుకోవడం ప్రేమికులకు ఖర్చులేని ఓ మధురానుభూతి. దూరంగా సైన్యంలోనో, మరో ఉద్యోగంలోనో ఉన్న భర్తో, కొడుకో ఉత్తరం రాస్తాడనీ, క్షేమ సమాచారం చెబుతాడనీ వీధి వంక చూస్తూ గడిపే కాలం ఇంకా మధురమైనది. తరతరాలుగా తమ జీవన స్రవంతిలో ఈ తపాలా ఉత్తరం పట్ల తమకు గల మమకారాన్ని చిన్నా, పెద్దా తేడా లేకుండా స్త్రీ, పురుష బేధం పాటించకుండా ప్రతి ఒక్కరూ చాటుకున్నారు. అయితే సాంకేతికత అందు బాటులోకి రావడంతో ఉత్తరాలు రాసుకునే తరం అంతరించి పోయింది. ఇంటికి వచ్చిన ఉత్తరాలను పొడవాటి ఇనుప కమ్మీకి గుచ్చిఉంచడం. అవసర మైనపుడు మళ్లీ తీసి చదువు కోవడం రెండు మూడు దాశాబ్దాల క్రితం ప్రతి ఇంటా ఉండేది. ఆడపిల్ల చదివి ఊళ్లేలాలా ఉత్తరాలు చదువుకో గలదు చాలు అన్న కాలం కూడా అదే రోజులు మారి, కంప్యూటర్, మొబైల్ ఫోన్లు, అంతర్జాలం అందుబాటులోకి వచ్చిన నేటికాలంలో ఉత్తరాలు రాయటం దాదాపు లేదనే చెప్పాలి. ఇపుడు పోస్ట్ అంటే బ్యాంకు నుంచి, సెల్ ఫోన్ కంపెనీల నుంచీ వచ్చే పార్శళ్లు, బిల్లులు, డేటా వివరాలు మాత్రమే. కానీ ఆ రోజుల్లో చాలా తక్కువ ఖర్చుతో సమాచారాలు అందేవి. వందల, వేల మైళ్లు ప్రయాణం చేసి వచ్చే ఆ తోక లేని పిట్ట కోసం ఆతృతగా ఎదురు చూసి "పోస్ట్" అన్న కేక వినగానే ఉరుకులు, పరుగులతో అందుకునే ఉత్తరాల్లో ఎన్నో విశేషాలు , అనేక కమ్మని కబుర్లు, కెరీర్ కు బాటలు... మంచి ఉత్తరం అందుకున్నప్పు డు కలిగే సంతోషం అంతా ఇంతా కాదు. అలాగే మనియార్డర్లు.. సంతోషంతో పోస్ట్ మ్యాన్ కు ఈనాం ఇచ్చే ఆనవాయితీ నెలకొని పోయింది. గతంలో సమాచార మార్పిడికి, క్షేమ సమాచారము తెలుసు కునేందుకు పోస్టు కార్డే(ఉత్తరం) ప్రధాన ఆధారం. పేదల నుండి ధనికుల వరకు ఎక్కువగా దీనిపైనే ఆధార పడేవారు. సమాచార రంగంలో రానురాను విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఉత్తరం ప్రాధాన్యం తగ్గుతున్న నేపథ్యంలో మార్పులను అంది పుచ్చుకుంటూ మనుగడను కొనసాగిస్తూనే ప్రత్యేకతను నిలబెట్టు కుంటోంది భారత తపాలశాఖ. పావురాల ద్వారా బట్వాడా నుంచి.. స్పీడు పోస్టు.. ఈ–మెయిల్ ఇలా దూసుకెళ్తున్న భారత తపాలా వ్యవస్థ అంతర్జాతీయ స్థాయిలో కీర్తిని మూట గట్టుకుంది. ఉత్తర ప్రత్యుత్తరాల వారధులుగా అశేష సేవలందిస్తున్న ఈ విభాగం ప్రస్థానం "ఇంతింతై వటుడింతై" అన్నట్లు సాగింది. ప్రయివేటు రంగం నుంచి వచ్చిన పోటీని తట్టుకొని నిలబడుతోంది. రెండో అతి పెద్ద వ్యవస్థ తపాలశాఖ గతంలో ఉత్తరాలు బట్వాడాకే పరిమితం కాగా కాలక్రమంలో అనేక సేవల్లోకి మారింది. ప్రస్తుతం దేశంలో సుమారు ఆరు లక్షల మంది తపాలా సిబ్బంది 1.10 లక్షల కార్యాలయాలతో సేవలందిస్తోంది. దేశంలో రైల్వే తర్వాత ఇదే అతి పెద్ద వ్యవస్థ. స్పీడు పోస్టు కోసం మనదేశంలో 180 కేంద్రాలున్నా యి. 100కు పైగా దేశాల కు ఈ సౌకర్యం ఉంది. బంగారు నాణాలు, ఫారెన్ ఎక్ఛేంజ్ కరెన్సీ మార్చుకోవడం లాంటి అనేక సౌకర్యాలు అందిస్తుంది. బిల్ మెయిల్ సర్వీసు. పెద్ద పెద్ద సంస్థలు, ఫ్యాక్టరీలు తమ సంస్థ ఆర్థిక నివేదికలు, బిల్లులు, ఇతరత్రా చేరవేత, గ్రామీణ మార్కెటింగ్ విధానంలో మార్పులకు శ్రీకారం చుట్టిన మేఘదూత్ పోస్టుకార్డు, మరో ఎక్స్‌ప్రెస్ పార్సిల్ పోస్టు..2006లో ఇన్‌స్టెంట్ మనీ ఆర్డర్ సర్వీసు ఇలా సౌకర్యాలను మెరుగు పరుస్తోంది. కాలగమ నంలో వచ్చిన మార్పులు దీనిపై పెను ప్రభావం చూపాయి . సెల్ ఫోన్లూ, కంప్యూటర్లూ, ఇతర సాంకేతిక సాధనాలు అందు బాటులోకి వచ్చాక కార్డు అవసరం తగ్గి, ఇ–మెయి ల్స్ చాలా వరకు ప్రస్తుతం పోస్టుకార్డు పాత్రను పోషిస్తున్నాయి. కొన్ని ప్రదేశాల్లో మాత్రం ఇప్పటికీ పోస్టుకార్డునే వినియోగిస్తున్నారు.

# సీమ జీవనాడి... హంద్రీనీవా!

ఎన్ని సిరులున్నా అసలు సిరి జలసిరి అని నిరూపించిన జననేత ఏపీ సీఎం చంద్రబాబు. హంద్రీనీవా ద్వారా కృష్ణమ్మను రాయలసీమకు తరలించి నీటి జాడలేని ప్రాంతాల్లో జలసిరులు కురిపించి సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తున్న జల ప్రదాతగా నిలుస్తున్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకాన్ని 3850 క్యూసె క్కుల సామర్థ్యంతో 40 టీఎంసీల కృష్ణా నదీ వరద జలాలను వినియోగించుకోవటం ద్వారా ఉమ్మడి కర్నూ లు, అనంతపురం, చిత్తూరు జిల్లాలలో 6.025 లక్షల ఎకరాలకు సాగునీరు, 414 గ్రామాలలోని 33 లక్షల జనాభాకు తాగునీరు అందించాలని సంకల్పించారు. ఆరు లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్న హంద్రీనీవా ప్రాజెక్టు పూర్తికి తెలుగుదేశం ప్రభుత్వం రూ.4,182 కోట్లు ఖర్చు చేయగా జగన్ ప్రభుత్వం అయిదేళ్లలో కేవలం రూ.515 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. తెలుగుదేశం హయాంలో మొదటి ఫేజ్ 84శాతం పూర్తయింది. మిగిలిన పనులు 2020 జూన్ నాటికే పూర్తి చేస్తామన్నగత ప్రభుత్వం పూర్తి చేయలేదు. 2.5లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్న గాలేరు–నగరి మొదటి ఫేజ్ పనులు కూడా ప్రభుత్వం 84 శాతం పూర్తి చేసింది. మిగిలిన పనులు జగన్ పూర్తి చేసి 2020లో ప్రారంభిస్తా మన్నారు. అదీ చేయలేదు. 42వేల ఎకరాల ఆయకట్టు ఉన్న పెన్నా అహోబిలం బ్యాలెన్స్ రిజర్వాయరు రెండో ఫేజ్‌పై తెలుగుదేశం ప్రభుత్వం రూ.411కోట్లు ఖర్చు చేస్తే, జగన్ ప్రభుత్వం రూ.42 కోట్లు ఖర్చు చేసింది. 2020 నాటికి పనులు పూర్తి చేస్తామన్న హామీనీ నిలబెట్టుకోలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటికే ఉన్న మోటర్లను పూర్తి సామర్థ్యంతో వినియోగించడం ద్వారా హంద్రీనీవా మెయిన్ కెనాల్ లో పూర్తి సామర్థ్యంతో నీటిని విడుదల చేయడానికి సీఎం చంద్రబాబు వరుస సమీక్షలు చేసి పనులు పరుగులు పెట్టించారు. మెయిన్ కెనాల్ పుంగనూరు బ్రాంచ్, కుప్పం బ్రాంచ్ కెనాల్స్‌లో మిగిలిన పనులు విస్తరణ, లైనింగ్ చేపట్టడానికి రూ 2,629 కోట్లకు డిసెంబర్ 2024 పరిపాలన ఆమోదం ఇవ్వడం జరిగింది. ఆ పనులను 2025 ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించి నాలుగు నెలల్లో రికార్డు సమయంలో పూర్తి చేశారు. కాలువ సామర్థ్యం పెరిగి మల్యాల నుంచి 738 కి.మీ దూరంలో ఉన్న పరమ సముద్రం ట్యాంకుకు నీటిని తరలించారు. 24 గంటల్లో 3,000 మంది కార్మికులు, అత్యాధునిక యంత్ర సామాగ్రి ఉపయోగించి 79,438 చదరపు మీటర్ల కాంక్రీట్ లైనింగ్ 4.5 కి,మీ పొడవు పూర్తి చేసి రికార్డు సృష్టించింది ప్రభుత్వం. 2025–26 బడ్జెట్‌లో అత్యధికంగా రూ 3,243.59 కోట్లు హంద్రీనీవాకి కేటాయించడం ద్వారా సీమ అభివృద్ధి పట్ల తమ నిబద్ధతను నిరూపించారు చంద్రబాబు. ఫేజ్ 1 హంద్రీనీవా ప్రధాన కాలువ వెడల్పు చేయడం ద్వారా కాలువ సామర్థ్యాన్ని 2,200 క్యూసెక్కుల నుండి 3,850 క్యూసెక్కులకు పెంచడం ద్వారా నెలకు సుమారు 10 టీఎంసీల నీటిని తీసుకొనే సౌలభ్యం ఏర్పడింది. అట్లాగే పేజ్ 2 హంద్రీనీవా ప్రధాన కాలువను లైనింగ్ చేయడం ద్వారా కాలువ సామర్థ్యాన్ని 1,200 క్యూసెక్కుల నుండి 2,200 క్యూసెక్కులకు పెంచుతున్నారు. కాలువ సామర్థ్యం పెంచడం ద్వారా నెలకు సుమారు 5.70 టీఎంసీల నీటిని తీసుకోవచ్చు. ప్రస్తుతం నెలకు 3.11 టీఎంసీలు, అదనంగా 2,59 టీఎంసీలు. చంద్రబాబు 2025 జూలై 17న మల్యాల వద్ద ప్రధాన కాలువలో నీటిని విడుదల చేశారు. 2025 ఆగస్టు 30న కుప్పం బ్రాంచ్ కెనాల్ చివరి భాగాన పరమ సముద్రం ట్యాంక్ వద్ద జలహారతి ఇచ్చారు. హెచ్.ఎన్.ఎస్.ఎస్ కాలువ కింద మొత్తం 15,261 %వీజఖీ% నేటి సామర్థ్యం కలిగిన 498 %వీ×% ట్యాంకులను నింపాలని ప్రతిపాదించారు. ఇందులో 61 ట్యాంకులను పూర్తిగా నింపడం జరిగింది. 138 ట్యాంకులు పాక్షికంగా నిండాయి. 16 నెలల కూటమి పాలనలో, హంద్రీనీవా ద్వారా కుప్పం ప్రాంత రైతులకు నీరు అందించడం ద్వారా దశాబ్దాల నాటి కుప్పం రైతుల కల నెరవేరింది. హంద్రీనీవా పథకానికి ఎన్టీఆర్ శంకుస్థాపన చేస్తే దాన్ని పూర్తి చేసే అదృష్టం చంద్రబాబుకే దక్కిందని చెప్పాలి.

# రా'బంధు'లతో జాగ్రత్త!

సొంత పెదనాన్న లైంగిక వేధింపులు భరించలేక ఇటీవల ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. హైదరాబాద్‌లో జరిగిన ఈ ఘటన.. పరిచయస్తులు, దగ్గరి బంధువుల నుంచి కూడా మహిళలకు రక్షణ లేదనే విషయాన్ని మరోసారి రుజువు చేసింది. బయటివారికంటే పరిచయస్తులు, బంధువుల నుంచే బాలికలకు ఎక్కువగా ముప్పు పొంచి ఉన్నట్టు ఈ ఘటన నిరూపిస్తున్నది. పాఠశాలలు, కాలేజీలు, ఆఫీసుల్లోనే కాదు.. సొంత ఇండ్లలో సైతం బాలికలు, మహిళలు లైంగిక వేధింపులకు గురవుతుండడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నది. లైంగిక వేధింపులపై నమోదవుతున్న కేసుల్లో.. ఎనభైశాతానికి పైగా కేసులు ఇలాంటివే ఉండటం సమాజంలో పేరుకుపోయిన మానసిక రుగ్మతను తెలియజేస్తున్నది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదిక ప్రకారం భారతదేశంలో లైంగిక వేధింపుల కేసుల్లో చాలావరకు నిందితులు బాధితులకు తెలిసినవారే అయి ఉంటున్నారు. దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది లైంగిక వేధింపులకు సంబంధించి సుమారు ముప్ఫయి వేల కేసులు నమోదవుతుంటే.. ఇందులో ఎనభై శాతానికి పైగా కేసుల్లో పరిచయస్తులు, బంధువులే నిందితులుగా ఉండడం గమనార్హం. బాలికలపై జరిగే లైంగిక వేధింపుల్లోనైతే తొంభై శాతానికి కంటే ఎక్కువ మంది నిందితులు వారికి తెలిసిన, నమ్మకమున్న వ్యక్తులే. అందులోనూ 30–40 శాతం మంది కుటుంబసభ్యులే (తండ్రులు, సోదరులు, మామలు, పెదనాన్నలు, కజిన్స్) ఉంటున్నారు. ఈ గణాం కాలు బాలికలకు ఆప్తుల నుంచి పొంచి ఉన్న ప్రమాదతీవ్రతను తెలియజేస్తున్నాయి. లైంగిక వేధింపుల నుంచి పిల్లలను రక్షించడానికి తల్లిదండ్రులు అనేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరమున్నది. ముందుగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వారికి నేర్పించాలి. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే భయం లేకుండా తల్లి దండ్రుల వద్ద చెప్పు కునే స్వేచ్ఛావాతావరణం కల్పించాలి. అపరిచితులతో మాట్లాడ డం, వారి నుంచి బహుమతులు తీసుకునే విషయాలపై వారికి స్పష్టమైన అవగాహన కల్పించాలి. సోషల్ మీడియా, ఇంటర్నెట్ వినియోగంలో జాగ్రత్తలు, ఆన్‌లైన్ వేధింపుల గురించీ తెలియజేయాలి. లైంగిక వేధింపుల నివారణకు ప్రభుత్వాలు నిర్భయ వంటి అనేక కఠిన చట్టాలు అమలు చేస్తున్నాయి. బాలికలపై లైంగిక వేధింపులు జరగకుండా.. పోక్సో వంటి చట్టాలు ఉన్నాయి. అయితే గత కొన్నేండ్ల డేటా చూస్తే మాత్రం కేసుల నమోదులో ఎలాంటి తగ్గుదల కనిపించడం లేదు. 2020లో 28,046 లైంగిక వేధింపుల కేసులు నమోదైతే, 2021లో ఇది 31,677 కేసులకు పెరిగింది. 2022లో 31,982 కేసులు నమోదయ్యాయి. 2023తో పోల్చుకుంటే 2024లో కేసుల్లో 4.8 శాతం పెరుగుదల కనిపించింది. 2025 జనవరి డేటా ఇంకా విడుదల కాకపోయినా.. ఇప్పటికే 25 వేలకు పైగా కేసులు నమోదైనట్టు ఒక అంచనా. తెలంగాణలోనూ 2023లో 817 లైంగిక వేధిం పుల కేసులు నమోదు కాగా, 2024, 2025ల్లోనూ ఈ కేసుల్లో పెరుగుదల కనిపించింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఇదే స్థాయిలో లైంగిక వేధిం పుల ఘటనలు వెలుగుచూడడం లేదనే చర్చ జరుగుతున్నది. వేధింపులకు గురైన బాధితురాలినే తప్పుపట్టే ధోరణిలో సమాజం వ్యవహరి స్తుండడంతో.. పరువు పోతుందనే భయంతో చాలామంది ఫిర్యాదు చేయడానికే వెనుకాడుతున్నారు. ముఖ్యంగా దగ్గరి బంధువులే వేధింపులకు పాల్పడినప్పుడు కుటుంబ పరువు పోతుందని, బంధుత్వాలు చెడిపోతాయనే భయంతో చాలా మంది ఫిర్యాదు చేయకుండా మౌనం వహిస్తున్నారు. కేసుల విచారణలో జాప్యం, నేర నిరూపణ తక్కువ స్థాయిలో ఉండడంతో చట్టాల పట్ల నేరస్తుల్లోనూ భయం కనిపించడం లేదు. 2024లో లైంగిక దాడుల్లో కేసుల్లో కన్విక్షన్ రేటు 28 శాతం మాత్రమే. ఎక్కువ కేసులు పెండింగులో ఉన్నాయి. మరోవైపు పోర్న్ వీడియోలు ఆన్‌లైన్‌లో విచ్చలవిడిగా అందుబాటులో ఉండడం కూడా లైంగిక వేధింపుల ఘటనలు పెరగడానికి పరోక్షంగా దోహదపడుతున్నాయని అనేక అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. లైంగిక వేధింపులను కేవలం చట్టపరమైన సమస్యగా మాత్రమే చూడొద్దు. ఇది సమాజంలో పాతుకుపోయిన ఒక మానసిక రుగ్మత. లైంగిక వేధింపుల కేసులను నివారించాలంటే ఒకవైపు కఠిన చట్టాలను అమలుచేస్తూనే.. బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాలి. అంతేకాకుండా సమాజంలోనూ మార్పు తీసుకురావాల్సిన చర్యలు చేప ట్టాల్సి ఉన్నది. బాధితుల ఆత్మహత్యలు నివారించాలంటే.. మానసిక, న్యాయ సహాయం అందించే వ్యవస్థలను కూడా బలోపేతం చేయాలి.

విశ్వం వాయిస్
VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

గురువారం, 9 అక్టోబర్ 2025
www.viswamvoice.com






### ఆత్మ కమిటీ చైర్మన్, సభ్యులకు

## అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్, సభ్యులుగా నియమితులైన వారందరికి కొత్త పేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు అభినందనలు తెలియజేశారు. కొత్తపేట నియోజకవర్గం ఆత్మ కమిటీ చైర్మన్‌గా రావులపాలెం మండల తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి జక్కంపూడి సీతారామకృష్ణ బాలాజీ, ఆత్మ కమిటీ జిల్లా కార్యవర్గ సభ్యునిగా అంకంపాలెం మాజీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కుడప కృష్ణమూర్తి నియమితులయ్యారు. సభ్యులుగా పొడగట్లపల్లికి చెందిన జనిపిరెడ్డి తాతారావు, రావులపాడుకు చెందిన బొక్కా శ్రీనివాసరావు రావులపాలెంకి చెందిన పసుపులేటి రాధాకృష్ణ, ఈతకోటకు చెందిన మట్టా వెంకటరమణ, వెదిరేశ్వరంకు చెందిన నామాల దుర్గా, లక్ష్మీపోలవరానికి చెందిన చల్లాబత్తుల సత్యవతి, దేవరపల్లికి చెందిన కట్టా శ్రీనివాసరావు,పొడగట్లపల్లి కి చెందిన సకినాల నాగజ్యోతి, అవిడికి చెందిన సూర్యవరపు వీర వెంకటేశ్వరరావు, వాడపాలెంకు చెందిన గని శెట్టి పుల్లయ్య, వానపల్లికి చెందిన దునబోయిన పల్లంరాజు గంటికి చెందిన కొల్లపు సుధీర్, పలివెలకు చెందిన తోట కళ్యాణ చక్రవర్తి, కొత్తపేటకు చెందిన బూసి మరియమ్మ,మోడేకుర్రుకు చెందిన గొలకోటి ఈశ్వరరావు, బిల్లకుర్రుకు చెందిన యెలిశెట్టి శివప్రసాద్, వానపల్లికి చెందిన బల్ల సుధారాణి వెలిచేరుకు చెందిన అంగర శ్రీను, పులిదిండికి చెందిన కుడిపూడి సుబ్బారావు, వాడపల్లికి చెందిన ఏపుగంటి వెంకటేశ్వరరావు, అంకంపాలెంకు చెందిన కరుటూరి శ్యామలాదేవి, పేరవరానికి చెందిన చిటికెన భవాని, పేరవరానికి చెందిన తలారి రమేష్,వద్దిపర్రుకు చెందిన జుజ్జువరపు బుచ్చి వెంకటరాయుడు, ర్యాలికి చెందిన బందెల ప్రసాద్, లొల్ల కు చెందిన కల్లూరి భాస్కరరావు, ఉచ్చిలికి చెందిన మట్టాలక్ష్మి నియమితులయ్యారు. ఎమ్మెల్యే బండారు వీరందరికీ అభినందనలు తెలియజేశారు.తమకు ఈ అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కు చైర్మన్, సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆర్వో ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక నియోజకవర్గం ఐ.పోలవరం మండలం మురమల్ల పంచాయితి పరిధిలో కొత్త మురముళ్లలో ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ముమ్మిడివరం నియోజకవర్గ శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు అనంతరం మురముళ్లలో జీఎస్టి అవగాహన కార్యక్రమంలో భాగముగా వ్యాపారస్తులకు, వినియోగదారులకు, ప్రజలకు జీఎస్టీ వలన ప్రజలకు కలుగు ఆర్థిక ప్రయోజనాలను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మరియు నరసాపురం నియోజకవర్గ పరిశీలకులు గుత్తుల సాయి, ఐ.పోలవరం టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సాగిరాజు సూరిబాబు రాజు, ముమ్మిడివరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కాకర్లపూడి రాజేష్, ఐ.పోలవరం పిఎసిఎస్ అధ్యక్షులు కాకర్లపూడి బుజ్జి సూర్యవర్మ పంచాయితి సిబ్బంది మరియు కూటమి నాయకులు,కార్యకర్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జగన్మోహిని కేశవ & గోపాల స్వామి అన్నదాన పథకమునకు విరాళాలు

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ర్యాలీ శ్రీ జగన్మోహిని కేశవ &గోపాల స్వామి వారిని దర్శించుకొని శ్రీ స్వామి వారి అన్నదాన పథకమునకు గుంటూరు జిల్లా తుళ్లూరు వాస్తవ్యులు ఇక్కుర్తి శ్రీనివాసరావు సామ్రాజ్యం దంపతులు స్వామి వారి అన్నదాన పథకమునకు రూ.5,116/- లు విరాళంగాను విశాఖపట్నం వాస్తవ్యులు ఈ కృష్ణకాంత్ నాగమణి దంపతులు ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ & గోపాల స్వామి వారిని దర్శించుకొని శ్రీ స్వామి వారి అన్నదాన పథకమునకు రూ.10,116/- లు విరాళంగా సమర్పించియున్నారు. దాతలకు ఆశీర్వచనం చేయించి, శ్రీ స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించడమైనదని కార్యనిర్వాహణాధికారి తెలియజేశారు.




## ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు అంబాజీపేట విద్యార్థులు



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అండర్-19 నెట్ బాల్ విభాగంలో కేఎల్డిఎస్ పూర్ణిమ జూనియర్ ఇంటర్, అండర్ 14 నెట్ బాల విభాగంలో పి.జాహ్నవి, ఎ.జనార్ధన్, అండర్ 19 బాస్కెట్బాల్ విభాగంలో ఎం.మౌనిక, టైక్వాండో అండర్ 14 విభాగంలో కే.కావ్య, అండర్ 17 విభాగంలో పీచరణ్యశ్రీ ఎంపికయ్యారని పిడి కె.ఆదిలక్ష్మి, ఉమామహేశ్వరరావు టైక్వాండో కోచ్ పి త్రిమూర్తులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిరువురిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కడలి సాయిరాం, ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు బిఎస్ఎన్ఎల్ మూర్తి, కాలేజ్ ఇంచార్జ్ ఫణి, పిఈటి సూర్యకుమారి, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

## మాజీ ఎంపీకి శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్మన్



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) మెంబర్ గా నియమితులైన అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధని అమలాపురం మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైయస్ఆర్సీపీ జిల్లా అధికార ప్రతినిధి సుధా గణపతి, కౌన్సిలర్ కొల్లాటి దుర్గాభాయ్ బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

### జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ అధ్యక్షతన

## జిల్లా పరిశ్రమలు ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం





**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలలో పరిశ్రమల అభివృద్ధికి ఎగుమతుల పెంపుదల కోసం ఆవశ్యకమైన అనుమతులు, రాయితీల ద్వారా ఔత్సాహిక పారి శ్రామి కవేత్తలను ప్రోత్స హించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ లైన్ డిపార్ట్మెంట్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు 16 వ "జిల్లా పరిశ్రమలు ఎగుమ తుల ప్రోత్సాహక మండలి "సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వ హించారు ఈ సందర్భంగా ఆయన మ సింగిల్ విండో (ఏక గవాక్ష) విధానం ద్వా రా అనుమ తుల మంజూ రు పై క్షుణ్ణం గా సమీక్షించి అను మ తులు మంజూ రును వేగవంతం చేయాల న్నారు ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద 59 యూనిట్లకు ఆమోదం తెలిపారు జిల్లాలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ వంటి మేజర్ ప్రాజె క్టులు ఏర్పాటుకై చర్యలు చేపట్టాలన్నారు. ఎంఎస్ఎం ఈ కింద క్లస్టర్ డెవల ప్మెంట్ పథకం ద్వారా వ్యవసాయ అనుబంధ విలువ ఆధారిత యూనిట్లు తీసుకురా వాలన్నారు. ఉదయం వర్క్ షాప్‌లు సమర్థవంతంగా నిర్వహించి యూనిట్లు నిర్వ హిస్తున్న నిర్వహించడానికి ముందుకు వస్తున్న వారిని అన్ని విధాలా ప్రోత్సహించా లన్నారు. వాట్సాప్ గవర్నె న్స్ మనమిత్ర వంటి యాప్‌ల ద్వారా ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అవుట్ రీచ్ కార్యక్రమాలు నిర్వహిస్తూ అగ్రి బేసిడ్ యూనిట్లు స్థాపనకు సంకల్పించాలన్నారు. క్వాయర్ పరిశ్రమల స్థాపనకు మూడు రాష్ట్రాలలో ఎక్స్పోజర్ విజిట్లు నిర్వహించి డిపిఆర్లు రూపొందించాలని ఆదేశించారు మామిడికుదు రులో క్లస్టర్ అభివృద్ధికి జియో టెక్స్టైల్ మ్యాట్లు తయారీకి ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటుకు డిపిఆర్లు కోపకల్పన చేయాలన్నారు కోకో గింజలు నాణ్యత కొరకు హార్వెస్టింగ్ విధానంపై ప్రాజెక్టు రూపొందించాల న్నారు. ఒక జిల్లా ఒక ఉత్పత్తి కార్యక్రమం అమలుపై మూడు అంశాలతో వెండార్స్ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహణకు అన్ని అంశాలపై అధ్యయనం చేస్తూ స్టాల్స్ ఏర్పాటుకు జిల్లా స్థాయిలో ఒక స్థలా న్ని ఎంపిక చేయాలన్నారు అవసరమైన అనుమతులు ఇస్తూ, దరఖాస్తుల ప్రణాళిక ను త్వరితగతిన పూర్తి చే యాల న్నారు. పీఎం విశ్వకర్మ యువజన ద్వారా కులవృ త్తులను అన్ని విధాల అవగాహన కల్పిస్తూ ప్రోత్స హించాలన్నారు. పారిశ్రామికవేత్తలకు, ముఖ్యంగా యువ తకు పథకాల లబ్ధిదారుల కు ప్రోత్సాహక మార్గదర్శ నం చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఉత్పత్తి, ఎగుమతుల లక్ష్యాదుల సాధన కోసం పాటుపడాలన్నారు. పరిశ్రమల మంజూ రులో జాప్యాలను నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అరుణ, ఏడి శివరాం ప్రసాద్ డిఆర్డిఏ పిడి గాంధీ, సిడ్బి ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్ మత్స్యశాఖ అధికారి శ్రీని వాసరావు, డ్వామా పిడి మధుసూదన్, వివిధ శాఖ ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లాభా పేక్ష లేకుండా రైతులకు పశువుల దాన అందించేందుకు చర్యలు

### జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్.వెంకట్రావు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికై ప్రాథ మిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా మిశ్రమ దానాను లాభాపేక్ష లేకుండా రైతులకు అందిం చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్.వెంకట్రావు తెలిపారు బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు ప్రాథ మిక వ్యవసాయ పరపతి సంఘాల ఉన్నతాధికారులు కార్యదర్శులు పశుసంవర్ధక శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలకు అనుగుణంగా దాన సరఫరాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంత్రీక రణతో వరికో తలు వచ్చిన తర్వాత పాడిపరిశ్రమ అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఈ యంత్రాల కోత వల్ల ఎండు గడ్డి దొరకని పరిస్థితి ఏర్పడి పాడి రైతులు పశు గ్రాసం కోసం ఇబ్బం దులు పడుతున్నారన్నారు. అధిక ధరను హెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. జిల్లాలో పాడి రైతులకు తక్కువ ధరలకు పాడి రైతులకు దాణాను అందిం చే దిశగా ఫ్యాక్స్ ద్వారా లాభాపేక్ష లేకుండా సరస మైన ధరకు సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. గోదావరి వరదలు, తుఫాన్ల సమయంలో పాడి రైతులు ఇబ్బందుల సమస్యలను పశు సంవర్ధకశాఖ అధికారులతో పలు మార్లు జిల్లా యంత్రాంగం దృష్టికి తేవడం జరిగిం దన్నారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ వారు తక్కువ ధరకు నాణ్యమైన పశు దాణాను ఏ విధంగా అందించగలమనే దానిపై పలు మార్లు చర్చలు జరిపారన్నారు. తాజాగా పశుదాణాను తయారు చేసే సంస్థలతో మాట్లాడి తక్కువ ధరకు నాణ్యమైన పశు దాణాను పాడి రైతులకు అందించేలా ఒప్పందం చేసుకుని తగిన ఏర్పాట్లు చేస్తు న్నారన్నారు. ఇప్పటికే రైతాంగానికి ఆర్థిక పరమైన సేవలందించే సొసైటీల ద్వారా ఎరువుల విక్రయాలు జరుగుతున్నాయని ఆ సొసైటీల ద్వారానే పశు దాణాను కూడా పాడి రైతులకు అందుబాటులోకి తేవాలన్నదే జిల్లా కలెక్టర్ వారి ఆలోచన అన్నారు దీనిపై సహకార సంఘ ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించామన్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఏడు నియోజకవర్గాల పరిధిలో తొమ్మిది ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో సంబంధిత దాణా తయారీ పరిశ్రమలతో ఇప్పటికే సంప్రదిం పులు జరిపారన్నారు జిల్లావ్యాప్తంగా ఎరువులు అధికంగా విక్రయించే 9 సొసైటీల ద్వారా దాణాను కూడా విక్రయించాలని జిల్లా కలెక్టర్ నిర్ణయించారన్నారు. ఈమేరకు మొదటి దశలో ఏడు నియోజకవర్గాల్లోని 9 సొసైటీల్లో పశుదాణాను ఏర్పాటుచేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసా మన్నారు .సమీకృత దాణాతో పాల ఉత్పత్తి గణనీయంగా పెరుగు తుందని పాడి పరిశ్రమ అభివృద్ధికి జిల్లా కలెక్టర్ కొత్త ఆలోచన ఫలించే విధంగా చర్యలు జరిగాయన్నారు. సమీకృత దాణాలో అన్ని రకాల మిటమిన్లతో కూడిన పదార్థాలు ఉంటాయన్నారు. 8 లీటర్లు నుంచి 10 లీటర్ల పాలిచ్చే పశువులు సవీ కృత దాణా రోజుకు 2 కిలోలు చొప్పున పెడితే సుమారు లీటరు నుంచి అరలీటరు వరకు పాలు. పెరిగే అవకాశం ఉందని స్పష్టం చేశారు. రాజోలు నియోజకవర్గంలో కడలి, పి.గన్నవరం నియోజవర్గంలో పి.గన్నవరం, ముమ్మిడివరం నియోజకవర్గంలో ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గంలో వన్నెచింతలపూడి, కొత్తపేట నియోజకవర్గంలోవానపల్లి, పొడగట్లపల్లి, ఆలమూరు, మండపేట నియోజవకర్గంలో వల్లూరు, రామచంద్ర పురం నియోజ కవర్గంలో కె.గంగవరం సొసైటీలను ఎంపిక చేయడం జరిగింద న్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికా రులు జిల్లా సహకార శాఖ సహకార పరపతి సంఘాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### భక్తుల సమక్షంలో

## హుండీలు లెక్కింపు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట ఆత్రేయపురం మండలం, ర్యాలీ గ్రామంలో వేంచేసియున్న శ్రీ జగన్మోహిని కేశవ & గోపాల స్వామి వారి దేవస్థానం నందు శ్రీ స్వామి వారి సన్నిధిలో దేవదాయ ధర్మదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశముల మేరకు మీసాల రాధాకృష్ణ, కార్యనిర్వాహణాధికారి, గ్రేడ్-1 శ్రీ ఉప్పలపాటి జానకియమ్మ అన్నదాన సత్రం, పొడగట్లపల్లి గ్రామం వారి పర్యవేక్షణలో మరియు ఆలయ చైర్మన్ & ధర్మకర్తల మండలి సభ్యులు, శ్రీ స్వామి వారి సేవకులు, సేవా సమితి సభ్యులు, భక్తులు సమక్షంలో హుండీలు లెక్కింపు జరుపగా 6 నెలల 19 రోజులకు గాను ప్రధాన హుండీల ద్వారా రూ. 8,29,515/- లు మరియు అన్నదాన హుండీల ద్వారా రూ.3,67,275/-లులి వెరశి రూ.11,96,790/-లు ఆదాయం మరియు విదేశీ నగదు యూ యాస్ ఏ 100 డాలర్-1, 10 డాలర్-3, 5 డాలర్-10, 1 డాలర్-59, సింగపూర్ 10డాలర్ -1, యుఎఇ 5 దినారం -1లి వచ్చియున్నది మరియు శ్రీ ఉమా కమండలేశ్వర స్వామి వారి దేవస్థానం నందు హుండీలు లెక్కింపు జరుపగా 6 నెలల 19 రోజులకు గాను హుండీల ద్వారా రూ. 2,64,918/-లు ఆదాయం వచ్చియున్నది. అర్చకులు, సిబ్బంది, గ్రామస్థులు, భక్తులు, సేవా సభ్యులు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## "ప్రజా ధనం దుర్వినియోగం చేస్తున్నారు"



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** గత ప్రభుత్వంలో జలజీవన్ మిషన్లో భాగంగా పుల్లేటికుర్రులో ఏర్పాటుచేసిన వాటర్ పైప్ లైన్స్ పూర్తి స్థాయిలో ఉపయోగంలోకి రాకుండానే కొత్తగా వాటర్ పైప్ లైన్స్ వేస్తూ ప్రజా ధనం దుర్వినియోగం చేస్తున్నారని ప్రజాప్రతినిధులు ఆరోపించారు. పుల్లేటికుర్రు ఎం.పి.టి.సి పబ్బినీడి రాంబాబు మాట్లాడుతూ వాటర్ పైప్ లైన్స్ వేస్తుండటం వల్ల స్థానికంగా ప్రజలు తమతమ ఇళ్ల వద్ద వ్యక్తిగత ఆస్తులను కోల్పోతూ నష్టపోతున్నారన్నారు. అంబాజీపేట, ముక్కామల పి.హెచ్.సిలలో ప్రసవాలు జరిగేందుకు అవకాశాలు లేకపోబడంతో పి.గన్నవరం సి.హెచ్.సికి వెళుతున్నారని అక్కడ మత్తువైద్యురాలు అందుబాటులో లేకపోవడంతో గర్భిణీలు నానా ఇబ్బందులు పడుతున్నారని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దృష్టికి ప్రజాప్రతినిధులు తీసుకువచ్చారు.బుధవారం అంబాజీపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు మాట్లాడుతూ వైద్య సిబ్బంది సుఖ ప్రసవాలకు ప్రభుత్వ ఆసుపత్రులకు రాలవాలని ప్రచారం చేస్తున్నారని అయితే ఆపరేషన్ లు నిర్వహించే విషయంలో మత్తు వైద్యురాలు అందుబాటులో లేకపోవడంతో రోజుల తరబడి గర్భిణీలు, రోగులు ఆపరేషన్ల కోసం వేచి చూస్తున్నారని ఎమ్మెల్యే సత్యనారాయణ దృష్టికి తీసుకువచ్చారు. ఈవిషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వివరించారు. గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లు ద్వారా అందిస్తున్న తాగునీరు శుద్ధి కావడంలేదని, ఆర్వో ప్లాంట్లు ద్వారా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో 20 లీటర్ల టిన్నును రూ.15 పైబడి విక్రయిస్తు న్నారని ఇసుకపూడి ఎంపీటీసీ ముత్తా బత్తుల ప్రశాంతకుమార్ అధికారులను ప్రశ్నించారు. ఆర్వో ప్లాంట్లుపై అధికారులు తనిఖీలు నిర్వహించాలని ఆయన కోరారు .అనంతరం వివిధ శాఖల అధికారులు ఆయా పథకాలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే గిడ్డిని ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, నీటిపారుదలశాఖ డైరక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ కార్పోరేషన్ డైరక్టర్ బొంతు పెదబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్లు, సొసైటీ చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రక్తదానంపై అవగాహన పెంచే సంచార, సమాచార, ప్రచార వాహనం ప్రారంభించిన

# అడిషనల్ డిఎంహెచ్ఓ భరత్ లక్ష్మి లెప్రసీ, ఎయిడ్స్, టిబి అధికారి




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజలలో మరియు యువతలో హెచ్.ఐ.వి ఎయిడ్స్ వ్యాధి పై మరియు స్వచ్ఛంద రక్త దానముపై అవగాహన పెంచేందుకు సంచార సమాచార ప్రచార వాహనమును డాక్టర్ సిహెచ్ వి.భరత లక్ష్మీ,జిల్లా లేపాక్షి ఎయిడ్స్ టీవీ అధికారి వారి చేతుల మీదుగా జెండా ఊపి ఏరియా ఆసుపత్రి అమలాపురంలో ప్రారంభించడమైనది. డాక్టర్. సిహెచ్ వి.భరత లక్ష్మీ మాట్లాడుతూ జిల్లా యువత హెచ్.ఐ.వి.ఎయిడ్స్ వ్యాధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని హెచ్.ఐ.వి.ఎయిడ్స్ రహితముగా" చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని తెలిపారు అంతే కాకుండా ఈ సంచార సమాచార వాహనములో ప్రదర్శించే వీడియోలు చాలా సామాన్య ప్రజలకు కూడా అర్ధమయ్యే విధముగ వున్నాయని, జన సమూహాలు, కళాశాలల వద్ద మరియు రద్దీ ప్రదేశములలో వీటిని ప్రదర్శిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పి.బాలాజీ, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్, ఏ.బుజ్జి బాబు, జిల్లా సూపర్వైసర్, రామనాయిడు, ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎమ్.వి.రత్నా రాజు జిల్లా మానిటరింగ్ డేటా ఆఫీసర్, జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ విభాగము, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థులలో నూతన జిఎస్టీ సంస్కరణలపై అవగాహన సదస్సు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలో స్థానిక కృతి వెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు జిఎస్టీ 2.0 నూతన సంస్కరణలుపై ప్రజలు పొందే ప్రయోజనాలును ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. హెచ్. రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులలో మరియు ప్రజలలో అవగాహన కల్పించడం కోసం ఎకనామిక్స్,కామర్స్ విభాగం తరపున సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.రాజు ముఖ్య అధితిగా పాల్గొన్నారు.ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ నూతన సంస్కరణల వల్ల ప్రజలకు అనేక రకాల ప్రయోజనాలు చేకూర్తున్నాయని,ధరలు తగ్గడం వల్ల మధ్యతరగతి కుటుంబ సభ్యులు అధికంగా లాభాన్ని పొందే అవకాశం ఉందని తెలియజేశారు.ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని కళాశాల విద్యార్థిని, విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించడం జరిగింది.ఈ పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మొదటి స్థానంలో బి. నవ్య,రెండవ స్థానంలో పి. భవాని,మూడో స్థానంలో పి.సాయి రోహిత్ పోటీల్లో విజేతలుగా నిలుచ్చారు.విరందరికి మున్సిపల్ కమిషనర్ మరియు కళాశాల ప్రిన్సిపల్ ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

# వికలాంగుల పునఃపరిశీలన శిబిరాలు ప్రారంభం..

– జిల్లాలో అప్పీల్ చేసుకున్న 2,231 మంది అర్హులు

– కలెక్టర్ ఆదేశాల మేరకు అక్టోబర్ 8 నుండి జిల్లాలో రాజమహేంద్రవరం, అనపర్తిలో సదరం శిబిరాలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్టీఆర్ భరోసా పథకం కింద వికలాంగుల పునఃపరిశీలన (రీ అసెస్మెంట్) తరువాత కొంతమంది దివ్యాంగుల శాతం తగ్గినట్లు గుర్తించినట్లు జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎం.పద్మ తెలిపారు.ఈ సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం ఆ అభ్యంతరాల నేపథ్యంలో సంబంధితులపై తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించిందని చెప్పారు. ఇందు కోసం అప్పీల్ చేసుకున్న వారికి మళ్లీ పరీక్షల అవకాశం కల్పించామని తెలిపారు. ఆ మేరకు అక్టోబర్ 8వ తేదీ నుండి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి, అనపర్తి ఏరియా ఆసుపత్రి, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహించి వికలాంగత్వ ధృవీకరణ పత్రాలు (సదరం సర్టిఫికేట్లు) జారీ చేయనున్నట్లు తెలిపారు. బుధవారం, గురువారం, శుక్రవారం ప్రభుత్వ పని దినాల్లో ఈ సదరం శిబిరాలు జరుగనున్నాయని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 2,231మంది అప్పీల్ చేసుకున్నారని తెలిపారు. ఈ శిబిరాల నిర్వహణ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు జరుగుతుందని ఆమె తెలిపారు. రోజుకు అంగవైకల్యం (లోకోమోటివ్) ఉన్న 30 మందికి, చెవిమాంద్యం ఉన్న 30 మందికి, కంటి చూపు మాంద్యం ఉన్న 20 మందికి, మానసిక లోపం ఉన్న 20 మందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు, జిల్లా ప్రజా ప్రతినిధుల మార్గ దర్శకత్వంలో వైద్య పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. అప్పీల్ చేసుకున్న ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన తేదీల్లో ఆయా ఆసుపత్రులకు హాజరై రీ-అసెస్మెంట్ పరీక్షలు చేయించుకోవాలని జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్య శాఖ, డి.ఆర్.డి.ఏ శాఖలు కోరుతున్నాయని డాక్టర్ పద్మ తెలిపారు. రాజమహేంద్రవరం జీజీహెచ్లో డాక్టర్ భారత్ కుమార్ జైన్ (ప్రొఫెసర్, ఆఫ్తాల్మాలజీ), డాక్టర్ మేరీ ఇంద్ర (అసిస్టెంట్ ప్రొఫెసర్, ఈఎన్టి) వైద్య పరీక్షలు నిర్వహించారని, ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఏ డిపిఎం (పెన్షన్) ఎం.మారుతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భరత్ భూషణ్‌ని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన

# పేరూరు సర్పంచ్ దాసరి అరుణ డేవిడ్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, "స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసి) మెంబర్‌గా నియమితులైన అమలాపురం మాజీ శాసన సభ్యులు కీర్తి శేషులు కుడుపూడి చిట్టాబ్బాయ్ తనయులు అన్న కుడిపూడి భరత్ భూషణ్‌ని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పేరూరు గ్రామ సర్పంచ్ దాసరి అరుణడేవిడ్ మరియు ఎంపీటీసీ సభ్యులు వాసంశెట్టి శ్రీనివాస్ పాలక వర్గ సభ్యులు అప్పారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మైనింగ్ తనిఖీలపై నిఘా అధికార్ల మౌనం ....!

శంఖవరం మండలంలో రెండో రోజూ తనిఖీలు – కొంతంగి, వెంకటాపురం, వజ్రకూటంలో తనిఖీలు, ఫొటోలు, వీడియోలు, దస్త్రాల సేకరణకే పరిమితం – ప్రస్తుతానికి కేసులు నమోదుకు ధర్మసందేహాలు...?







**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలో వరుసగా రెండో రోజు కూడా ఏలూరు ప్రాంతీయ గనులు, ఖనిజాలశాఖ నిఘా అధికారులు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ప్రారంభమైన ఈ తనిఖీలు బుధవారం కూడా కొనసాగాయి. మంగళవారం కత్తిపూడిలో తనిఖీలు చేయగా, బుధవారం కొంతంగి, వజ్రకూటం, వాద్రేవు వెంకటాపురం గ్రామాల్లోని అక్రమ మైనింగ్ స్థావరాలను ఏలూరు ప్రాంతీయ గనులు, ఖనిజాలశాఖ నిఘా బృందం సహాయ సంచాలకులు కిషోర్ బాబు ఆదేశాల మేరకు రాయల్టీ ఇన్స్పెక్టర్ జంగం గంగాధర్, టెక్నికల్ అసిస్టెంట్ గుర్రపు ప్రవీణ్ కుమార్ ఈ తనిఖీలను నిర్వహించారు. మధ్యాహ్నం 1 గంటకు తొలుత కొంతంగిలో వీఆర్వో తిరుమలనీడి సీతారామ్, వీఆర్ఏ. ప్రసాద్ సమక్షంలో సర్వే నెంబర్ 163 లోని పాటికొండలో 30 ఎకరాల విస్తీర్ణంలో మొదలు పెట్టిన అక్రమ మైనింగును పరిశీలించారు. ఇక్కడ కేవలం సుమారు 50 నుంచి 80 సెంట్లు విస్తీర్ణంలో మాత్రమే అక్రమ మైనింగ్ తవ్వకాలు జరిపినట్టు కొలతలతో నిమిత్తం లేని కంటి చూపు అంచనా మేరకు లెక్కించారు. తర్వాత ఎస్. జగ్గంపేట పంచాయతీ పరిధిలోని వాద్రేవు వెంకటాపురంలోని సర్వే నెంబర్ 68 లోని 5.60 ఎకరాల్లోని కుమ్మరిమెట్ట మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ దాదాపు 2 ఎకరాల్లో అక్రమంగా తవ్వేశారని నిఘా అధికారుల అంచనా. రామన్నపాలెం (నదార్తు) గ్రామం పరిధిలోని చాకలి దాని చెరువుని పరిశీలించారు. ఇది చాలా వరకు నీటితో నిండి ఉంది. ఐతే వీటి అన్నిచోట్లా నిఘా తనిఖీ అధికారులు ఛాయాచిత్రాలు, దృశ్యచిత్రీకరణ చేసుకుని, అవసరమైన సాక్ష్యాల దస్త్రాలను సేకరించారు. ప్రస్తుతానికి ఏ మేరకు తవ్వారనేది నిర్ధారణకు సర్వే చేయలేదు. ఎన్ని క్యూబిక్ మీటర్లు, ఎంత విలువైన మట్టిని తవ్వారనే దానిపై ఏవిధమైన గణన చేపట్టలేదు. అంతే కాదు తనిఖీలు వద్ద ఇతరులు ఎవరినీ అనుమతించడం లేదు. అలాగే మీడియా పాత్రికేయులకు కూడా ఏవిధమైన సమాచారాన్ని వెల్లడించడం లేదు. మైనింగ్ తవ్వకాల క్వారీల వద్ద సంబంధిత వ్యక్తులూ ఎవరూ అందుబాటులో లేక ఎవరి మీద కేసులు నమోదు చేయాలనే ధర్మ సందేహాలు అధికారులకు ఎదురు అవుతున్నట్టు తెలిసింది.

**మైనింగ్ శాఖకు దొరకని అక్రమార్కులు ...**

మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల కనుసన్నల్లోనే దశాబ్దాల కాలంగా ఈ అక్రమ మైనింగ్ జరుగుతోంది. అప్పుడు, ఇప్పుడూ అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో కొండలు, గుట్టలు, మెట్టలు, చెరువులు, వై.ఆర్.సి, గుట్టల సాయిల్ బ్యాంకులను తవ్వేసి లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి, గ్రావెల్‌ను తరలించుకు పోయారు. తవ్వి తీసిన ఖనిజానికి రాయల్టీ, సీనరేజ్ చెల్లించకుండా అమ్మేసుకొని సొమ్ము చేసుకుంటుండటం ఏళ్ల తరబడిగా సాగుతోంది. దోచేసిన మొత్తం విలువ ఎంత ఉంటుందోనని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శంఖవరం సామాజిక ఉద్యమకారుడు మేకల కృష్ణ ఫిర్యాదులతో ప్రస్తుత రెండు రోజుల్లోనే గుర్తించిన అక్రమాలను చూస్తేనే కళ్లు తిరుగుతున్నాయి. ఇక పూర్తి స్థాయి అక్రమాలపై నిగ్గు తేల్చితే అంచనాలకు అందని పరిస్థితి. మైనింగ్ అక్రమాలకు పాల్పడేవారు ప్రైవేట్ నిర్మాణాలకు వాటిని సరఫరా చేస్తున్నారు.

# బీజేపీ ఓట్ల దొంగతనం చేసి ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించింది

పీసీసీ కార్య నిర్వాహక అధ్యక్షులు జేడీ శీలం ధ్వజం - టీకే ఆధ్వర్యంలో ఓట్ చోర్..గద్దె చోడ్"పేరుతో సంతకాల సేకరణ ప్రారంభం - పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరిక







**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఓట్ల దొంగతనానికి పాల్పడి ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలిగించిందని రాష్ట్ర పీసీసీ కార్య నిర్వాహక అధ్యక్షులు జేడీ శీలం ఆక్షేపించారు. బుధవారం స్థానిక పేపర్ మిల్లు ఎదురుగా ఉన్న కృష్ణసాయి కల్యాణ మండపంలో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు టీకే విశ్వేశ్వర రెడ్డి తదితరుల కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు.బీహార్ లో 60 లక్షల ఓట్లు తొలగించారని ఆరోపించారు.కర్నాటకలో 6 వేల ఓట్లు తొలగించారని, నకిలీ ఓట్లు భారీగా నమోదు అయ్యాయని మండిపడ్డారు. ఈ వ్యవహారంలో ఎన్నికల సంఘం చేష్టలుడిగి చూస్తోందని తీవ్రంగా ఆక్షేపించారు. జరిగిన లోపాలపై ఈసీని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నిస్తే మౌనం వహిస్తోందనివిమర్శించారు.కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ ఇచ్చిన "ఓట్ చోర్..గద్దె చోడ్"నినాదంతో తూర్పు గోదావరి జిల్లాలో లక్షసంతకాల సేకరణ ఉద్యమాన్ని చేస్తున్నామని, ఈ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా అందరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఐదు డిమాండ్లతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేస్తూ సంతకాల సేకరణ చేస్తున్నామని చెప్పారు.దేశ వ్యాప్తంగా 5 కోట్ల సంతకాలను రాహుల్ గాంధీ నేతృత్వంలో ఈసీకి అందజేస్తామని తెలిపారు.ఫోటోలతో స్పష్టమైన ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచాలని, ఓటరు జాబితాలో చేసిన మార్పులు చేర్పులను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తొలగించిన ఓట్లలో తప్పులు దొర్లితే ఫిర్యాదు వ్యవస్థను అందుబాటులో ఉంచాలని ,ఎన్నికల ముందు ఓట్ల మార్పులు, చేర్పులు చేయరాదని సూచించారు.ఉద్దేశ పూర్వకంగా ఓట్లు తొలగించిన అధికారులు, ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఓట్ల దొంగలు గద్దె దిగాల్సిందేనని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన జిల్లా కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో జేడీ శీలం సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి విశ్వేశ్వర రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా వేసి సాదర స్వాగతం పలికారు. ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ పాలక్ వర్మ మాట్లాడుతూ బీహార్, కర్నాటక, మహారాష్ట్రలో జరిగిన ఓట్ల దొంగతనం, నకిలీ ఓట్ల నమోదుపై గణాంకాలతో వివరించారు. ఈ విధానం ప్రజల హక్కులను కాల రాసిందని, తద్వారా భారత ప్రజా స్వామ్యాన్ని నిర్వీర్యం చేసిందని ఆమె దుయ్యబట్టారు. బీహార్‌లో సాలీనా రూపాయి లీజుకు 150 ఎకరాలను ప్రభుత్వం కట్టబెట్టిందని ఆరోపించారు.దేశంలో ముగ్గురు బడా వ్యాపారుల కన్నుసన్నలలో కేంద్ర ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. కర్నాటకలో మహదేవ్ పురలో చిన్న గది లాంటి ఇంట్లో సుమారు 60 నుంచి 80 నకిలీ ఓట్లు నమోదు చేశారని,ఆ ఇల్లు బీజేపీకి చెందిన వ్యక్తికి చెందినదని పాలక్ వర్మదుయ్యబట్టారు. అనంతరం పేపర్ మిల్లు వద్ద టీకే విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని జేడీ శీలం ప్రారంభించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డి,కాంగ్రెస్ నాయకులు కె.శివాజీ, మార్టిన్ లూథర్, అరిగెల అరుణకుమారి, అమరజహా బేగం, బాలేపల్లి మురళీధర్, బోడా వెంకట్, మోతా శారద, బేగ్, మేడవరపు భద్రం, డాక్టర్ వడయార్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**పి.గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పి. గన్నవరం మండలం లోని పి. గన్నవరం జడ్పీ హైస్కూల్‌లో, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 మరియు అండర్-15 బాలురు, బాలికల మండల స్థాయి క్రీడా పోటీలు మరియు ఎంపిక కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "క్రీడల ద్వారా విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు మానసిక వికాసం పొందగలరు. క్రీడల వల్ల జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉంటుంది. ఈ పోటీల్లో ప్రతి ఒక్క విద్యార్థి తన ప్రతిభను చాటాలని ఆశిస్తున్నానుఅని తెలిపారు.ఎమ్మెల్యే స్వయంగా వాలీబాల్ మరియు కబడ్డీ పోటీలను ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడుతూ అందరిలో ఉత్సాహం నింపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.



# రాష్ట్రం సుభిక్షంగా ఉంది.. జగన్ ప్రతిపక్షం అవసరం లేదు..

- జోడు గుర్రాల స్వారీగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం.. - పేర్ని నాని లాంటి వాళ్ళు గాడి తప్పడం శోచనీయం..
- ప్రజా సమస్యలపై పోరాటం చేయకుండా ఎదగాలనుకోవడం అపోహే : బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఒక పక్క అభివృద్ధి, మరోపక్క సంక్షేమంతో జోడుగుర్రాల స్వారీ చేస్తుంటే, వైసిపి వాళ్ళు బూతులతో స్వారీ చేస్తున్నారని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు విమర్శించారు. స్థాయిని మరిచి ఇష్టంవచ్చినట్లు బూతులు మాట్లాడ్డం దారుణమన్నారు. స్థానిక క్వారీ ఏరియాలోని బిజెపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలిష్డ్ గా మాట్లాడే పేర్ని నాని లాంటి వాళ్ళు కూడా గాడి తప్పుతున్నారని అన్నారు. గతంలో రూ.3000 పెన్షన్ ఇవ్వడానికి ఏడాదికి రూ 250చొప్పున పెంచారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చెప్పిన మాట ప్రకారం రూ.4000కు పెంచిందన్నారు. వైసిపి హయాంలో ఆటో డ్రైవర్స్ కి రూ 10,000 ఇస్తే, కూటమి ప్రభుత్వం రూ.15,000 ఇచ్చిందని సోము వీర్రాజు గుర్తు చేసారు. రాష్ట్రంలో అప్పులు ఎలా తెస్తారు, ఏం జరుగుతోంది, ఎలా జరుగుతోంది అనే విషయాలు ఐదేళ్ళ ప్రభుత్వం నడిపిన జగన్మోహన్ రెడ్డికి బాగా తెలుసునని సోము వీర్రాజు పేర్కొన్నారు. ఎందుకంటే జగన్మోహన్ రెడ్డి టైంలో చేసిన అప్పులు అంతా ఇంతా కాదన్నారు. డీవియేషన్ కూడా ఎంతో ఉందన్నారు. అభివృద్ధి చూసుకుంటూ సంక్షేమం కూడా చూసుకుంటూ ప్రభుత్వం నడపాలని, అయితే వైసిపి హయాంలో నడిచిన తీరు, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో డబుల్ ఇంజన్ సర్కార్ లో కేంద్రం ఏవిధంగా సహకరిస్తోంది, అనేది చూడాలన్నారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో అన్ని రాష్ట్రాలకు ఇచ్చిన మాదిరిగా అప్పు ఇచ్చామని, అప్పు సహజమని, ఇప్పుడు కూడా అప్పు ఇస్తున్నామని సోము వీర్రాజు అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వానికి పోలవరానికి చేసిన దానికంటే అదనంగా అడ్వాన్స్ ఇస్తున్నామని, అలాగే కేపిటల్ కి అడ్వాన్ ఇస్తున్నామని ఆయన చెప్పారు. స్టీల్ ప్లాంట్ కి రూ 11,000కోట్లకు రూ 8,000కోట్లు రిలీజ్ చేశామని ఆయన తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉందని, మీ ప్రతిపక్షం అవసరం లేదని, బూతుల పక్షం అవసరం లేదని జగన్ నుద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. చాలా చేశామని కౌన్సిల్లో చెబుతూ ఉంటారని, మరి చేస్తే 11సీట్లే ఎందుకు వచ్చాయని సోము వీర్రాజు ప్రశ్నించారు. దీనిపై కొంతకాలం ఆత్మవిమర్శ చేసుకోవాలని, విశ్రాంతి తీసుకుని జ్ఞానోదయం కలగాలని, యోగా చేసుకోవాలని ఆయన హితవుపలికారు. అప్పుడు మంచి ఆలోచనలు వస్తాయన్నారు. అది మానేసి మేము వస్తే అదిచేస్తాం ఇది చేస్తాం అంటే ఎలాగన్నారు. వెంకన్నబాబు నెయ్యి రూ 420కి కొనడాన్ని ఆయన ప్రస్తావిస్తూ, 'ఫోర్ ట్వంటీ'కి ఎలా వస్తుందని, అంటే 'ఫోర్ ట్వంటీ' మనస్తత్వమా అని ఆయన మండిపడ్డారు. కనీస ఇంగితజ్ఞానం ఉండాలికదా అన్నారు. ఇన్ని తప్పులు చేసాక భగవంతుడు శిక్షించాక ఇంకా పెద్ద మాటలు, డాంబికాలు మాట్లాడవద్దని, బూతులు మాట్లాడొద్దని ఆయన హితవు పలికారు. జరుగుతున్న అభివృద్ధిని స్పష్టంగా అర్థం చేసుకోవాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయకుండా ఎదగాలనుకోవడం అపోహే కాగలదని సోము వీర్రాజు అన్నారు. తగినన్ని సీట్లు రాకుండా ప్రతిపక్ష హోదా ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. వైసిపి హయాంలో లిక్కర్ తయారీదారుగా ఉన్న వ్యక్తి పొరపాటున టిడిపిలో చేరి అదే ఒరవడి కొనసాగించడంతో ఎట్టకేలకు గుర్తించారని, అయితే ఇది కూటమి ప్రభుత్వానికి సంబంధం లేదని సోము వీర్రాజు స్పష్టం చేసారు. వైసిపి హయాంలో లిక్కర్ తయారీలో ప్రభుత్వానికి సంబంధం ఉందని, ఎందుకంటే ఫ్యాక్టరీలు లీజుకి తీసుకున్నారని, వాళ్ళే తయారుచేసి, వాళ్లే అమ్మారని, ఆయన పేర్కొన్నారు. డిజిటల్ చెల్లింపులు కాకుండా నగదు చెల్లింపులు జరిపించుకున్నారని ఇదే పెద్ద స్కామ్ అని అన్నారు. గత ప్రభుత్వానికి లిక్కర్ తయారుదారుకి సంబంధం ఉందని ఆయన అన్నారు. బిజెపి అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాశ్ మాట్లాడుతూ స్వదేశీ వస్తువులనే వినియోగించాలని ప్రధాని మోడీ ఇచ్చిన పిలుపు మేరకు అందరూ ఈ దేశంలో ఉత్పత్తి చేసిన వాటినే వినియోగించాలని అన్నారు. స్వదేశీ వస్తువులు కొనుగోలు ద్వారా మనదేశం ఆర్థికంగా బలపడుతుందని, పారిశ్రామికంగా ముందుకు వెళ్తుందని అన్నారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ పేరిట ప్రతిజిల్లాలో కూడా ఒక ఉత్పత్తిని గుర్తించి వాటినే వినియోగించేలా చైతన్యం కలిగిస్తామని ఆయన తెలిపారు.

## రాయవరం ఘటనపై ఎంపీ పురందేశ్వరి దిగ్భ్రాంతి




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణాసంచా పేలుడు దుర్ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బార్బడోస్‌లోని బ్రిడ్జ్‌టౌన్‌లో ఈనెల 12వ తేదీ వరకు జరగనున్న 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సమావేశంలో పాల్గొనడానికి వెళ్లిన ఆమె ఈ దుర్ఘటన గురించి తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ఈ ఘటనలో 6గురు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని ఆమె పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని, బాణాసంచా తయారీ సమయంలో భద్రతా నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని ఎం.పీ పురందేశ్వరి సూచించారు.

## డాక్టర్ పిల్లి వెంకటేష్‌కు ఆర్.ఎల్ ఠాకూర్ అవార్డు ఎంపిక..

### ఇండియన్ సిరామిక్ సొసైటీ 89వ వార్షిక సదస్సు నవంబర్ 27న ముంబాయిలో ప్రధానం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ వెంకటేష్‌కు ఆర్ఎల్ ఠాకూర్ అవార్డు వచ్చే నెల 27న ముంబాయిలో ప్రదానం రాజమహేంద్రవరా నికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ పిల్లి వెంకటేష్ ప్రతిష్టాత్మక డాక్టర్ ఆర్ఎల్ ఠాకూర్ అవార్డును అందుకోనున్నారు. నగరంలోని ఆల్కాట్ తోటకు చెందిన పిల్లి సత్యనారాయణ కుమారుడైన వెంకటేష్ కోల్‌కతాలోని సెంట్రల్ గ్లాస్ అండ్ సిరామిక్ రీసెర్చ్ సెంటర్ లో శాస్త్రవేత్తగా పని చేస్తున్నారు. సిరామిక్ విజ్ఞాన, సాంకేతికరంగాల్లో అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనను, జంషెడ్ పూర్‌లోని టాటా స్టీల్ సంస్థలో ప్రిన్సిపల్ రీసెర్చర్‌గా పని చేస్తున్న అనుశ్రీ నాగ్‌లను సంయుక్తంగా ఈ అవార్డుకు ఎంపిక చేసినట్టు ఇండియన్ సిరామిక్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ జితేందు మండల్ తెలిపారు. నవంబర్ 27న ముంబాయి ఐఐటీ లో జరిగే ఇండియన్ సిరామిక్ సొసైటీ 89 వ వార్షిక సదస్సు ప్రారంభ వేడుకలో డాక్టర్ వెంకటేష్ అవార్డును అందుకుంటారు.

## తెదేపా నేత బుడ్డిగ గోపాలకృష్ణకు సోదర వియోగం

### బుడ్డిగ సత్యనారాయణ మృతికి రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి సంతాపం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ బుడ్డిగ గోపాల కృష్ణకు సోదర వియోగం కలిగింది. వారి అన్నయ్య బుడ్డిగ సత్యనారాయణ స్థానిక సీతంపేటలోని నివాస గృహంలో మంగళవారం రాత్రి అనారోగ్యంతో బాధ పడుతూ కన్నుమూశారు. వీరి వయసు 85 స.లు, వీరికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సత్యనారాయణ ఆర్టీసీలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. బుధవారం ఆయనకు అంత్యక్రియలు నిర్వహించారు. సత్యనారాయణ మృతికి రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, ఆర్టీసీ చైర్మన్ కొనగోళ్ల నారాయణ, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య, గౌతు శిరీష, పితాని సత్యనారాయణ, సీఎం కార్యక్రమాల నిర్వహణ కన్వీనర్ పెందుర్తి వెంకటేష్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆళ్ళ గోవింద్ తదితరులు సంతాపం ప్రకటించారు.

దాలిపర్తి వేమన ఆధ్వర్యంలో

## ఎమ్మెల్యే గోరంట్లకు కుమ్మర శాలివాహన సంఘం ఘన సన్మానం







**కడియం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికి ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ దాలిపర్తి వేమన ఆధ్వర్యంలో కడియం మండలం వీరవరం, దామిరెడ్డిపల్లి కుమ్మర శాలివాహన వారిచే ఘన సన్మానం జరిగినది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ నేడు కుమ్మర కులవృత్తి బాగా వెనుకబడి పోయిందని, కుమ్మర సామాజిక వర్గం వారిలో కూడా రాజకీయ చైతన్యం తక్కువగా ఉందని, ప్లాస్టిక్ పరికరాలు, బిందులు వంటి వస్తువులు నేడు కుమ్మర కులవృత్తిని దెబ్బతీస్తున్నాయని, కుమ్మర కుల వృత్తిదారులు చేస్తున్న ప్రత్యామ్నాయ పనులకు అవసరమైన పనిముట్లను కూడా ప్రభుత్వం మంజూరు చేయవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్లకు బుచ్చయ్య చౌదరి చెప్పడం జరిగింది. కార్పొరేషన్ డైరెక్టర్ దాలిపర్తి వేమన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక కార్యకర్తగా 42 స.ల నుండి పార్టీకి సేవ చేస్తున్నానని, అదేవిధంగా గత ముప్పై సంవత్సరాలు నుండి కుమ్మర శాలివాహన సామాజిక వర్గం వారి సమస్యలను పరిష్కరిస్తూ, తనవంతు సామాజిక వర్గానికి సహాయ పడుతున్నానని రాబోయే కాలంలో ప్రభుత్వ పథకాలను కుమ్మర సామాజిక వర్గం వారికి మరింత చేరువ చేస్తూ కుల సంఘానికే కాకుండా "కూటమి ప్రభుత్వానికి కూడా మంచి పేరు తీసుకురావడంలో కృషి చేస్తానని ఈ సందర్భంగా దాలిపర్తి వేమన తెలియజేశారు. కార్యక్రమంలో వెలుగుబంటి ప్రసాద్, జెమినీ, ఆదిమూలం సాయిబాబా, బత్తుల రాజావరప్రసాదు, మంతెన శ్రీనివాస్, మానేపల్లి కపిల రావు, గాది చంద్రశేఖర్, టిల్లపూడి శ్రీనివాసరావు, పేరూరి గంగాధరం, మెరుగుమిల్లి సత్య నారాయణ, టీవీ రావు, మానేపల్లి తాతారావు, రాయపూడి మల్లేశ్వరరావు, దాలిపర్తి భీమేశ్వర రావు, వీరబాబు, ద్రాక్షారామ స్వామి, కుల సంఘం నాయకులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## ఆకాశపు వారి రజస్వల వేడుకలో పాల్గొన్న బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం సీతానగరం రాజు గార్డెన్స్ ఫంక్షన్ హాల్ నందు ఘనంగా జరిగిన ఆకాశపు వారి రజస్వల వేడుకలో జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మిపాల్గొని దీక్షితను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా ఎస్పి డి.నరసింహకిషోర్ ఆదేశాల ప్రకారము రాజమహేంద్రవరంలో గల జెడ్పి హెచ్ హైస్కూల్, విజయదుర్గా జూనియర్ కాలేజ్ విద్యార్థులకు సైబర్ నేరాల గురించి అవగాహన కార్యక్రమాన్ని జిల్లా సైబర్ ల్యాబ్ పోలీసులు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సు నందు సైబర్ ల్యాబ్ పోలీసులు మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల విద్యార్థులు పూర్తిగా అవగాహన కలిగి ఉండి, తగుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని, తక్కువ ఇన్వెస్ట్మెంట్‌తో ఎక్కువ డబ్బులు వస్తాయని, సులువుగా డబ్బులు సంపాదించాలని అత్యాశకు పోయి, సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని డబ్బులు పోగొట్టుకుంటున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇంస్టాగ్రామ్ లో అపరిచితు లతో చాటింగ్ చేయవద్దని, ఇతర యాప్‌లు, లింకులు, ఈ మెయిల్స్‌తో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. విద్యార్థులు అనవసర లింక్‌లను, అప్లికేషనులను క్లిక్ చేయడంతో కలిగే అనర్థాలు గురించి వివరించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్ సైట్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా సైబర్ ల్యాబ్ సిబ్బంది అయిన వైవి సురేష్, పి.దుర్గాప్రసాద్, సుమారు 300 మంది విద్యార్థిని, విద్యార్థులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిశుభ్రత లేని

## వంగలపూడి అంగన్‌వాడీ కేంద్రం



శుభ్ర పరుస్తున్న దృశ్యం

**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని వంగలపూడి గ్రామంలో ఎస్సీ ఏరియాలో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో కమ్యూనిటీ హాల్ భవనంలో అంగన్వాడి కేంద్రం నడుపుతున్నారు ఆ భవనంలో ప్రతిరోజు గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో వాంతులు చేసుకుని డ్రింకు ప్రారంబోసి అపరిశుభ్రంగా తయారు చేస్తున్నారని, ప్రతిరోజు ఉదయం విధులకు రాగానే అంగన్వాడి కేంద్ర హెల్పర్ దానిని శుభ్రపరుస్తున్నారని, అలాంటి ప్రాంతానికి చిన్నారులను పంపించడానికి తల్లిదండ్రులకు భయమేస్తుందని పిల్లల ఆరోగ్యమే ముఖ్యమని తల్లిదండ్రులు వాపోతున్నారు. కావున సంబంధిత అధికారులు ఈ సమస్యకు పరిష్కారాన్ని చూపించాలని డిమాండ్ చేస్తున్నారు.

కాటవరంలో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను

## అందజేసిన బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సీతానగరం మండలం కాటవరం గ్రామానికి చెందిన గోలి భారతికి రూ.40, 227/లు, బుల్లి వెంకట రామారావుకు రూ.2, 24,100/ల సీఎం ఆర్ఎఫ్ చెక్కులను జనసేన నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి వారి ఇంటికి స్వయంగా వెళ్లి అందజేశారు.

# పొన్నం వ్యాఖ్యలు హాస్యాస్పదం

**దొంగలు దొంగలు అంటే భుజాలు తడుముకున్నట్టుంది.**

**బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్..**



**జగిత్యాల :** మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను ఉద్దేశించి దున్నపోతు అంటూ సంబోధించిన మరో మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారని ఇది బీజేపీ బిఆర్ఎస్ కుట్ర ఆరోపించడం హాస్యాస్పదంగా ఉన్నాయని దొంగలు దొంగలు అంటే భుజాలు తడుముకున్నట్టుందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మర్రిపెల్లి సత్యం మాట్లాడుతూ అణగారిన వర్గాలను దళితులను తాడిత పీడిత ప్రజలను అవమానపరిచే విధంగా మాట్లాడడం కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలకు మాత్రమే చెల్లుతుందని అన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పటి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను వేదికపై మంత్రి అని చూడకుండ అసహ్యంతో చేయి పట్టి పక్కకు నెట్టితే ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక బీసీ మంత్రి ఎస్సీ మంత్రి అయిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను దున్నపోతు అని వేదికపై సంబోధించడం చూస్తే కాంగ్రెస్, బిఆరెస్ పార్టీలకు దళితులపై బడుగు బలహీన వర్గాలపై చూపుతున్న సవతిప్రేమ అర్థమవుతుందని అన్నారు.గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వంలో వరంగల్ జిల్లాకు చెందిన అగ్రవర్ణాల మంత్రి దళితులకు చదువు రాదని ఉన్నతమైన ఉద్యోగాలు చేస్తున్న దళితులవల్లే తెలంగాణ వెనుకబడి పోతుందని దళిత ఉద్యోగులను అవహేళన చేసి మాట్లాడితే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రెడ్డి కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని బీసీలకు దళితులకు పాలించడం చేతకాదని రెడ్డిలు,రావులు మాత్రమే పాలించడానికి అర్హులు అని బీసీలపై,దళితులపై ఉన్న అక్కసును వెళ్లగక్కారని ఇది కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీల వైఖరికి నిదర్శనం అని గుర్తుచేశారు.బీసీ మంత్రి హోదాలో ఎస్సీ మంత్రి సమక్షంలో మరో ఎస్సీ మంత్రిని అవమాన పరచిన పొన్నం ప్రభాకర్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వివిధ రాజకీయ పార్టీలలో పనిచేసే రాజకీయ నాయకులు నైతిక విలువలకు కట్టుబడి సద్విమర్శలు చేసుకోవాలి తప్ప తేనెలొలుకు తెలుగు భాష తెలుగుజాతి సిగ్గుపడేలా మాట్లాడకూడదని సూచించారు.ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తోడేటి గట్టయ్య, ఉపాధ్యక్షుడు వరద రాము, కార్యదర్శి కడారి జనార్దన్, కాకల్ల సతీష్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు తడగొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

# బుధవారం బోధనకు ప్రాధాన్యత ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్ :** ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం బోధన కార్యక్ర మానికి ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులకు కఠినమైన అంశాలు, పాఠాలు నేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ బుధవారం సందర్శించారు. జడ్పీహెచ్ఎస్ లో, బుధవారం బోధన లో భాగంగా పదవ తరగతి విద్యార్థులు నేర్చుకుంటున్న అంశాలను పరిశీలించారు. ఆంగ్ల పాఠం నేర్చుకుంటుండగా ప్రతి విద్యార్థితో ఆంగ్ల పాఠాన్ని చదివించారు. పాఠాలు చదవడంలో మెళకువలు నేర్పారు. అన్ని పాఠశాలల్లోని అన్ని తరగతుల్లో బుధవారం బోధన పకడ్బందీగా అమలు చేయాలని విద్యాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు కఠినమైన సబ్జెక్టులను నేర్చుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ముఖ్యంగా ఇంగ్లీష్ సమర్థవంతంగా నేర్చుకోవడానికి చక్కటి వేదిక అని తెలిపారు. విద్యార్థులు కష్టతరమైన పాఠం పట్ల బుధవారం బోధనలో దృష్టి పెట్టాలని, శ్రద్ధ, అంకితభావంతో నేర్చుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలల్లోని తరగతి గదులు, వంటగది, విటమిన్ గార్డెన్ పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. భోజనం చేస్తున్న చిన్నారులతో మాట్లాడి భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రం సందర్శన: నగునూరు అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. అంగన్వాడీలో భోజనం చేస్తున్న చిన్నారులతో ముచ్చటించారు. పిల్లల హాజరు, నమోదు, గర్భిణీ, బాలింతల సంఖ్య వంటి వివరాలు అంగన్వాడి టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు వడ్డించిన భోజనాన్ని పరిశీలించారు. అంగన్వాడి పిల్లల హాజరు పెంచాలని ఆదేశించారు.పల్లె దవాఖాన సందర్శన: నగునూర్ పల్లె దవాఖాన,ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు, వైద్య పరీక్షల రిజిస్టర్ ను పరిశీలించారు. ఆరోగ్య మహిళ ఉచిత వైద్య సేవల పట్ల గ్రామస్తులందరికీ అవగాహన కల్పించి, నూరు శాతం మందికి ఆరోగ్య మహిళ పరీక్షలు చేయించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. , తహసిల్దార్ రాజేష్, ఎంఈఓ రవీందర్ ఉన్నారు.

# నల్గొండలో సై అంటున్న పార్టీలు



**నల్గొండ :** ఎప్పుడు వస్తాయని వేచి చుసిన స్థానిక సంస్థల ఎన్నికలు రానే వచ్చాయి. రిజర్వేషన్లను అధికారులు ఖరారు చేశారు. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేశారు. గ్రామాల్లో , పట్టణాల్లో ఎన్నికల సందడి మొదలైంది. గురువారం హైకోర్టు ఏం తీర్పు ఇవ్వబోతుందోందన్న ఆందోళన రాజకీయ నాయకుల్లో, ఆశావహుల్లో మొదలైంది. కొంతమందికి రిజర్వేషన్లు అనుకూలిస్తే మరి కొంతమందికి ఆశలుఅడియాశలయ్యాయి.దింతో రాజకీయ రణరంగం మొదలైంది. అధికార ప్రతిపక్ష పార్టీలకు దరఖాస్తుల విలువ మొదలైంది. ఒక ఎంపీటీసీ, జడ్పిటిసి పదవికి సుమారు పదిమంది ఆశావహులు దరఖాస్తులు చేసుకుంటున్నారు.అధికార ప్రతిపక్ష పార్టీలలో టికెట్ ఎవరికీ వస్తుందోఅని ఆందోళన వ్యక్తమవుతున్నాయి. ఎవరికివారు ప్రయత్నాలు, పైరవి లు మొదలుపెట్టారు. విడి,విడిగా గ్రామాలలో గుంపులు గుంపులుగా సమావేశాలు నిర్వహిస్తున్నారు.కులాల వారిగా మతాల వారీగా పార్టీల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం మొదలయ్యాయి. నేను పోటీలో ఉన్నానని సంకేతాలు ప్రజల్లోకి తీసుకు వెళుతున్నారు.ఆశాహహులుఖర్చు చేయడం మొదలుపెట్టారు.నేనున్నానంటే నేనున్నానంటూ పోటీ పడుతూ చాప కింద నీరులగా ఇంటింటికి ప్రచారం మొదలుపెట్టారు.. దరఖాస్తులతో అధికార ప్రతిపక్ష పార్టీలకు ఒక తలనొప్పి లాగా మారింది. ఒకరికి టికెట్ ఇస్తే మిగతావారని ఎలా బుజ్జగించాలో తెలియని పరిస్థితి.బుజ్జగింపులకు ఒప్పుకుంటారా లేక వ్యతిరేకంగా పనిచేస్తారా తెలియని ఆందోళన మొదలైంది.కొంతమంది టికెట్ దక్కపోతే ఇండిపెండెంట్ గా అయినా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని సంకేతాలు ఇస్తున్నారు. ఏది ఏమైనా ఈ స్థానిక సంస్థల్లో ఏం జరగబోతుందో అని వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. స్థానిక సంస్థల ఎన్ని కల కోసం సర్పంచి, ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లు ఖరారుయ్యాయి. నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు 12, సర్పంచి, ఎంపీటీసీ స్థానాలు 201 ఉన్నాయి. వీటిలో మొత్తం మహిళలకు 78 స్థానాలను రిజర్వు చేశారు. ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాల్లో ఐదు, సర్పంచి, ఎంపీటీసీ స్థానాల్లో 73 మహిళలకు దక్కాయి.

**మండలాల వారీగా ఎంపీటీసీ స్థానాలు..**

నకిరేకల్ మండలం 9స్థానాల్లో 4స్థానాలను మహిళలకు రిజర్వ్ కేటాయించారు. ఎస్సీ- 2, బీసీ- 4, జనరల్- 3 స్థానాలు ఉన్నాయి.

కేతపల్లి మండలం 11 స్థానాల్లో04స్థానాలను మహిళలకు రిజర్వ్ కేటాయించారు ఎస్సీ- 3, బీసీ- 5, జనరల్- 3 స్థానాలు ఉన్నాయి.

కట్టంగూర్ మండలం 13 స్థానాల్లో 6స్థానాలను మహిళలకు రిజర్వ్ కేటాయించారు. ఎస్సీ- 3, బిసి- 6, జనరల్- 4 స్థానాలు ఉన్నాయి.

నార్కట్‌పల్లి మండలం 15 స్థానాల్లో07స్థానాలనుమహిళలకు రిజర్వ్ కేటాయించారు ఎస్సీ- 03,బీసీ-06, జనరల్- 06 స్థానాలు ఉన్నాయి.

చిట్యాల మండలం 12 స్థానాలకు 5స్థానాలను మహిళలకురిజర్వ్ కేటాయించారు.ఎస్సి- 3, బిసి- 6, జనరల్ -6 స్థానాలు ఉన్నాయి.

రామన్నపేట మండలం 15 స్థానాలకు 3 మహిళా స్థానాలను రిజర్వ్ కేటాయించారు. ఎస్సీ- 3, బీసీ-6, జనరల్ -6 స్థానాలు ఉన్నాయి

సర్పంచి స్థానాల రిజర్వేషన్లు.

నకిరేకల్ మండలం 17స్థానాల్లో 8స్థానాలను మహిళలకు రిజర్వ్ కేటాయించారు. ఎస్సీ- 4, బీసీ- 3, జనరల్- 10 స్థానాలు ఉన్నాయి.

కేతపల్లి మండలం 16 స్థానాల్లో 7స్థానాలను మహిళలకు రిజర్వ్ కేటాయించారు ఎస్సీ- 4, బీసీ- 7 ,జనరల్- 5, స్థానాలు ఉన్నాయి.

కట్టంగూర్ మండలం 22 స్థానాల్లో 10 స్థానాలను మహిళలకు రిజర్వ్ కేటాయించారు. ఎస్సీ-05, బిసి-09, జనరల్ 8 స్థానాలు ఉన్నాయి.

నార్కట్ పల్లి మండలం 29 స్థానాల్లో14స్థానాలను మహిళలకు రిజర్వ్ కేటాయించారు ఎస్సీ- 7, బీసీ-12, జనరల్- 10స్థానాలు ఉన్నాయి.

చిట్యాల మండలం 18 స్థానాలకు 08స్థానాలను మహిళలకురిజర్వ్ కేటాయించారు.ఎస్సి-03, బిసి- 08, జనరల్ -07 స్థానాలు ఉన్నాయి.

రామన్నపేట మండలం 24 స్థానాలకు08 మహిళా స్థానాలను రిజర్వ్ కేటాయించారు. ఎస్సీ-05 ,బీసీ-10, జనరల్ -09 స్థానాలు ఉన్నాయి నియోజకవర్గంలో సర్పంచి స్థానాలు 126 ఉండగా మహిళలకు 39, బీసీలకు 49, ఎస్సీలకు 28, జనరల్ కేటగిరిలో 49 స్థానాలు రిజర్వు చేశారు. ఎంపీటీసీ స్థానాలు 75 గాను 34మహిళలకు కేటాయించారు. ఎస్సీలకు 16, బీసీలకు 32, జనరల్ కేటగిరిలో 27 స్థానాలకు రిజర్వు చేశారు. రిజర్వేషన్లు మారడంతో ఇంతకాలం ఆయా పదవులపై గంపెడాశలు పెట్టుకున్న నాయకులు నిరాశకు గురయ్యారు. రిజర్వేషన్ల ద్వారా కొత్త వారికి అవకాశాలు వస్తుండటంతో వారిలో ఆశలు పెరిగాయి. ప్రజలు ఎవరికి తీర్పు ఇవ్వనున్నరో వేచి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది

## మాగం గ్రామంలో రైతులకు డ్రోన్స్ పంపిణీ కార్యక్రమంలో

# పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ





**అయినవిల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలం మాగం గ్రామంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం-2024-25 కింద రైతులకు డ్రోన్ పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీ రామకృష్ణ డ్రోన్ సిహెచ్ గ్రూప్ కు రూ. 9,80,000/- విలువైన, డ్రోన్ అందజేయబడింది. ఇందులో ప్రభుత్వ సబ్సిడీ రూ. 7,82,000/- లభించింది. కార్యక్రమాన్ని పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ప్రారంభించి రైతులకు డ్రోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "డ్రోన్ టెక్నాలజీ వల్ల రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి సాధించగలరు. మన వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం చాలా అవసరం. ఇది రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుంది," అని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామకృష్ణ గ్రూప్ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు

## విద్యార్థులకు చేరువయ్యేలా

# బోధనా తీరు అలవర్చుకోవాలి

## డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషా



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాంశాల పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని,ఆ కారణంతోనే డీఎస్సీ 2025 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు ఇండక్షన్ ట్రైనింగ్‌ను ఏర్పాటు చేసినట్లు డిఇవో డాక్టర్ షేక్ సలీం బాషా తెలిపారు. రాజానగరం మండలం ఐఎస్‌టీఎస్ ఇంజనీరింగ్ కళాశాల, మల్లంపూడి గ్రామంలోని సాయిమాధవి ఇంజనీరింగ్ కళాశాల, కొండగుంటూరు గ్రామంలో ని సత్యసాయి పరిమళ పాలిటెక్నిక్ కళాశాలల్లో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణా శిబిరాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో డాక్టర్ సలీం బాషా మాట్లాడుతూ మెగా డీఎస్సీలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు వారి సబ్జెక్టుకు సంబంధించిన అంశాలతో పాటు, ఇతర సహ పాఠ్యాంశాలపై కూడా అవగాహన పెంచుకోవడం అవసరమన్నారు. విధుల్లో చేరిన అనంతరం విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు, ప్రభుత్వపరంగా అందిస్తున్న ప్రోత్సాహాల పై సైతం అవగాహన ఉండాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు చేరువయ్యే విధంగా బోధనా పద్ధతిని నేర్చుకోవాలని నూతన ఉపాధ్యాయులకు సూచిస్తూ, శిక్షణ జరుగుతున్న తీరును పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్‌ఎంను పరిశీలించి వారిని అభినందించారు. డీఈవో సలీం బాషా వెంట కోనసీమ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బి.హనుమంతరావు, ఏఎంవో పి.రాంబాబులు పాల్గొన్నారు.

## సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి నిరసనగా

# అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌పై మతోన్మాదుల దాడిని ఖండిస్తూ, బుధవారం రామచంద్రపురం అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాలు,దళిత నాయకుల ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పిల్లి మురళీ, రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు బి.సిద్ధూ,ఎం. రాము,వెంటపల్లి భీమశంకరం తదితరులు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం రాజ్యాంగ విలువలపై దాడి చేసినట్టే. దాడికి పాల్పడిన నిందితుడు రాకేష్ కిషోర్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి. అతనిని న్యాయవాద హోదా నుండి భర్తరఫ్ చేయాలని ప్రభుత్వంపై, బార్ కౌన్సిల్‌పై డిమాండ్ చేస్తున్నాం.ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలి అన్నారు. ధర్నాకు ముందుగా నేతలు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించి నివాళులు ఘటించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు దొమ్మలపాటి సత్యనారాయణ, దళిత నాయకులు వెంటపల్లి రామకృష్ణ, పైన సుధాకర్, మైనార్టీ నాయకులు జుల్ఫి, షఫీ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాజా రెడ్డి, అంబటి కృష్ణ వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# కోనసీమలో మరో భారీ అగ్నిప్రమాదం

బాణాసంచా కర్మాగారంలో భారీ విస్ఫోటనం..
ప్రమాదంలో ఆరుగురు మృతి .. నలుగురికి తీవ్ర గాయాలు ..
మృతులలో మహిళలు .. గుర్తుపట్టలేకుండా కాలిపోయిన మృతిదేహాలు..
వారం క్రితం తనిఖీలు.. అంతలోనే ప్రమాదం..
ఘటనా స్థలాన్ని పరిశీలించిన అధికారులు .. ప్రజా ప్రతినిధులు.

**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్**

దీపావళి వెలుగులను అందించే బాణాసంచా కార్మికుల జీవితాలలో చీకటి కమ్మేసింది. మెరిసే రంగుల టపాసులే వారి పాలిట యమ పాశాలుగా మారి మింగేసాయి. బాణాసంచా తయారీ షాపులను తరచూ అధికారుల తనిఖీల తో అప్రమత్తం చేస్తున్నప్పటికీ, చిన్నపాటి ఏమరుపాటు భారీ నష్టాన్ని మిగిల్చిన పరిస్థితి, మండల కేంద్రమైన రాయవరం శివారు లో గల శ్రీ గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ బాణాసంచా కర్మాగారంలో బుధవారం భారీ విస్ఫోటనం చోటుచేసుకుంది. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామానికి చెందిన వెలుగుబంట్ల సత్యనారాయణ మూర్తి (సత్తిబాబు) సుమారు నాలుగు దశాబ్దాల కాలం నుండి ప్రభుత్వం ద్వారా అన్ని విధాల అనుమతులు పొంది, శ్రీ గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ పేరుతో బాణాసంచా తయారీ కర్మాగారాన్ని నడుపుతూ, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు దీపావళి బాణసంచాను హోల్ సేల్ గా సరఫరా చేస్తూ ఉండగా, ఆ తయారీ కేంద్రంలో మూడు భాగాలుగా విభజించి ఒక చోట తయారీ కర్మాగారం, మరొక చోట స్టాక్ పాయింట్, మరొక చోట అమ్మకాలకు అనుకూలంగా విభజించగా, మండల, జిల్లా స్థాయి అధికారులు సుమారుగా ప్రతి రెండు నెలలకు ఒకసారి ఆ షాపులలో తనిఖీలు నిర్వహించి లైసెన్స్, కార్మికుల వివరాలు, భద్రతా పరిస్థితులను పరిశీలించి, పలు సూచనలు చేయడం పరిపాటి, కాగా ఆ సూచనలలో భాగంగానే గత సంవత్సరం బాణాసంచా తయారీ కర్మాగారం వద్ద వాటర్ ట్యాంక్, వాటర్ పైప్ లైన్లు వంటి ఏర్పాట్లు అధికారులు పరిశీలించి అనుమతులను మంజూరు చేయగా ఏ ఆటంకం లేకుండానే సత్యనారాయణ మూర్తి (సత్తిబాబు) బాణాసంచా తయారీ కర్మాగారం నడుపుతున్నారు. కాగా దీపావళి దగ్గర పడుతున్న సమయంలో తమ వద్ద పనిచేసే కార్మికులతో పాటు అదనంగా మరికొంత మంది కార్మికులను బాణాసంచా తయారీకి ఏర్పాటు చేసి డిమాండ్ ను బట్టి ఉత్పత్తి చేస్తూ బాణాసంచా కర్మాగారాన్ని నడుపుతుండగా..

ఎప్పటిలానే అక్టోబర్ 08 బుధవారం తమ బాణాసంచా తయారీ కర్మాగారంలో కార్మికులతో సత్యనారాయణ మూర్తి పనిచేయిస్తూ ఉండగా విద్యుతాఘాతం జరిగి, బాణాసంచా కర్మాగారంలో భారీ అగ్నిప్రమాదం సంభవించగా, భారీ ఎత్తున విస్ఫోటనం జరిగి, పెద్ద ఎత్తున ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో మంటలలో చిక్కుకుని ఆరు మృత్యువాత పడ్డారు. గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ నిర్వహకుడైన సత్యనారాయణ మూర్తి (65) సైతం మంటల్లో చిక్కుకున్న కార్మికులను రక్షించే ప్రయత్నంలో సజీవ దహనమయ్యారు. ఈ ప్రమాదంలో తూర్పుగోదావరి జిల్లా అనపర్తి గ్రామానికి చెందిన చిట్టూరి శ్యామల (38), అనపర్తి సావరం గ్రామానికి చెందిన కుడుపూడి జ్యోతి (38), పెంకే శేషారత్నం(40), రాయవరం మండలం, సోమేశ్వరం గ్రామానికి చెందిన పాకా అరుణ (35), ఒరిస్సాకు చెందిన సదానంద్ కుంబర్ (45) లు మృతిచెందగా ఘటనా స్థలానికి చేరుకున్న స్థానికులు లింగం చినబాబు,వాసంశెట్టి విజయలక్ష్మి, చిట్టూరి యామిని లను వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పొట్నూరి వెంకటరమణ ను కాకినాడ లోని ట్రస్ట్ హాస్పిటల్ కు తరలించారు. కాగా బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు జరిగిన సమయంలో అందులో 40 మంది వరకూ పనిచేస్తున్నట్లు సమాచారం. ప్రమాదం సంభవించిన సమయం భోజన విరామ సమయం కావడంతో మృతుల సంఖ్య కాస్త తగ్గిందని చెప్పుకోవచ్చు. ప్రమాదంలో విస్ఫోటనం జరగటం వలన కొద్దిపాటి దూరంలో ఉన్న స్టాక్ పాయింట్ షెడ్డు పై నిప్పులు ఎగిరి పడడంతో అక్కడ కూడా మంటలు చెలరేగడంతో మూగజీవాలు సైతం మంటల ధాటికి కాలిపోవడం హృదయాన్ని కలిచివేయగా స్థానికులు చొరవ చేసి వాటిని కాపాడారు. ప్రమాద వార్త తెలియగానే రామచంద్రపురం ఆర్డీవో అఖిల, తూర్పుగోదావరి జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్.బి.ఎన్ మురళీకృష్ణ, అమలాపురం డి ఎస్పీ డి.ఎస్.ఆర్.కె ప్రసాద్, రామచంద్రపురం డిఎస్పీ రఘువీర్, మండపేట రూరల్ సీఐ పి. దొర రాజు, టౌన్ సిఐ సురేష్, రాయవరం తహశీల్దారు భాస్కర్, రాయవరం,అంగర, మండపేట రూరల్ ఎస్సై లు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు.

## సంఘటనపై విచారణ జరిపించి
## అధికారుల నిర్లక్ష్యం ఉంటే తగు చర్యలు తీసుకుంటాం: మంత్రి సుభాష్.



రాయవరం మండలం కొమరిపాలెంలో బుధవారం బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన ఘోర ప్రమాదంలో మరణించిన కుటుంబాలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పరామర్శించారు. అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగే ఎస్ఐపిబి సమావేశానికి హాజరైన మంత్రి ఈ విచారకర సంఘటన విషయం తెలియగానే హుటాహుటిన బయలుదేరి రాయవరం చేరుకున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. తొలుత ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ తో చరవాణి ద్వారా మాట్లాడి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ బాణాసంచా పేలుడు సంఘటనలో ఏరుగురు మరణించడం తనను తీవ్రంగా కలచివేసింది అన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందేలా చూడాలని కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. బాణాసంచా తయారీ కర్మాగారాలు కనీస ప్రమాణాలు పాటించాలన్నారు. భద్రత విషయంలో రాజీ పడకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ సంఘటనపై విచారణ జరిపించి అధికారుల నిర్లక్ష్యం ఉంటే తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. మంత్రినాయకులు సుభాష్ వెంట రామచంద్రపురం ఆర్డీవో అఖిల, డి.ఎస్.పి రఘువీర్, అగ్నిమాపక సిబ్బంది, కూటమి పార్టీ ఉండవిల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

## ఆరుగురు మరణించడం బాధాకరం: హోంశాఖ మంత్రి వంగలపూడి



కొమరిపాలెం శివారు వి. సావరం లో శ్రీ గణపతి ఫైర్ వర్క్స్ కేంద్రంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో ఆరు గురు మృతి చెందడం బాధాకరమని రాష్ట్ర హోంశాఖ మాత్యులు వంగలపూడి అనిత అన్నా రు ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ కోనసీమ జిల్లా బాణసంచా తయారీ కేంద్రానికి వచ్చే ఏడాది వరకు అనుమతి ఉందని ఇలాంటి ప్రమా దాలు జరగకుండా చర్యలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటా మని తెలిపారు విద్యుదాఘాతం వల్లే ప్రమాదం జరిగిందని బాధితులు చెప్పడం జరిగిం దన్నారు మృతుల కుటుం బాలకు అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు మృతుల కుటుంబాలకు త్వరలో పరిహారం ప్రకటిస్తామ న్నారు బాణసంచా తయారీ కేంద్రాలు, దుకాణాలు ముందస్తు జాగ్రత్త నిబం ధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు బాణ సంచా తయారుచేసే కార్మికులకు బీమా కల్పిం చేలా చూస్తామన్నారు బాణసంచా తయారీ కేంద్రాలు, దుకాణాలు తనిఖీ చేయాలని అధికా రులను ఆదేశించడం జరిగిందన్నారు అయిన ప్పటికీ దురదృష్టవశాత్తు ఇటువంటి సంఘటనలు జరగడం బాధాక రమన్నారు ఆమె తొలుతగా కోనసీమ జిల్లా రాయవరం మండలం కొమరిపాలెం శివారు వి సావరం ప్రమాద స్థలాన్ని పరిశీలించిన గణపతి గ్రాండ్ ఫైర్వర్క్స్ తయారీ కేంద్రం పరిశీలించిన అనిత సహాయ చర్యలు, ఇతర వివరాలు తెలుసుకున్నారు.బాణా సంచా తయారీ కేంద్రంలో పేలుడు సంఘటన తెలిసిన వెంటనే ఆమె హుటాహుటిన ప్రమాద సంఘటన స్థలాన్ని చేరు కొని సంఘటన కు గల కారణాలను పరిస్థితిని స్థానిక అధికారుల ద్వారా వివరాలు అడిగి తెలుసు కున్నారు లింగం చిన్న బాబు, వాసంశెట్టి విజయలక్ష్మి, చిట్టూరి యామిని అనే క్షతగాత్రు లను కాకినాడ జిజిహెచ్కు మెరుగైన వైద్య సేవల నిమిత్తం తరలిం చారు. ఉన్న ఆసుపత్రులకు తరలించడం జరిగింది. బాధిత కుటుంబాలకు కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆమె తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిం చాలని ఆదేశించడం జరిగిందన్నారు. మృతుల కుటుంబాలకు మంత్రి సానుభూతిని తెలిపారు. విద్యుత్ ఘాతంతో జరిగిన ఈ దురదృష్టకర సంఘ టనలో ఆరుగురు కార్మికు లు సజీవ దహనం కావడం బాధాకర మన్నారు. గాయ పడిన వారు త్వరగా కోలు కోవాలని ఆమె భగవంతుని ప్రార్థించారు. బాధిత కుటుం బాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని భరోసాను ఇచ్చారు.

## మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ విచారం వ్యక్తం



రాయవరం అగ్ని ప్రమాద ఘటనపై రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. ప్రమాద ఘటన తెలిసిన వెంటనే హుటాహుటిన రాయవరం వెళ్లిన ఆయన అక్కడ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన వారిని కాకినాడ తరలించి అక్కడ వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఆయన మీడియా తో మాట్లాడుతూ ఘటనపై పూర్తి విచారణ చేపట్టి కారకులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సృష్టికి విషయాన్ని తీసుకువెళ్ళడం జరిగిందని, మృతి చెందిన వారి కుటుంబాలకు సైతం ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.

## పక్కనే ఫుల్లుగా రాకెట్స్ ఫుల్ ఉండడం వల్ల .. స్పార్క్స్ వచ్చి ప్రమాదం జరిగింది
## జి. వి జి అశోక్ కుమార్, ఏలూరు రేంజ్ ఐజి



తయారుచేసిన బాణాసంచా పక్కనే ఉండడం వలన స్పార్క్స్ వాటికి తగిలి మంటలు చెలరేగాయి. అప్పటికే వాటర్ స్ప్రింకిల్ సిస్టం ఆక్టివేట్ అయినప్పటికీ తీవ్రతను అది ఆపలేకపోయింది. వారం క్రితమే సీఐ, ఎస్సైలు సందర్శించి పరిశీలించారు. ఇది ఊహించని ప్రమాదం. పేలుడు పదార్థాలు అన్ని వైపుల వ్యాపించి ప్రమాద తీవ్రత మరింత పెంచాయి. క్షతగాత్రులు కోలుకున్న తర్వాత విషయంపై పూర్తి స్థాయిలో సమాచారం తెలియజేస్తామని ఆయన అన్నారు. ఈ బాణసంచా కేంద్రానికి మార్చి 2026 వరకు అనుమతి వుందని అన్నారు. ఘటన జరిగిన సమయంలో సుమారుగా 12 మంది కార్మికులు పనిచేస్తున్నారు. చిచ్చుబుడ్లు నింపుతున్న సమయంలో ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చాము. ఘటన జరిగిన ప్రాంతంలో ఎక్కువగా రాకెట్స్ ఉండడం వలన స్పార్క్ వచ్చి అగ్నికీలను అన్ని వైపులకు ఎగిసిపడి ప్రమాదం సంభవించింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకుంటామని, యంత్రాంగమంతా సమావేశమై ఇలాంటి కర్మకారాలపై మరింత జాగ్రత్త తీసుకునేలా చర్యలు తీసుకుంటామని ఐజి అశోక్ కుమార్ తెలిపారు.

## భారత్‌కు బ్రిటన్ ప్రధాని స్టార్మర్

న్యూఢిల్లీ

భారత్, యూకే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చల కోసం బ్రిటన్ ప్రధాని స్టార్మర్ బుధవారం ముంబైకి చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం 125 మంది వాణిజ్య, విద్య, సంస్కృతిక రంగాల ప్రముఖులతో కూడిన భారీ బృందంతో వచ్చారు. భారత్, యూకే మధ్య ఇటీవల స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో.. వివిధ రంగాల సంస్థలతో వాణిజ్య భాగస్వామ్యాలపై స్టార్మర్ బృందం చర్చలు జరపనుంది. అలాగే ప్రధాని మోదీతో స్టార్మర్ భేటీ కానున్నారు. బుధవారం స్టార్మర్ బృందం ముంబైలో ప్రముఖ బాలీవుడ్ సినీ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిల్మ్స్ స్టూడియోను సందర్శించింది. యూకే సంస్థలతో ఉమ్మడిగా సినిమాల నిర్మాణంపై, యూకేలో షూటింగ్‌లపై పలు నిర్మాణ సంస్థల ప్రతినిధులతో చర్చించింది. అనంతరం స్టార్మర్ ఒక ప్రకటన విడుదల చేశారు. బ్రిటన్‌కు బాలీవుడ్ వస్తుందని, సినిమాల నిర్మాణం చేస్తుందని పేర్కొన్నారు. మరోవైపు వచ్చే ఏడాది మొదట్లో బ్రిటన్‌లోని లొకేషన్లలో తమ సినిమాల షూటింగ్‌లు నిర్వహించనున్నట్టు యశ్‌రాజ్ సంస్థ ప్రకటించింది. గురువారం మహారాష్ట్ర రాజ్‌భవన్‌లో ప్రధాని మోదీతో స్టార్మర్ భేటీకానున్నారు. భారత్-యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ)తో ఇరుదేశాలకు సమకూరే ప్రయోజనాలు.. ప్రపంచ వాణిజ్యం, కొత్త సాంకేతికతలు, రక్షణ, పర్యావరణ పరిరక్షణ అంశాలతోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై వారు చర్చించనున్నారు. కాగా, బుధవారం కీర్ స్టార్మర్ రాకను స్వాగతిస్తూ ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

## ప్రకృతి వైపరీత్యాల వేళ ఎస్ఐఆర్ ఎలా సాధ్యం?

కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన వ్యవహారశైలి ప్రధాని తరహాలో ఉందని వ్యాఖ్యానించారు. ఉత్తర బెంగాల్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం కోల్‌కతా ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడిన ఆమె.. ప్రకృతి వైపరీత్యాల వేళ ఓటరు జాబితా సవరణ సాధ్యం కాదన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా తీరుపై దీదీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. "ఎన్నికలు జరగాల్సిన రాష్ట్రాల్లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టాలని ఎన్నికల కమిషన్‌పై భాజపా అగ్రనాయకత్వం ఒత్తిడి తెస్తోంది. ఆ పార్టీ నేతలు ఇక్కడకు వచ్చి సమావేశాలు పెడుతున్నారు. రాష్ట్రంలో ఓటరు జాబితా నుంచి లక్షలాది పేర్లను తొలగిస్తామని చెబుతున్నారు. పండగల వేళ ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాలతో రాష్ట్రం సతమతమవుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో పక్షం రోజుల్లో ఎస్ఐఆర్ పూర్తి చేసి, కొత్త పేర్లను చేర్చగలరా?" అని మమతా బెనర్జీ ప్రశ్నించారు. ఈ వ్యవహారమంతా అమిత్ షా చేతుల్లో నడుస్తోందని.. దేశానికి తాత్కాలిక ప్రధాని అన్న రీతిలో ఆయన వ్యవహారం ఉందని ఆరోపించారు.

## బాల్యం 'కిడ్నాప్' అవుతోంది

దేశంలో చిన్నారులపై నేరాలు ప్రతి ఏటా పెరుగుతూనే ఉన్నాయిగానీ తగ్గడం లేదు. 2021లో 1.49 లక్షల నుంచి 2022లో 1.62 లక్షలకు, 2023లో 1,77,335కి పెరిగాయి. 2023లో మొత్తం బాధితుల సంఖ్య 1,86,521. 28 రాష్ట్రాల్లో.. 10వేలకుపైగా బాధితులు ఉన్న రాష్ట్రాలు 6 ఉండటం గమనా ర్హం. మొత్తం కేసుల్లో కిడ్నాపులు / అపహరణలే అత్యధికం కావడం ఆందోళనకరం. తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణలో 2022తో పోలిస్తే కేసులు పెరగ్గా, ఆంధ్రప్రదేశ్‌లో తగ్గాయి. అత్యధిక నేరాలు జరిగిన టాప్ %-%15 రాష్ట్రాల జాబితాలో కూడా ఏపీ లేకపోవడం గమనార్హం.

## భారత్‌తో యుద్ధం జరిగే అవకాశం

**ఈసారి మాకే అనుకూలం: పాకిస్థాన్ రక్షణ మంత్రి**

న్యూఢిల్లీ : భారత్‌తో యుద్ధం జరిగే అవకాశాలను కొట్టిపారేయలేమని, ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే తమకు అనుకూల ఫలితాలు ఉంటాయని పాకిస్థాన్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ పేర్కొన్నారు. అయితే, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తాను కోరుకోవడం లేదని ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలిపారు.ముప్పు పొంచివున్న మాట వాస్తవమని ఆయన అన్నారు. ఒకవేళ యుద్ధం జరిగితే గతంలో కంటే మెరుగైన ఫలితాలు పాకిస్థాన్ సాధిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌లో ప్రజలంతా ఒకరితో ఒకరు వాదించుకున్నా, విభేదాలు ఉన్నా భారత్‌తో యుద్ధం వస్తే మాత్రం ఐక్యంగా ఉంటామని ఆయన అన్నారు. చరిత్రను పరిశీలిస్తే భారత్ ఎప్పుడూ ఒకే దేశంగా లేదని ఆయన అభిప్రాయపడ్డారు.సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌ను భారత ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది ఇటీవల హెచ్చరించారు. భారత్ పూర్తిగా సన్నద్ధంగా ఉందని, ఆపరేషన్ సిందూర్ సమయంలో మాదిరి సహనం ఈసారి ప్రదర్శించబోమని ఆయన స్పష్టం చేశారు. పాకిస్థాన్ ప్రపంచ పటంలో నిలబడాలంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపి తీరాలని, లేదంటే ఆ దేశాన్ని చరిత్ర నుంచి తుడిచి పెట్టవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలకు పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ పైవిధంగా ప్రతిస్పందించారు.

## మోత మ్రోగిస్తున్న దీవాళి, వెండి

ముంబై : ఖరీదైన లోహాల గురించి ప్రస్తావన వస్తే ముందు వరుసలో ఉంటుంది బంగారం. పైగా ఇటీవల కాలంలో బంగారం ధర అంతకుమించి అనే స్థాయిలో పెరిగిపోతుంది. ఇది ఎక్కడదాకా వెళ్తుందో తెలియడం లేదు కానీ.. ప్రస్తుతానికి అయితే ధర తారాజువ్వలాగా ఆకాశంలో ప్రయాణం చేస్తోంది. ఒకప్పుడు తులం బంగారం ధర 50 నుంచి 60 వేల మధ్యలో ఉండేది. కానీ ఈ ఏడాది మాత్రం ఏకంగా 1,20,000 మార్కును దాటిపోయింది. లక్ష రూపాయలకు తులం అంటేనే చాలామంది నోర్లు వెళ్లబెట్టారు. కానీ ఇప్పుడు లక్ష 50 వేల వరకు వెళ్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరికొందరేమో ధర తగ్గుతుందని పేర్కొంటున్నారు. ఈ ఊగిసలాట మధ్య మరో చర్చ కూడా మొదలైంది.బంగారమే అత్యంత ఖరీదైన లోహం అనుకుంటే.. ఇప్పుడు దానిని మించిపోయేలా ఉంది వెండి. ఒకప్పుడు వెండికి అంతగా డిమాండ్ గా ఉండేది కాదు. కిలో ధర మహా అయితే 20 నుంచి 40 వేల మధ్యలో ఉండేది. కానీ ఇప్పుడు రెండు కిలో ధర లక్ష రూపాయలను మించిపోయింది. అంతేకాదు ధరలో బంగారంతో పోటీపడుతోంది. గడిచిన ఏడాదిలోనే వెండి ధర ఏకంగా 54 శాతం పెరిగింది. పారిశ్రామిక రంగంలో వెండిని విపరీతంగా వినియోగిస్తున్నారు. సోలార్ ప్యానల్స్, ఎలక్ట్రానిక్స్ రంగాలలో వెండికి విపరీతమైన డిమాండ్ ఉంది. ఇది ఇలాగే ఉంటే వెండి కిలో ధర 2 లక్షలకు చేరుకుంటుందని, వచ్చే ఐదేళ్లలో మూడు లక్షల బాగా వెళుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇన్వెస్టర్లు కూడా బంగారం పై కంటే వెండి మీద ఎక్కువ పెట్టుబడి పెడుతున్నట్టు తెలుస్తోంది.ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా సౌర విద్యుత్ వినియోగం పెరిగిపోయింది. సౌర విద్యుత్ తయారీలో వెండి కి విపరీతమైన ప్రాధాన్యం ఉంటుంది. అందువల్లే వెండిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్యానెల్స్ నిర్మాణంలో వెండికి ప్రాధాన్యం ఇస్తున్నారు. అందువల్లే వెండి ధర విపరీతంగా పెరుగుతుంది. వచ్చే మూడు సంవత్సరాలలో బంగారానికి డిమాండ్ తగ్గిపోతుందని.. ఇదే సమయంలో వెండికి గిరాకీ పెరుగుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.. "ఒకప్పుడు వెండికి అంతగా గిరాకీ ఉండేది కాదు. పారిశ్రామిక అవసరాలు పెరిగిపోయాయి. సౌర విద్యుత్ ఫలకాల తయారీలో వెండి వినియోగం ఎక్కువైంది. అందువల్లే ఈ లోహానికి డిమాండ్ పెరిగింది. భవిష్యత్తు కాలంలో ధర మరింత ఎక్కువయ్యే అవకాశం ఉందని" నిపుణులు పేర్కొంటున్నారు.

# 'అమెరికా' ఒత్తిళ్లకు తలొగ్గామని మీరే అన్నారు కదా?

నవీ ముంబై: 2008 ముంబైలో జరిగిన విధ్వంసకర ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్‌పై యుద్ధానికి దిగాలనే ఆలోచన ఉన్నప్పటికీ, అమెరికా ఒత్తిడి వల్ల దాన్ని విరమించుకున్నామని కాంగ్రెస్ సీనియర్ నేత పి చిదంబరం ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అంతర్జాతీయ ఒత్తిళ్లకు తలొగ్గి పాకిస్తాన్‌పై యుద్ధాన్ని విరమించుకున్నది మీరు కాదా? అంటూ చిదంబరం చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి పరోక్షంగా విమర్శలు గుప్పించారు మోదీ. నవీ ముంబైలో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి బుధవారం(అక్టోబర్ 8) హాజరైన ప్రధాని మోదీ.. కాంగ్రెస్‌పై మండిపడ్డారు. ఇక్కడ ఎవరి పేరు ప్రస్తావన తేకుండానే కాంగ్రెస్ తీరును తూర్పారబట్టారు. ' 2008లో దేశ వాణిజ్య రాజధాని ముంబైపై ఉగ్రవాదులు భీకర దాడికి దిగితే కాంగ్రెస్ ఏం చేసింది?. వారి బలహీనతను నిరూపించుకుంది. టెర్రరిజం ముందు మోకరిల్లింది' ఇదే విషయాన్ని ఓ సీనియర్ కాంగ్రెస్ నాయకుడే చెప్పారు' అంటూ విమర్శలు గుప్పించారు, '26/11 అనేది దేశంపై జరిగిన అత్యంత



జుగుప్సాకరమైన ఉగ్రదాడి. ఈ దాడి ప్రతీ ఒక్కరికీ తెలుసు. అయినా ఆ దాడికి పాల్పడిన వారిపై ప్రతీకారం తీర్చుకోలేదు. ఆ సమయంలో హోంమంత్రిగా ఉన్న ఓ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఈ విషయాన్ని చెప్పారు. మన దేశానికి మరొక దేశం యుద్ధం వద్దని హితబోధ చేయడంతో పాక్‌తో యుద్ధానికి బలగాల్ని పంపలేదంట. ఇది కదా వేరే దేశ ఒత్తిడికి లొంగడమంటే?' అని మోదీ ప్రశ్నల వర్షం కురిపించారు. కాగా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా ఈ ఏడాది జూలై నెలలో చిదంబరం మాట్లాడుతూ.. 2008లో అంతటి ఉగ్రదాడి జరిగిన దానికి కారణమైన పాకిస్తాన్‌తో యుద్ధాన్ని ఎందుకు వద్దనుకున్నారో చెప్పారు. తాను హోంమంత్రిగా ఉన్న ఆ సమయంలో అమెరికా ఒత్తిడి కారణంగానే దేశంలో అంతటి విధ్వంసాన్ని ఉగ్రవాదులు సృష్టించినా పాక్‌పై యుద్ధాన్ని వద్దనుకున్నామన్నారు ఓ కాంగ్రెస్ నేత.

ఇది ఇప్పుడు బీజేపీకి ఆయుధంగా మారింది. చిదంబరం చేసిన వ్యాఖ్యలను సమయం వచ్చినప్పుడల్లా బీజేపీ ఎండగడుతూనే ఉంది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం.. పాకిస్తాన్‌కు అనుకూలంగా వ్యవహరించదనేది చిదంబరం వ్యాఖ్యలతో నిరూపితమైందని బీజేపీ విమర్శలు గుప్పిస్తోంది. తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ సైతం.. మూడు నెలల క్రితం చిదంబరం వ్యాఖ్యలను లేవనెత్తుతూ కాంగ్రెస్ వైఖరిపై ధ్వజమెత్తారు.

# రసాయనశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

న్యూఢిల్లీ : ఎడారి గాలి నుంచి స్వచ్ఛమైన నీటిని సేకరించడం, వాతావరణంలోని హానికర కర్బన ఉద్గారాలను బంధించడం వంటి అసాధారణ పనులకు వీలు కల్పించే వినూత్న ఆవిష్కరణకు ఈ ఏడాది రసాయన శాస్త్రంలో అత్యున్నత పురస్కారం లభించింది. 2025 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతిని ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. జపాన్‌కు చెందిన సుసుము కిటగావా, ఆస్ట్రేలియాకు చెందిన రిచర్డ్ రాబ్సన్, అమెరికాకు చెందిన ఒమర్ ఎం. యాఘీలను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ బుధవారం ప్రకటించింది.'మెటల్-ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్' (ఓఈఈబ)గా పిలిచే ప్రత్యేకమైన అణు నిర్మాణాలను అభివృద్ధి చేసినందుకు గాను వారికి ఈ గౌరవం దక్కింది. ఈ శాస్త్రవేత్తలు లోహ అయాన్లను (మూలస్తంభాలుగా), పొడవైన కర్బన అణువులతో (సంధానకర్తలుగా) కలిపి సూక్ష్మస్థాయిలో ఖాళీలతో కూడిన స్ఫటికాలను రూపొందించారు. ఈ ఖాళీలు వాయువులు, ఇతర రసాయనాలను నిల్వ చేయడానికి లేదా రసాయనిక చర్యలు జరపడానికి గదుల్లా పనిచేస్తాయి. వీటిని ఉపయోగించి పర్యావరణంలోని విషవాయువులను నిల్వ చేయడం, నీటిలోని హానికర రసాయనాలను వేరుచేయడం, ఫార్మా వ్యర్థాలను విచ్ఛిన్నం చేయడం వంటి ఎన్నో క్లిష్టమైన సమస్యలకు పరిష్కారాలు కనుగొనవచ్చు.ఈ రంగంలో 1989లో రిచర్డ్ రాబ్సన్ తొలి అడుగులు వేయగా, ఆ తర్వాత సుసుము కిటగావా, ఒమర్ యాఘీ తమ పరిశోధనలతో దీనిని మరింత ముందుకు తీసుకెళ్లారు. కిటగావా ఈ నిర్మాణాల్లోకి వాయువులు స్వేచ్ఛగా ప్రవహిస్తాయని నిరూపించగా, యాఘీ అత్యంత స్థిరమైన ఓఈఊలను సృష్టించి, వాటిని మనకు కావాల్సిన విధంగా మార్చుకునే పద్ధతిని ఆవిష్కరించారు. వీరి కృషి ఫలితంగా ఇప్పటివరకు పదివేల రకాలకు పైగా ఓఈఊలు రూపుదిద్దుకున్నా యి."మెటల్-ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. మనకు అవసరమైన సరికొత్త ప్రయోజనాలతో పదార్థాలను రూపొందించుకోవడానికి ఇవి ఊహించని అవకాశాలను అందిస్తున్నాయి" అని నోబెల్ కమిటీ




చైర్మన్ హైనర్ లింకే ఈ సందర్భంగా ప్రశంసించారు.

మా కంపెనీలో ఐదుగురు నోబెల్ గ్రహీతలున్నారన్న పిచాయ్

2025 సంవత్సరానికి గాను భౌతికశాస్త్రంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతిని గెలుచుకున్న శాస్త్రవేత్తలు జాన్ మార్టినిస్, మైఖేల్ డేవొరే, జాన్ క్లార్క్‌లను గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అభినందించారు. ఈ విజేతల్లో ఇద్దరు గూగుల్‌కు చెందిన క్వాంటం ఏఐ ల్యాబ్‌తో కలిసి పనిచేసిన వారని ఆయన గుర్తుచేసుకున్నారు. క్వాంటం మెకానిక్స్ రంగంలో వారు చేసిన అద్భుతమైన ఆవిష్కరణలకు ఈ పురస్కారం దక్కింది.ఈ సందర్భంగా సుందర్ పిచాయ్ 'ఎక్స్' వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. "మైఖేల్ డేవొరే, జాన్ మార్టినిస్, జాన్ క్లార్క్‌లకు నోబెల్ బహుమతి గెలుచుకున్నం దుకు అభినందనలు. మైఖేల్ మా క్వాంటం ఏఐ ల్యాబ్‌లో చీఫ్ సైంటిస్ట్ ఆఫ్ హార్డ్‌వేర్ కాగా, జాన్ మార్టినిస్ చాలా ఏళ్లు హార్డ్‌వేర్ టీమ్‌కు నాయకత్వం వహించారు" అని పిచాయ్ తన పోస్టులో పేర్కొన్నారు. 1980వ దశకంలోనే వీరు క్వాంటం మెకానిక్స్‌లో ప్రాథమిక పరిశోధనలకు పునాదులు వేశారని ఆయన ప్రశంసించారు.ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లో స్థూల క్వాంటం మెకానికల్ టన్నెలింగ్, ఎనర్జీ క్వాంటైజేషన్‌ను కనుగొన్నందుకు గాను రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఈ ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ బహుమతిని ప్రకటించింది. 1984-85 మధ్యకాలంలో వీరు సూపర్ కండక్టర్లతో కూడిన ఒక ఎలక్ట్రానిక్ సర్క్యూట్‌పై కీలక ప్రయోగాలు చేశారు.తాను ఇటీవలే శాంటా బార్బరాలోని గూగుల్ క్వాంటం ల్యాబ్‌ను సందర్శించానని, అక్కడ జరుగుతున్న పురోగతిని చూసి ఆశ్చర్యపోయానని పిచాయ్ తెలిపారు. గూగుల్ సంస్థలో ఇప్పటివరకు ఐదుగురు నోబెల్ బహుమతి గ్రహీతలు ఉండటం గర్వంగా ఉందని, కేవలం రెండేళ్లలోనే మూడు నోబెల్ బహుమతులు తమ సంస్థతో సంబంధం ఉన్నవారికి రావడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు.ప్రస్తుతం మైఖేల్ డేవొరే గూగుల్ క్వాంటం ఏఐ ల్యాబ్‌లో చీఫ్ సైంటిస్ట్‌గా పనిచేస్తుండగా, యేల్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా కూడా ఉన్నారు. జాన్ మార్టినిస్ 2020లో గూగుల్ నుంచి వైదొలగి, 2022లో సొంతంగా క్వాంటం కంప్యూటింగ్ స్టార్టప్‌ను ప్రారంభించారు.

# ఎన్డీఏకు అనుకూలంగా పరిస్థితులు

పాట్నా : బిహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. రెండు విడతల్లో పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయిం చింది. ఈ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు తీసుకొచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి నీతీష్ కుమార్ పాలసీలు, కుల ఓటు బ్యాంకులు, తటస్థ ఓటర్ల ప్రవృత్తి ఈ ఎన్నికల్లో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయి. గత సర్వేల్లో మహాఘట్‌బంధన్‌కు విజయావకాశం ఉన్నట్లు ఒపీనియన్ పోల్స్ వచ్చినా.. ఇటీవలి మార్పులు ఎన్‌డీఏకు అనుకూలంగా మారుతున్నాయి.బిహార్‌లో నవంబర్ 6న మొదటి దశలో 18 జిల్లాల్లోని 108 స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. ఇందులో ఉత్తర, మధ్య, పశ్చిమ, దక్షిణ బిహార్‌లోని కొన్ని ముఖ్య నియోజకవర్గాలు చేరుతాయి. దర్భంగా, ఆరా, బిహార్‌షరీఫ్, నలంద, బక్సర్, చాప్రా, పట్నా వంటి ప్రాంతాలు ఇక్కడ భాగస్వామి. ఈ జిల్లాలు బీజేపీ, జేడీయూ కలిసి బలమైన పట్టు కలిగిన ప్రదేశాలుగా పరిగణించబడతాయి. రెండో దశలో, నవంబర్ 11న 20 జిల్లాల్లోని 120 స్థానాలకు ఓటింగ్ జరుగుతుంది. రక్సాల్, సుపౌల్, కటిహార్, కిషన్‌గంజ్, పూర్ణియా వంటి సరిహద్దు జిల్లాలు ఇక్కడ ప్రధానంగా ఉంటాయి, ఇవి ముస్లిం జనాభా ఆధిక్యత కలిగిన ప్రాంతాలు. మొత్తంగా రెండు విడతల్లో 7.42 కోట్ల మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొంటారు. ఈ విభజన ప్రథమ దశలో ఎన్‌డీఏకు అనుకూలంగా, రెండో దశలో మహాఘట్‌బంధన్‌కు అవకాశాలు కల్పిస్తుందని విశ్లేషకులు అంచనా.బిహార్‌లో రెండు కూటములు ప్రధానంగా ఉన్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్‌డీఏ (బీజేపీ?జేడీయూ), ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ (ఆర్‌జేడీ?కాంగ్రెస్). ఈ కూటముల మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని అంచనా. ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక, సీటు పంపిణీలో చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఈ



కసరత్తు కూటముల మధ్య సమతుల్యతను పరీక్షిస్తుంది. ఎల్‌జేపీ విభజన, ఈ ప్రక్రియను మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. ఫలితంగా, చిన్న పార్టీలు ఓట్లను చీల్చే అవకాశం పెరిగింది.ప్రీ పోల్ సర్వేలు ఎన్‌డీఏ, మహాఘట్‌బంధన్ మధ్య సమాన పోటీని సూచించాయి, అయితే మహాఘట్‌బంధన్‌కు స్వల్ప ఆధిక్యం (52%) ఎన్డీఏకు (38%) ఉందని ఒపీనియన్ పోల్స్ చెప్పాయి. కానీ సెప్టెంబర్ నుంచి పరిస్థితి మారింది. నీతీష్ కుమార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ముఖ్యంగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) వ్యవస్థ, ఓటర్ల మనసులను ఆకర్షించాయి. మహిళల ఖాతాల్లో ఆగస్టు?సెప్టెంబర్‌లో బదిలీలు సమయానికి చేయబడటం, యువతకు రూ.10 వేల సహాయ పథకం ప్రారంభం వంటివి ఈ మార్పుకు మూలం. నీతీష్‌కు రాష్ట్రవ్యాప్తంగా భావోద్వేగ సానుభూతి ఉండటం వల్ల, కూటమి మార్పులు జరిగినా ఆయన ప్రభావం కొనసాగుతోంది. ఇది ఎన్‌డీఏకు మొత్తం బలాన్ని పెంచుతూ, పోటీని ఒక్కసారిగా మలుపు తిప్పుతోంది.బిహార్ ఎన్నికలు కుల ఆధారిత ఓటు బ్యాంకుల చుట్టూ తిరుగుతాయి. మహాఘట్‌బంధన్‌కు ముస్లిం సమాజం (17%), యాదవులు (14%) ప్రధాన మద్దతు. అయితే చదువుకున్న యువ యాదవులు స్వల్పంగా ఎన్‌డీఏ వైపు మొగ్గు చూపవచ్చు. ఎన్‌డీఏ వైపు అగ్రవర్ణాలు, ఓబీసీలు బలంగా ఉంటారు. దళితులు (20%)లో మూసహార్ కమ్యూనిటీ (5%)కు హిందుస్తాన్ అవామీ మోర్చా, ఆర్‌జేడీ, ఎల్‌జేపీ (ఇది రెండు భాగాలుగా విభజించబడి, ఒకటి కాంగ్రెస్‌తో, మరొకటి బీజేపీతో) మద్దతు ఉంది. చమార్ సమాజం మహాఘట్‌బంధన్‌కు సానుకూలం. ఈ స్పష్టమైన విభజనల మధ్య తటస్థ ఓటర్లు, చిన్న పార్టీల ప్రభావం కీలకం. జన్ సురాజ్ పార్టీ (ప్రశాంత్ కిశోర్) మద్దతు 10% నుంచి 6%కి తగ్గడం, ఎన్‌డీఏకు అనుకూలం. ఆప్ అన్ని స్థానాల్లో పోటీ ప్రకటించడం వల్ల ఓట్లు చీలే అవకాశం ఉంది. బీజేపీ వ్యతిరేక ఓట్లు విభజించబడితే, జేడీయూ?బీజేపీ కలిసి మెజారిటీ సాధించవచ్చు.ఇక ఇప్పటి వరకు మోదీ రంగంలోకి దిగలేదు. ఆయన కూడా బిహార్ ఎన్నికల్లో ఎన్డీఏ తరఫున నాలుగైదు సభలు నిర్వహించే అవకాశం ఉంది. డబుల్ ఇంజిన్ సర్కార్ నినాదం చాలా రాష్ట్రాల్లో బీజేపీకి అనుకూలంగా మారింది. ఈ నేపథ్యంలో బిహార్ ఎన్నికల్లో కూడా అదే నినాదంతో ముందుకు సాగే అవకాశం ఉంది. ఇప్పటికే వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో మోదీ వచ్చిన తర్వాత పరిస్థితులు మరింత మారుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో 67 స్థానాలు 3 వేల ఓట్ల మెజారిటీతోనే నిర్ణయించబడ్డాయి, ఇది ఈసారి కూడా హోరాహోరీ పోటీ సూచిస్తోంది. తటస్థ ఓటర్లు తగ్గుతున్న నేపథ్యంలో, పథకాలు, నాయకుల ఇమేజ్ ఫలితాలను ప్రభావితం చేస్తాయి. మొత్తంగా, ఎన్‌డీఏకు స్వల్ప ఆధిక్యం కనిపిస్తున్నా, మహాఘట్‌బంధన్ సరిహద్దు ప్రాంతాల్లో బలపడితే సస్పెన్స్ కొనసాగుతుంది. ఈ ఎన్నికలు బిహార్ రాజకీయాల్లో కొత్త అధ్యాయాన్ని రాస్తాయని అంచనా.

# బిజినెస్ వాయిస్

## ఫిన్‌ఫ్లూయెన్సర్ కంటెంట్‌ను ట్రాక్ చేసేందుకు ఏఐ టూల్ తీసుకొస్తున్న సెబీ




స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) చట్టవిరుద్ధమైన లేదా తప్పుదారి పట్టించే యాడ్స్, సోషల్ మీడియా కంటెంట్‌ను గుర్తించి సమీక్షించడానికి కృత్రిమ మేధస్సు(ఏఐ)తో కూడిన వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. దీనికి రెగ్యులేటరీ ఏఐ-డ్రైవెన్ అడ్వర్టైజ్‌మెంట్ రివ్యూయర్ (రా(ఏఐ)డార్) అనే పేరు పెట్టింది. ఈ టూల్ ఆన్‌లైన్‌లో పెట్టుబడుల గురించి ఉండే అన్ని రకాల కంటెంట్‌ను పరిశీలిస్తుంది. వాటిలో తప్పుడు, ప్రమాదకరమైన, చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను తక్షణం కనిపెడుతుంది. ఇటీవల సెబీ ట్రేడింగ్ కార్యకలాపాలను పర్యవేక్షించడానికి, ప్రారంభ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) పత్రాలను ప్రాసెస్ చేయడానికి, మార్కెట్ తీరును విశ్లేషించడానికి, పెట్టుబడుల సలహాదారులు, పరిశోధన విశ్లేషకులను పరిశీలించడానికి ఇన్-హౌస్ ఏఐ సాధనాల వినియోగాన్ని క్రమంగా విస్తరిస్తోంది. ఇటీవల, సెబీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఇప్పటికే 1,00,000 కంటే ఎక్కువ అనుమానాస్పద పోస్ట్‌లను కనిపెట్టింది. వాటిని తొలగించడానికి మెటా, గూగుల్ వంటి కంపెనీలతో సెబీ కలిసి పనిచేస్తోంది. రా(ఏఐ)డార్‌తో సెబీ తప్పుదోవ పట్టించే పోస్ట్‌లను వేగంగా పట్టుకోవాలని, తప్పుడు హామీ లేదా చెడు సలహాల ద్వారా తప్పుదారి పట్టకుండా సాధారణ పెట్టుబడిదారులను రక్షించాలని ఆశిస్తోంది.

## ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్ పరిధిలోకి కేంద్ర, రాష్ట్ర సహకార బ్యాంకులు




రాష్ట్ర సహకార బ్యాంకులు, కేంద్ర సహకార బ్యాంకులు ఈ ఏడాది నవంబర్ 1 నుంచి అంబుడ్స్‌మన్ పథకం పరిధిలోకి వస్తాయని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మంగళవారం వెల్లడించింది. దీంతో ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ పథకం కిందకు కమర్షియల్ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, రాష్ట్ర సహకార బ్యాంకులు, కేంద్ర సహకార బ్యాంకులు, షెడ్యూల్డ్ ప్రైమరీ (పట్టణ) సహకార బ్యాంకులు, రూ. 50 కోట్ల డిపాజిట్ పరిమాణం కలిగిన నాన్-షెడ్యూల్డ్ ప్రైమరీ (పట్టణ) సహకార బ్యాంకులు వస్తాయి. హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు తప్ప అన్ని నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీలు) ఈ పథకంలో చేరతాయి. వారు కస్టమర్ల నుంచి డిపాజిట్లు స్వీకరించేందుకు, కస్టమర్ ఇంటర్‌ఫేస్‌కు అర్హత పొందుతాయి. క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలు కూడా అంబుడ్స్‌మన్ కిందకు వస్తాయి. వీటిని అంబుడ్స్‌మన్ పథకం పరిధిలోకి తీసుకురావడం ద్వారా వినియోగదారులకు ఎక్కువ రక్షణ లభిస్తుంది. దీనికి ముందు, అనేక సహకార బ్యాంకులు ఆర్‌బీఐ ఫిర్యాదుల పథకం కిందకు చేరలేదు. కొన్ని సంస్థలు పాక్షికంగా మాత్రమే కవర్ అయ్యాయి. తాజా మార్పుతో ఎక్కువ మంది కస్టమర్‌లు తమ బ్యాంకు నుంచి ఏవైనా లోపాలు, సేవలు లభించకపోతే పరిష్కారం, పరిహారం కోరే అవకాశాన్ని పొందుతారు. తద్వారా బ్యాంకులు మరింత జవాబుదారీని కలిగి ఉంటాయి.

# బంగారంపై ట్యాక్స్ రూల్స్ మారాయి



బంగారం ధరలు కొంత కాలంగా పెరుగుతూనే ఉన్నాయి. కొనుగోలు చేయాలనుకుంటున్న వారికి ధర చూస్తే చుక్కలు కనిపిస్తున్నాయి. 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర రూ. 1 లక్ష మార్కు చేరుకున్నప్పుడే షాకైన జనం.. తర్వాత 22 క్యారెట్ల గోల్డ్ జువెల్లరీ రేటు కూడా రూ. 1 లక్ష మార్కు దాటి ఇప్పుడు రూ. 1.10 లక్షలపైన ఉంది. దీంతో మరింత బెంబేలెత్తిపోతున్నారు. ఇంటర్నేషనల్ మార్కెట్లోనూ గోల్డ్ రేట్లు ఆల్ టైమ్ రికార్డు గరిష్టాలకు చేరాయి. అమెరికా షట్ డౌన్ సహా యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుండటం వంటి కారణాలతో పెట్టుబడిదారులు.. బంగారంపై ఇన్వెస్ట్ చేస్తున్నారు. దీంతో ధర ఇంకా పెరుగుతోంది. అయినప్పటికీ.. ఇక్కడ ఇన్వెస్టర్లు మంచిగా లాభపడుతున్నారని చెప్పొచ్చు. దీంతో భౌతిక బంగారం కొనుగోలు చేసిన వారికి.. ఇతర పెట్టుబడి సాధనాల్లో బంగారంపై ఇన్వెస్ట్ చేసిన వారికి కూడా మంచి లాభాలే వచ్చాయి. ఇక్కడ మీరు బంగారం విక్రయిస్తే వచ్చే లాభాలపై పన్ను చెల్లించాలన్న సంగతి తెలుసా. దీనికి కొన్ని పరిమితులు ఉంటాయి. 2024, జులై 23 నుంచి గోల్డ్ ఇన్వెస్ట్‌మెంట్ గెయిన్స్‌పై కొత్త ట్యాక్స్ రూల్స్ అమల్లోకి వచ్చాయి. ముఖ్యంగా ఇక్కడ దీర్ఘకాలిక మూలధన లాభాలపై ట్యాక్స్ గురించి మాట్లాడుకోవాలి. బంగారు ఆభరణాలు అయినా, డిజిటల్ పెట్టుబడులు అయినా.. విక్రయించినప్పుడు లాభాలపైన ఎంత పన్ను కట్టాలో ఇప్పుడు తెలుసుకుందాం. మీరు బంగారం కొనుగోలు చేసినప్పుడు ఆదాయపు పన్ను వర్తించదు. కానీ ఇక్కడ జీఎస్టీ పడుతుంది. ఇది 3 శాతంగా ఉంటుంది. ఇంకా నగలు కొనుగోలు చేసే సమయంలో.. మేకింగ్ ఛార్జీలపై మరో 5 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఇక విక్రయించే విషయానికి వస్తే.. కొత్త రూల్స్ కింద ఇండెక్సేషన్ బెనిఫిట్ (ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేయడం) తొలగించారు. మీరు భౌతిక బంగారం అంటే జువెల్లరీ, కడ్డీలు వంటి వాటిల్లో 24 నెలల్లోపు హోల్డింగ్ చేస్తే.. ఇక్కడ షార్ట్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ పన్ను శ్లాబు ప్రకారం చెల్లించాలి. 24 నెలలు దాటితే ఇక్కడ లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ 12.5 శాతంగా ఉంది. గోల్డ్ ఈటీఎఫ్, మ్యూచువల్ ఫండ్స్‌లో 12 నెలలలోపు విక్రయిస్తే.. ఇక్కడ పన్ను శ్లాబుల ప్రకారం.. షార్ట్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ పడుతుంది. 12 నెలలు దాటితే 12.5 శాతం లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ చెల్లించాలి. ఇక్కడ షార్ట్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ అంటే.. మీకు ఇక్కడ వచ్చిన లాభాల్ని.. మీ మొత్తం ఆదాయంలో కలుపుతారు. అప్పుడు ఆదాయపు పన్ను విధానాల్లోని ట్యాక్స్ శ్లాబుల ఆధారంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

# హెచ్‌సీఎల్ టెక్‌కు గుర్తింపు.. వరల్డ్స్ మోస్ట్ సస్టయినబుల్ కంపెనీస్2025 చోటు




గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ హెచ్‌సీఎల్‌టెక్‌కు టైమ్ మ్యాగజైన్ రెండు గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో స్థానం కల్పించింది. 'వరల్డ్స్ బెస్ట్ కంపెనీస్ 2025', 'వరల్డ్స్ మోస్ట్ సస్టయినబుల్ కంపెనీస్ 2025' ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకుంది.'వరల్డ్స్ బెస్ట్ కంపెనీస్ 2025'లో వరుసగా రెండో ఏడాది కూడా చేరింది. ప్రొఫెషనల్ సర్వీసెస్‌లో గ్లోబల్? టాప్-20 కంపెనీల్లో స్థానం దక్కించుకుంది. 'వరల్డ్స్ మోస్ట్ సస్టైనబుల్ కంపెనీస్ 2025'లో ప్రొఫెషనల్ సర్వీసెస్‌లో టాప్-15లో నిలిచింది. వివో వీ60ఈ స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. 200ఎంపీ అల్ట్రా-క్లియర్ మెయిన్ కెమెరా, ఏఐ ఫెస్టివల్, పోర్ట్రెయిట్ వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి. దీనిలోని 6500ఎంఏహెచ్ బ్యాటరీకి 90 వాట్ల ఫ్లాష్‌చార్జింగ్ సదుపాయం ఇచ్చారు. వీ60ఈలో ఏఐ ఇమేజ్? ఎక్స్‌పాండర్? వంటి స్మార్ట్ ఏఐ ఫీచర్లు ఉన్నాయి. మీడియాటెక్? డైమెన్సిటీ 7360 టర్బో ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. ధర ధర రూ. 29,999 నుంచి ప్రారంభమవుతుంది. పండుగ సీజన్ సందర్భంగా, ప్లాటినం గిల్డ్ ఇంటర్నేషనల్ (పీజీఐ) ఇండియా 'మెన్ ఆఫ్ ప్లాటినం ఎంఎస్ ధోని సిగ్నేచర్ ఎడిషన్'ను తిరిగి తీసుకువచ్చింది. ఈ నగలను 95శాతం స్వచ్ఛమైన ప్లాటినంతో తయారు చేశారు. కొత్త కలెక్షన్‌లో స్కల్ప్?చరల్? లింక్ బ్రాస్‌లెట్‌లు, డ్యూయల్-టోన్ పీస్‌లు ఉన్నాయి. వీటిని కొన్న వాళ్లు 2026 ప్రారంభంలో ముంబైలో జరగనున్న కార్యక్రమంలో ఎంఎస్ ధోనిని కలుసుకునే అవకాశం ఉంటుంది. విప్రో కన్స్యూమర్ కేర్ మ్యాక్స్ క్లీన్, 2-ఇన్-1 ఫ్లోర్ క్లీనర్‌ను విడుదల చేసింది. ఇది క్రిములనూ, కీటకాలనూ తరిమి కొడుతుంది.

# అతడే భారత టీ20 జట్టు ఫ్యూచర్ కెప్టెన్



భారత క్రికెట్‌లో కెప్టెన్సీ విషయంలో పరిస్థితులు చాలా వేగంగా మారిపోయాయి. టీ20 ప్రపంచకప్ 2024కి ముందు వరకు.. టీమిండియా ఆల్ ఫార్మాట్ కెప్టెన్‌గా రోహిత్ శర్మ ఉన్నాడు. కానీ అతడు టీ20 ప్రపంచకప్ టైటిల్ గెలిచాక పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పడం, ఆ తర్వాత టెస్టుల నుంచి కూడా తప్పుకోవడంతో కొత్త కెప్టెన్ ఎంపిక అనివార్యమైంది. ఈ రెండు ఫార్మాట్‌ల నుంచి అతడు తప్పుకున్నాక కొత్త సారథిని ఎంపిక చేశారు. కానీ వన్డేల్లో మాత్రం అతడిని తప్పించి మరీ.. శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్ చేసింది బీసీసీఐ. ఆసియాకప్ 2025 కోసం భారత టీ20 జట్టు వైస్ కెప్టెన్‌గాను గిల్ ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో త్వరలోనే శుభ్‌మన్.. టీమిండియా ఆల్ ఫార్మాట్ కెప్టెన్ అవుతాడనే విశ్లేషణలు మొదలయ్యాయి. కానీ ఈ వాదనను టీమిండియా మాజీ ప్లేయర్ రాబిన్ ఉతప్ప విభేధించాడు. వన్డే, టెస్టులలో గిల్ కెప్టెన్ అయినప్పటికీ టీ20లలో మాత్రం అతడికి సారథ్య బాధ్యతలు ఇప్పట్లో అప్పగించే అవకాశం లేదని చెప్పుకొచ్చాడు. అందుకు గల కారణాన్ని సైతం వివరించాడు.'టెస్ట్ క్రికెట్‌లో శుభ్‌మన్ గిల్ మంచి ఆటగాడని నేను అనుకుంటున్నా. వన్డేల్లోనూ అతడి గణాంకాలు బాగున్నాయి. కానీ కెప్టెన్ రేంజ్ ఆటగాడికి మరింత మెరుగైన గణాంకాలు ఉండాలి. భారత సెలక్టర్లు టీ20లకు కెప్టెన్‌గా మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌ను పరిశీలిస్తారని భావిస్తున్నా. ఎందుకంటే భారత టీ20 జట్టులో గిల్ ఇంకా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోలేదు. ఆసియాకప్ 2025లోనూ గిల్ సరైన ప్రదర్శన చేయలేదు. దీంతో అభిషేక్ శర్మతో ఓపెనింగ్ చేసేందుకు సంజు శాంసన్, యశస్వి జైశ్వాల్ మధ్య పోటీ నెలకొంది' అని రాబిన్ ఉతప్ప అభిప్రాయపడ్డాడు. 'గిల్ టీ20 కెప్టెన్ కావాలంటే.. ముందుకు మెరుగైన ఆటతీరుతో జట్టులో సుస్థిర స్థానం సంపాదించుకోవాలి. అందుకే అతడు ఇప్పట్లో అన్ని ఫార్మాట్‌లలో కెప్టెన్ అవుతాడని అనుకోవట్లేదు. భారత క్రికెట్‌లో రాత్రికి రాత్రే పరిస్థితులు మారిపోతాయని మనకు తెలుసు. వాస్తవంగా మాట్లాడుకోవాలంటే టీమిం డియాలో వైస్ కెప్టెన్సీకి ప్రాధాన్యత ఉండదు. ఎంతో మంది వైస్ కెప్టెన్‌లు కెప్టెన్‌లు కాకుండానే ఆటకు వీడ్కోలు పలికారు' అని రాబిన్ ఉతప్ప వ్యాఖ్యానించాడు.

# క్రీడా వాయిస్

## అమెరికాలో 'క్లచ్ చెస్' రణరంగం



అమెరికాలో ప్రతిష్ఠాత్మక క్లచ్ చెస్ టోర్నమెంట్ ప్రారంభం కానుండడంతో చెస్ ప్రపంచం దృష్టి అటువైపు మళ్లింది. ఈ టోర్నీలో ప్రపంచ చెస్ చరిత్రలోనే అత్యంత ఉత్కంఠభరితమైన కొన్ని పోరాటాలు జరగనున్నాయి. ముఖ్యంగా, చిరకాల ప్రత్యర్థులు, చెస్ దిగ్గజాలు అయిన భారత సూపర్‌స్టార్ విశ్వనాథన్ ఆనంద్ మరియు రష్యా గ్రేట్ గ్యారీ కాస్పరోవ్ మరోసారి తలపడనుండడం అభిమానుల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. వీరిద్దరి మధ్య ఇప్పటివరకు జరిగిన చారిత్రక పోరాటాల్లో కాస్పరోవ్‌కు మెరుగైన రికార్డు ఉండగా, ఈ కొత్త ఫార్మాట్‌లో ఆనంద్ విజయం సాధించి పాత రికార్డును తిరగరాస్తాడేమోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ టోర్నమెంట్‌లో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న మరో ముఖ్య పోరు, ప్రస్తుత ప్రపంచ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) మరియు భారతదేశ యువ సంచలనం డి. గుకేశ్ మధ్య జరగనుంది. గుకేశ్ ఇటీవల కాలంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆటగాడిగా గుర్తింపు పొందాడు. అయితే, గుకేశ్‌పై అన్ని ఫార్మాట్‌లలో కార్ల్‌సన్‌దే పైచేయిగా ఉంది. ఈ పోరులో గుకేశ్ తన సమకాలీన ఆధిపత్యాన్ని చెరిపేసి, ప్రపంచ నంబర్ 1కు షాక్ ఇస్తాడని భారత అభిమానులు ఆశిస్తున్నారు. యువ ఆటగాడి దూకుడు మరియు అనుభవజ్ఞుడైన కార్ల్‌సన్ వ్యూహం మధ్య జరిగే ఈ ఘర్షణ అత్యంత ఆకర్షణీయంగా ఉండబోతుంది. క్లచ్ చెస్ టోర్నమెంట్ అనేది అంతర్జాతీయ చెస్ క్యాలెండర్‌లో అత్యంత ముఖ్యమైన ఈవెంట్లలో ఒకటి. ఇది సాధారణంగా వేగవంతమైన రాపిడ్, బ్లిట్జ్ ఫార్మాట్‌లను కలిగి ఉంటుంది, ఇవి ఆటగాళ్లపై తీవ్రమైన ఒత్తిడిని కలిగిస్తాయి మరియు ఊహించని మలుపులకు అవకాశం ఇస్తాయి. ఈ కారణంగానే, సుదీర్ఘ క్లాసికల్ గేమ్స్‌లో ఆధిపత్యం వహించిన ఆటగాళ్లపై కూడా కొత్త ఆటగాళ్లు విజయం సాధించే అవకాశం ఉంటుంది. ఆనంద్, కాస్పరోవ్ వంటి లెజెండ్స్‌కు ఈ వేగవంతమైన ఫార్మాట్‌లో ఇప్పటికీ అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉన్నప్పటికీ, కార్ల్‌సన్, గుకేశ్ వంటి యువ ఆటగాళ్ల మెరుపు వేగం, అపారమైన కంప్యూటర్ తయారీ వ్యూహాలతో కూడిన ఈ టోర్నీలో ఎవరు పైచేయి సాధిస్తారో చూడాలి. చెస్ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన ఆటగాళ్లలో కొందరిని ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఈ టోర్నీ, కేవలం క్రీడా పోటీ మాత్రమే కాదు, తరాల మధ్య పోరాటంగా కూడా పరిగణించబడుతుంది. ఒకవైపు తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోవాలని చూస్తున్న దిగ్గజాలు, మరోవైపు పాత రికార్డులను చెరిపివేసి, చరిత్ర సృష్టించాలని చూస్తున్న యువ సంచలనాలు. ఈ క్లచ్ చెస్ టోర్నమెంట్ చెస్ అభిమానులకు మరపురాని అనుభూతిని అందిస్తుందనడంలో సందేహం లేదు. అంతిమంగా, ఈ టోర్నీలో విజేతగా నిలిచేదెవరో, కొత్త చరిత్రను లిఖించేదెవరో తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడక తప్పదు.

# థండర్‌బోల్ట్స్ బోణీ



ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్ లో కోల్‌కత థండర్‌బోల్ట్స్ అదరగొట్టింది. మంగళవారం హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో కోల్‌కత థండర్‌బోల్ట్స్ 3-1 (12-15, 15-13, 15-6, 19-17)తో కొచ్చి బ్లూ స్పైకర్స్‌పై అద్భుత విజయం సాధించింది. సర్వ్, స్పైక్స్‌లో రెచ్చిపోయిన కోల్‌కత థండర్‌బోల్ట్స్ సీజన్లో బోణీ కొట్టింది. కోల్‌కత విజయంలో కీలక పాత్ర పోషించిన పంకజ్ శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. కొచ్చి బ్లూ స్పైకర్స్ ఆటగాడు హేమంత్ పవర్‌ఫుల్ సర్వీసులతో మెరువగా ఆ జట్టు మ్యాచ్‌ను దూకుడుగా మొదలెట్టింది. ఇరు జట్ల డిఫెన్స్ పటిష్టంగా ఉండటంతో పాయింట్ల కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. కొచ్చి సెట్టర్ బైరాన్ తెలివైన పాస్‌లతో కోల్‌కతను ఒత్తిడిలోకి నెట్టి తొలి సెట్‌లో సొంతం చేసుకునేలా చేశాడు. రెండో సెట్ నుంచి కోల్‌కత అసలు ఆట మొదలుపెట్టింది. కెప్టెన్ అశ్వల్ రారు, పంకజ్ శర్మ పదునైన స్పైక్‌లతో కొచ్చి కోర్టులో అలజడి సృష్టించారు. అభిషేక్ సూపర్ సర్వ్‌తో ఆకట్టుకున్నా అనవసర తప్పిదాలు కొచ్చి జట్టుకు ప్రతికూలంగా మారాయి. కొచి తప్పిదాలను సొమ్ముచేసుకున్న కోల్‌కత రెండో సెట్‌ను ఖాతాలో వేసుకుంది. మూడో సెట్‌లో కోల్‌కత పూర్తి ఆధిపత్యం చెలాయించింది. మిడిల్ జోన్‌లో మాటిన్ అద్భుతంగా రాణించడంతో కొచ్చి తేలిపోయింది. ఈ సెట్‌ను కోల్‌కతా 15-6తో సునాయాసంగా కైవసం చేసుకుంది. నాలుగో సెట్ నువ్వానేనా అన్నట్టు సాగింది. కొచ్చి చివరి వరకు పోరాడినప్పటికీ, కీలక సమయంలో మాటిన్ అద్భుతమైన బ్లాక్‌తో కోల్‌కతాకు 19-17తో సెట్‌తో పాటు మ్యాచ్‌ను కూడా అందించాడు.




## 'మాస్ జాతర' పాటపై నెటిజన్ల ట్రోల్స్.. స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన రవితేజ!

మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న మోస్ట్ అవైయిటెడ్ చిత్రం 'మాస్ జాతర'. ఈ సినిమా పలు కారణాల వల్ల విడుదల వాయిదా పడుతూ వస్తోంది. దీంతో ఆయన అభిమానులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఈక్రమంలోనే.. రవితేజ 'మాస్ జాతర' ఫుల్ ఎంటర్‌టైన్ చేసేందుకు అక్టోబర్ 31న థియేటర్స్‌లోకి రాబోతున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో చిత్రబృందం ఫుల్ బిజీ బిజీగా గడుపుతున్నారు. వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్నారు. తాజాగా, రవితేజ, శ్రీలీల భాను భోగవరపు సుమతో చిట్ చాట్‌లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా.. గత కొద్ది రోజులుగా 'మాస్ జాతర' సాంగ్‌పై ట్రోల్స్ చేస్తున్న నెటిజన్లకు రవితేజ కౌంటర్ ఇచ్చాడు. అసలు విషయంలోకి వెళితే.. ఇటీవల ఈ సినిమా నుంచి విడుదలైన ఓలే ఓలే సాంగ్ బాగానే మార్కులు కొట్టేసి యూట్యూబ్‌లో ట్రెండింగ్ అయింది. ఇది ఎంతగా పాపులర్ అయ్యిందో.. అంతే స్థాయిలో విమర్శలు, ట్రోల్స్ కూడా ఎదుర్కొంది. ఇందులో "నీ అమ్మ, నీ అయ్యా, నీ అక్క, నీ చెల్లి గుంట నీ ఒళ్లో కొచ్చి పంట, సిగ్గు లేదు, షేరము లేదు, లాగు లేదు" అనే పదాలు వివాదాస్పదమయ్యాయి. చాలామంది అసభ్యంగా ఉందంటూ ట్రోల్స్ చేస్తున్నారు. జానపద స్టైల్ పేరుతో పాటలను పాడు చేస్తున్నారని మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే రవితేజ ఈ విషయంపై స్పందిస్తూ.. "పాటలోని కొన్ని లైన్స్ మాత్రమే విని కొందరు విమర్శలు చేస్తున్నారు. కానీ ఆ పాట అర్థం తెలియాలంటే సినిమా చూస్తేనే అర్థమవుతుంది. కాబట్టి ట్రోల్స్ చేయడం కరెక్ట్ కాదు.. మొత్తం వినండి. ఈ పాటను కథ డిమాండ్‌ను బట్టి పెట్టారు. కొన్నిటిపై బోల్డ్ మూవీలు అనే ముద్ర వేస్తారు. అలాంటి వాటితో ఎవరికీ ఇబ్బంది రాదు. కానీ వారికి నా సినిమాతో మాత్రమే సమస్య వచ్చింది. మా గ్రామాల్లో స్థానికంగా జరిగే ఉత్సవాల్లో కొంతమంది చిన్న చిన్న కథలు పాటలుగా చెబుతుంటారు. వాళ్లు తిట్టకున్నట్లు అనిపిస్తుంది. వాస్తవానికి వాళ్లు చాలా ప్రేమగా మాట్లాడుకుంటారు." అని చెప్పుకొచ్చారు. కాగా, 'మాస్ జాతర' మూవీ శ్రీలీల, రవితేజ కాంబోలో రాబోతున్న రెండో ప్రాజెక్ట్ కావడంతో ప్రేక్షకుల్లో అంచనాలున్నాయి. భాను భోగవరపు దర్శకత్వంలో రాబోతుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీకర స్టూడియోస్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై నాగవంశీ నిర్మిస్తున్నారు.

## ఇది నాకు పెద్ద సవాలుగా మారింది..

మలయాళ యంగ్ హీరోయిన్ కళ్యాణి ప్రియదర్శన్ 'హలో' సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయం అయింది. ఆ తర్వాత తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో పలు చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు దక్కించుకుని ఇండస్ట్రీలో రాణిస్తోంది. ఇక ఇటీవల లోకా: చాప్టర్ 1' సినిమాతో అమ్మడు రేంజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఈ మూవీ ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్‌గా నిలిచింది. అంతేకాకుండా 'లోకా:చాప్టర్1' మూవీతో కళ్యాణి సూపర్ హీరోగా మారిన మొదటి బ్యూటీగా రికార్డు క్రియేట్ చేసింది. భారీ కలెక్షన్లు రాబట్టి.. బాక్సాఫీసును షేక్ చేస్తోంది. ఇప్పటికీ థియేటర్స్‌లో సక్సెస్ ఫుల్‌గా సాగుతోంది. ఈ నేపథ్యంలో.. తాజాగా, కళ్యాణి ప్రియదర్శన్ ఓ కొత్త సినిమాను ప్రటిస్తూ ఓ పోస్ట్ పెట్టింది. 'జీని' తమిళ చిత్రంతో రాబోతుంది. ఇక ఇందులోంచి ఫస్ట్ సింగిల్ 'అబ్ది.. అబ్ది' సాంగ్ షేర్ చేస్తూ.. "నటిగా నేను ఎప్పుడూ చేయని పనులు చేయడానికి నన్ను నేను సిద్ధం చేసుకోవడానికి ప్రయత్నిస్తాను. ఇది నాకు సవాలుగా మారింది. ఈ పాట అలాంటి క్షణాలలో ఒకటి. మా దర్శకుడు భువనేష్ దాని గురించి నాకు చెప్పినప్పుడు, అతను ఇంత మంచి వాణిజ్య సంగీత భాగాన్ని 'జీని' కథలో నిజమైన, ముఖ్యమైన భాగంగా ఎంత చక్కగా తీర్చిదిద్దాడో చూసి నేను ఆశ్చర్యపోయాను. మీరందరూ దానిని సినిమాలో చూసే వరకు నేను వేచి ఉండలేను. దాని వెనుక ఉన్న కారణాలు చాలా శక్తివంతమైనవి. ఈ సినిమా కోసం నేను చాలా కష్టపడి పనిచేశాను. కొత్తగా ప్రయత్నించాను. మీ అందరికీ ఇది నచ్చుతుందని నేను నిజంగా ఆశిస్తున్నాను" అని రాసుకొచ్చింది. అలాగే రెడ్ కలర్ డ్రెస్ ధరించి నడుము, చూపిస్తూ కుర్రకారుకు హీట్ పుట్టిస్తోంది.



విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
విద్య వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

## కార్తీ 'వా వాతియార్' రిలీజ్ డేట్ ఫిక్స్..

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య తమ్ముడిగా ఇండస్ట్రీకి వచ్చిన కార్తీ ఎన్నో హిట్స్ తన ఖాతాలో వేసుకున్నారు. గత ఏడాది 'సత్యం సుందరం'తో ప్రేక్షకులను మెప్పించారు. ప్రజెంట్ వరుస సినిమాల్లో నటిస్తూ ఫుల్ బిజీగా ఉన్నాడు. తన నటనతో ప్రేక్షకుల కట్టిపడేసిన కార్తీ 'వా వాతియార్' మూవీతో రాబోతున్నారు. నలన్ కుమారస్వామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. స్టూడియో గ్రీన్ బ్యానర్‌పై కెఇ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. ఇక ఇందులో కార్తీ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తుండటం విశేషం. ఇప్పటికే ఖాకి, సర్దార్ వంటి చిత్రాల్లో పోలీస్‌గా నటించిన ఆయన మూడో సారి అదే గెటప్‌లో కనిపించనున్నాడు. ఈ సినిమాలో సత్యరాజ్, రాజ్ కిరణ్, జిఎం సుందర్, కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇప్పటికే 'వా వాతియార్' నుంచి విడుదలైన అప్డేట్స్ ప్రేక్షకుల్లో మంచి రెస్పాన్స్‌ను దక్కించుకున్నాయి. ఇక ఈ మూవీ పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తోంది. దీంతో కార్తీ ఫ్యాన్స్ తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఎప్పుడెప్పుడు థియేటర్స్‌లోకి వస్తుందా? అని ఎదురుచూస్తున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా, మూవీ మేకర్స్ 'వా వాతియార్' రిలీజ్ తేదీని ప్రకటిస్తూ అధికారిక ప్రకటన చేశారు. ఈ సినిమా డిసెంబర్ 5న థియేటర్స్‌లోకి రాబోతున్నట్లు తెలుపుతూ.. కార్తీ ఓ తాడు పట్టుకుని నిల్చొన్న పోస్టర్‌ను షేర్ చేశారు. ఇక పోస్టర్‌నంతా ఎరుపు రంగుతో డిజైన చేయడం గమనార్హం. ఈ పోస్ట్‌కు "ది స్వాగ్ మాస్టర్ డేట్ లాక్ చేసుకున్నాడు. డిసెంబర్ 5న 'వా వాతియార్' థియేటర్స్‌లో బ్లాస్ట్ చేయనుంది" అనే క్యాప్షన్ జత చేశారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న కార్తీ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.




## కాంతారకు అక్కడ షాకే..

గత గురువారం ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాల మధ్య విడుదలైంది కాంతార: చాప్టర్-1 సినిమా. రిలీజ్ ముంగిట అడ్వాన్స్ బుకింగ్స్ ఆశించినంత జోరుగా లేకపోయినా.. విడుదల రోజు అద్భుత స్పందనే వచ్చిందీ చిత్రానికి. తొలి రోజే రూ.90 కోట్ల దాకా గ్రాస్ కొల్లగొట్టిందీ సినిమా. వీకెండ్లోనే వసూళ్లు రూ.300 కోట్లను దాటిపోయాయి. వారాంతం అయ్యాక వసూళ్లు డ్రాప్ అయినప్పటికీ.. అది ఆందోళన కలిగించే స్థాయిలో అయితే లేదు. కన్నడ, తెలుగు, తమిళంలో సినిమాకు మంచి స్పందనే వస్తోంది. దేశవ్యాప్తంగా కాంతార ప్రీక్వెల్ మంచి ఊపులోనే సాగుతోంది. ఈ వీకెండ్లో పెద్ద రిలీజ్‌లేమీ లేవు కాబట్టి.. కాంతార: చాప్టర్-1 ఇండియన్ బాక్సాఫీస్‌లో లీడర్‌గా కొనసాగడం ఖాయం. కన్నడలో, హిందీలో సినిమాకు లాంగ్ రన్ ఉంటుందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. తెలుగులో కూడా దీపావళి సినిమాలు వచ్చే వరకు కాంతారకు ఢోకా లేనట్లే. మొత్తంగా ఇండియాలో అన్ని ఏరియాల బయ్యర్లకు మంచి లాభాలు రావడం ఖాయంగా కనిపిస్తోంది. కానీ ఓవర్సీస్‌లో మాత్రం కాంతార: చాప్టర్-1కు బాక్సాఫీస్ దగ్గర షాక్ తప్పేలా లేదు. ముఖ్యంగా యుఎస్‌లో ఈ సినిమా బయ్యర్‌కు నష్టాలు అనివార్యంగా కనిపిస్తున్నాయి. ఈ సినిమా ఓవర్సీస్ రైట్స్ కోసం ఏకంగా 50 కోట్ల దాకా పెట్టుబడి పెట్టేశారు. కాంతార ప్రీక్వెల్ కావడంతో జనం ఎగబడి చూస్తారనే ధీమాతో భారీ పెట్టుబడి పెట్టారు. కానీ ఈ చిత్రం ప్రిమియర్స్ నుంచే ఆశించిన వసూళ్లు రాబట్టలేదు. వీకెండ్ అయ్యేసరికి వసూళ్లు 2.7 మిలియన్ డాలర్లకు పరిమితం అయ్యాయి. రెండో వీకెండ్ కూడా మంచి వసూళ్లే వస్తాయని అంచనా వేస్తున్నప్పటికీ.. అవి సరిపోవు. ఫుల్ రన్లో వసూళ్లు 4-5 మిలియన్ డాలర్ల మధ్య ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.



## విక్రమ్ కొడుకు కామెంట్లపై దుమారం



కోలీవుడ్లో అరంగేట్రానికి ముందే మంచి హైప్ తెచ్చుకున్నప్పటికీ.. తొలి సినిమా విషయంలో తీవ్ర గందరగోళం నెలకొనడంతో బాగా ఇబ్బంది పడ్డ నటుడు ధ్రువ్ విక్రమ్. లెజెండరీ నటుడు విక్రమ్ తనయుడైన ఈ కుర్రాడిని అర్జున్ రెడ్డి రీమేక్ వర్మతో లాంచ్ చేయాలనుకున్నారు. కానీ సీనియర్ దర్శకుడు బాల తీసిన ఆ సినిమాపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆ చిత్రాన్ని ట్రాష్‌లో పడేశారు.మళ్లీ ఆదిత్య వర్మ పేరుతో అదే సినిమాను అర్జున్ రెడ్డి అసిస్టెండ్ డైరెక్టర్ గిరీశయ్యతో రీమేక్ చేయిస్తే.. అది ఓ మోస్తరు ఫలితాన్నందుకుంది. ధ్రువ్ నటనకు పాజిటివ్ ఫీడ్ బ్యాకే వచ్చింది. తర్వాత తన తండ్రి విక్రమ్‌తో కలిసి మహాన్ మూవీ చేశాడు. ఆ సినిమాలో ధ్రువ్ పాత్రకు, నటనకు మంచి పేరే వచ్చింది. కట్ చేస్తే తర్వాత చాలా గ్యాప్ తీసుకుని ఇప్పుడు బైసన్ అనే సినిమాతో రాబోతున్నాడు. పరియేరుం పెరుమాల్, కర్ణన్, మామన్నన్, వాళై లాంటి గొప్ప సినిమాలు తీసిన మారి సెల్వరాజ్.. ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేశాడు. ఈ సినిమా ప్రోమోలు గొప్పగా అనిపించాయి. ఐతే దీపావళి కానుకగా ఈ నెల 17న బైసన్ విడుదల కానున్న నేపథ్యంలో ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషనల్ ఈవెంట్లో ధ్రువ్ చేసిన కామెంట్స్ వివాదాస్పదం అయ్యాయి. తన తొలి రెండు చిత్రాలను ప్రేక్షకులు చూడకపోయినా. పర్వాలేదని.. కానీ బైసన్ మాత్రం కచ్చితంగా చూడాలని.. సినిమాల్లోకి ఇదే తన అసలైన ఎంట్రీ అని భావిస్తున్నానని ధ్రువ్ పేర్కొన్నాడు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com